అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 23-7-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 203 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు + (వెబ్‌లో సోపతి) వెల : 8.00



జంతర్ మంతర్‌లో మణిపూర్ కుకీల భారీ ఆందోళన

న్యాయం కావాలి

5లో..



ఎరువు బరువు..



ముడిసరుకు ధర తగ్గినా..తగ్గించని కేంద్రం

- సబ్సిడీల్లో భారీగా కోత
- ధరలు మాత్రం యథాతథం
- ఆవేదన చెందుతున్న రైతాంగం

కేంద్రం రైతులపై లేని ప్రేమను ఒలకబోస్తూ తనదైన రీతిలో దగా చేస్తోంది. ఎరువుల ధరలే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పొచ్చు. అంతర్జాతీయంగా ఎరువుల ముడిసరుకు ధరలు తగ్గితే రైతులకు ఇస్తున్న సబ్సిడీని తగ్గించుకుంది కానీ ఎరువుల ధరలు ఏమాత్రం తగ్గించలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంట చేలలో కలుపు తొలగించి.. వివిధ రకాల ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దుకాణాల వద్దకు వెళ్లి ఫెర్టిలైజర్ రేట్లు చూసి అవాక్కవుతున్నారు.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రం బడ్జెట్‌లో 2022-23లో ఎరువులపై సబ్సిడీ రూ.2.54 లక్షల కోట్లు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం 22.25% కోత పెట్టి రూ.1.75 లక్షల కోట్లకు తగ్గించింది.

సేంద్రీయ సాగును ప్రోత్సహించే పేరుతో పీఎం ప్రణామ్' పథకాన్ని తీసుకొచ్చి సబ్సిడీకి ఎగనామం పెట్టేందుకు ప్రయత్నిస్తోందని రైతుసంఘాలు ఆరోపిస్తున్నాయి.

యూరియా, డీఏపీ సబ్సిడీల్లో కోత..


రైతులు ఎక్కువగా వినియోగించే యూరియా, డీఏపీ వంటి ఎరువులకు గతంలో ఇచ్చిన సబ్సిడీతో పోలిస్తే ఈసారి కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. యూరియాకు రూ.78వేల కోట్లు, డీఏపీకి రూ.38వేల కోట్లతో సరిపెడుతోంది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గడంతో సబ్సిడీ మొత్తాన్ని తగ్గించినట్టు కేంద్రం చెప్పుకొస్తోంది. కానీ అంతర్జాతీయ ధరల క్షీణతకు ...11లో

సబ్సిడీ తప్పించుకునే యత్నం



ఘనంగా 'వన్ నేషన్.. వన్ ఫర్టిలైజర్'ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం 'భారత్ బ్రాండ్' అనే పేరుతో కంపెనీతో నిమిత్తం లేకుండా ఎరువును తీసుకొచ్చింది. మ్యాన్‌ఫ్యాక్చర్ పేరుతో కంపెనీ పేరు కొద్దిపాటి లెటర్స్‌లో ఉంటుంది తప్ప గతంలో లాగా బోల్డ్ లెటర్లు కనిపించవు. ఇవన్నీ బాగుగా అనిపించినా ఆచరణలో మాత్రం ఎరువుల సబ్సిడీ భారం నుంచి తప్పించుకునే ప్రయత్నాలే.

పుల్లఖండం నాగేందర్‌రావు, ఎరువులు, విత్తన డీలర్ల అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు



దేశానికే సిగ్గుచేటు

మణిపూర్ ఘటనపై ప్రధాని మోడీ స్పందించాలి

- ఆ రాష్ట్ర సీఎం గద్దెదిగాలి : సీపీఐ(ఎం) హైదరాబాద్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మణిపూర్ దుర్మార్గపు ఘటన దేశానికే సిగ్గుచేటు.. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ప్రధాని మోడీ స్పందించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. మణిపూర్‌లో మహిళలపై జరిగిన లైంగికదాడులు, హత్యలను నిరసిస్తూ సీపీఐ(ఎం) హైదరాబాద్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన ...11లో



నిండుకుండల్లా
జంట జలాశయాలు

పూర్తిస్థాయికి చేరిన హిమాయత్‌సాగర్ నీటిమట్టం

- 6 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్ జంట జలాశయాలు నిండుకుండలా మారాయి. హిమాయత్‌సాగర్ చెరువు పూర్తిస్థాయిలో నిండటంతో శనివారం అధికారులు ఆరు గేట్లను ఎత్తారు. నాలుగు రోజుల నుంచి ఎగువ ప్రాంతాలైన తాండూర్, పరిగి, వికారాబాద్, శంకర్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. హిమాయత్‌సాగర్ నుంచి 1375 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. హిమాయత్‌సాగర్ నీటిమట్టం 1763 అడుగులు. గండిపేట్ 1790 అడుగుల నీటిమట్టం ఉండగా, ప్రస్తుతం 1786కు చేరింది. గండిపేట పూర్తిస్థాయిలో ...11లో


మాట్లాడుతున్న జూలకంటి...

మంత్రితో చర్చలు విఫలం

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె యథాతథం

- 27న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుతో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో 17 రోజులుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేయాలని జేఏసీ నేతలు నిర్ణయించారు. దానిలో భాగంగా ఈనెల 27న ...11లో

పెట్టుబడుల పేరుతో
రూ.712 కోట్లు స్వాహా

9 మందిని అరెస్టు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

- వివరాలు వెల్లడించిన సీపీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పెట్టుబడుల పేరుతో రూ.712కోట్లు దండుకున్న 9మంది నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి భారీగా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.10,53,89,943 డబ్బులను వివిధ బ్యాంకుల్లో ఫ్రీజ్ చేశారు. శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో సీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. ముంబాయి, లఖన్‌వూ, గుజరాత్, హైదరాబాద్‌కు చెందిన ఈ ముఠా దుబాయ్, చైనాకు చెందిన నేరస్థులతో సంబంధాలు పెట్టుకున్నారు. పెట్టుబడుల పేరుతో టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఏజెంట్లను నియమించుకుని, షెల్ కంపెనీలు, బ్యాంక్ అకౌంట్స్ ఓపెన్ చేసి చైనా, దుబాయ్ నుంచి నేరుగా ఆపరేట్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో తక్కువ ఇన్వెస్ట్‌మెంట్ చేయించి, టాస్కుల పేరుతో మొదట డబ్బులు చెల్లిస్తున్నారు. ఎక్కువ డబ్బులు ఇన్వెస్ట్‌మెంట్ చేసిన తర్వాత మోసం చేస్తున్నారు. ఈ ముఠా ఇప్పటి వరకు ...11లో

మరో నాలుగు రోజులు వానలు

ఎల్లో అలెర్ట్ జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా పడుతున్న భారీ వర్షాలు వచ్చే నాలుగురోజుల పాటు కొనసాగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈమేరకు శనివారం హెచ్చరిక జారీచేసింది. ముందు జాగ్రత్త చర్యగా 'ఎల్లో' అలెర్ట్‌ను జారీ చేసింది. దక్షిణ ...11లో

వికలాంగుల పింఛన్
రూ.4,016కు పెంపు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వికలాంగుల పింఛన్‌ను రూ.4,016కు పెంచారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వికలాంగులు ప్రతి నెలా రూ.3,016 ...11లో



త్రివిధ దళాల్లో
డిఫెన్స్ ఆఫీసర్ల కొరత

- 11,266 మేజర్, కెప్టెన్ ర్యాంకు అధికారుల ఖాళీలు : లోక్‌సభలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ

వివరాలు 11లో..



ఎన్నికల్లో కమ్యూనిస్టులతో
పొత్తు కీలకం

మంత్రితో విభేదాలు ఒట్టిదే..

- పార్టీ అవకాశం ఇస్తే అమిత్ పోటీ చేస్తారు : శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

వివరాలు 3లో..

విద్యార్థులపైనే రూ.10 వేల భారం

ఇంజినీరింగ్‌లో కనీస ఫీజు రూ.45 వేలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.35 వేలే చెల్లింపు
- 28,598 మంది అభ్యర్థుల ఆందోళన
- 25,869 మందికి వంద శాతం ఫీజు వర్తింపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫీజులు భారీగా పెరిగాయి. దీంతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులపై భారం పడనుంది. అయితే తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) ప్రతిపాదించిన ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన విషయం తెలిసిందే. దాని ప్రకారం కనీస ఫీజు రూ.35 వేల నుంచి రూ.45 వేలకు పెంచింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ మాత్రం రూ.35 వేలే చెల్లించనున్నట్టు స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులపైనే ఆ రూ.పది వేల భారం పడనుంది. గతంలో కనీస ఫీజు రూ.35 వేలు ఉన్నప్పుడు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.35 వేలు చెల్లించేది. కానీ కనీస ఫీజును రూ.45 వేలకు పెంచింది కానీ ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మాత్రం పెంచకపోవడం గమనార్హం. దీంతో పేద విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంసెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ మొదటి విడతలో 70,665 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఇందులో 54,467 (77.1 శాతం) మంది అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు 11,555 మంది, ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారు 11,822 మంది, ఎంసెట్‌లో పదివేల లోపు ర్యాంకులు పొందిన వారు 2,492 మంది కలిపి మొత్తం 25,869 మందికి వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వమే చెల్లిస్తుంది. మిగిలిన 28,598 మందికి మాత్రం రూ.35 వేల ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని ...5లో

హస్తం మంత్ర

టిక్కెట్ అంత ఈజీ కాదు

- రాష్ట్రంలోనూ హిమాచల్ ప్రదేశ్, కర్నాటక ఫార్ములానే...
- కాంగ్రెస్‌లో సర్వేల ఆధారంగానే బీ-ఫారాలు
- పైరవీలు, పెద్దలతో సంబంధాలు పనిచేయవు

తెలంగాణ పై ప్రియాంకాగాంధీ ఫోకస్



కాంగ్రెస్‌లో టికెట్‌దేముంది? పైసలిస్తేనో, పైరవీలు చేస్తేనో, అధిష్టానం పెద్దలతో సత్సంబంధాలు కొనసాగిస్తేనో టికెట్ వస్తుందనే అభిప్రాయం ఆశావాహుల్లో ఉన్నది. అందుకు తగ్గట్టుగానే గతంలో పారాచూట్‌లో వచ్చిన నేతలకు ఘన స్వాగతం పలికి బీఫామ్ చేతిలో పెట్టేవారు. కానీ, ఇప్పుడు లెక్క మారింది. టికెటు ఆశిస్తున్న నాయకులంతా ప్రజాసేవలో ఉన్నారా? పార్టీకి ఎంత సర్వీసు చేశారు? వారికి ప్రజల్లో ఉన్న పలుకుబడి ఏంటి? అనేది పక్కన పెట్టి టికెట్లు ఇచ్చి తీవ్రంగా నష్టపోయామని ఏఐసీసీ భావిస్తోంది. పార్టీని ఎట్లా గెలిపించాలనే దానిపై ఫోకస్ పెట్టింది.అందుకే రాష్ట్రంలో ప్రతి విషయాన్ని ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని నేతలు చెబుతున్నారు.

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో విజయం కోసం హస్తం పార్టీ పావులు కదుపుతున్నది. అందు కోసం ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ఆయా రాష్ట్రాల సక్సెస్ మంత్రను తెలంగాణలో అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో హస్తం పార్టీ అమలు చేసిన వ్యూహాలను, అనుసరించిన పద్ధతులను తెలంగాణలోనూ ఆచరించాలని అధిష్టానం బలంగా విశ్వసిస్తున్నది. 2014, 2018 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ ఘోరపరాజయం పాలైంది. దాన్నించి గుణపాఠాలు తీసుకుని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి తెలంగాణ రాష్ట్రాన్ని ...11లో

మణిపూర్ ఘటనకు నిరసనగా

25న రాష్ట్ర వ్యాపిత ఆందోళనలు

- సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు
- ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

మణిపూర్‌లో జరిగిన సంఘటనలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పనిపద్మ సీఐటీయూ నాయకులు వై.సోమన్నతో కలిసి వారు మాట్లాడారు. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించడం దారుణ మన్నారు. పైగా వారిలో ఒక మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, ఆమెను కాపాడేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులిద్దరిని హత్య చేశారని అన్నారు.

సంఘటన జరిగిన రెండు వారాల్లోపే బాధిత కుటుంబాలు అత్యంత ధైర్యసాహసాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ పోలీసులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నేరస్తులకు రక్షణ కల్పించడానికి మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యక్షంగా సాయపడుతోందని అన్నారు. 90 రోజులుగా రాష్ట్రం మండుతున్నా పట్టించుకోకుండా ముఖ్యమంత్రిని, రాష్ట్ర ప్రభు త్వాన్ని కేంద్రం, బీజేపీ అగ్ర నాయకత్వం సమర్థిస్తూ వస్తోందని అన్నారు. నెలల తరబడి మౌనం పాటిస్తూ వచ్చిన ప్రధాని చిట్టచివరకు చేసిన ప్రకటన, జరిగిన సంఘటనను, మణిపూర్‌లో సుదీర్ఘంగా చెలరేగుతున్న హింసాకాండను ముఖ్యమంత్రి పక్షపాత పాత్రను చాలా చిన్నది చేసేలా ఉందని అన్నారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం జవాబుదారీతనం ఇదేనా? అని ప్రశ్నించారు. మణిపూర్ లో శాంతిని నెలకొల్పాల్సిన ప్రధాని మోడీ సానుభూతి చూపించడానికి నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు చర్చకు పెడితే సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని విమర్శించారు. పైగా ఆ రాష్ట్ర సీఎం మాత్రం ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు జరగలేదా? అనడం శోచ నీయమన్నారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి మరణహోమానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులే కారణమని అన్నారు. దీనికి నిరసనగానే 25న రాష్ట్ర వ్యాప్తం గా జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భారతీయ భాషలను బోధనా మాధ్యమంగా పరిగణించండి

పాఠశాలలను కోరిన సీబీఎస్ఈ

న్యూఢిల్లీ : భారతీయ భాషలలో బోధన విషయంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ప్రీ–ప్రైమరీ తరగతుల నుంచి 12వ తరగతి వరకు ప్రస్తుత ఎంపికలతో పాటు రాజ్యాంగంలోని షెడ్యూల్ 8లో పేర్కొన్న భారతీయ భాషల ఎంపికను బోధనా మాధ్యమంగా అందించడాన్ని పరిశీలించాలని సీబీఎస్ఈ.. దాని అనుబంధ పాఠశాలలను కోరింది. ఈ మేరకు అన్ని అనుబంధ పాఠశాలల అధిపతులకు లేఖను పంపింది. సీబీఎస్ఈ డైరెక్టర్ (విద్యావేత్తలు) జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడారు.

నేడు నూతన సీజే ప్రమాణస్వీకారం

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరధే ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై ఆయనతో ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఇప్పటి వరకు ప్రధాన న్యాయమూర్తిగా చేసిన జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా అభినంద్‌కుమార్ షావిలి వ్యవహరిస్తున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జస్టిస్ అలోక్ అరధే 2009 డిసెంబర్‌లో అక్కడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018 నుంచి కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా చేస్తున్నారు. పదోన్నతిపై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వస్తున్నారు. జస్టిస్ అలోక్ అరధే రాయ్‌పూర్‌లో 1964 ఏప్రిల్ 14న పుట్టారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ చేశాక 1988లో లాయర్‌గా ఎన్రోల్ అయ్యారు. 2007లో సీనియర్ అడ్వొకేట్ హోదా లభించింది.

ప్రధాని రాజీనామా చేయాల్సిందే..

- మణిపూర్ మారణహోమం దుర్మార్గం
- అమానవీయ సంఘటనలకు ఆజ్యం పోసింది బీజేపీనే..



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

'మణిపూర్‌లో గత 80 రోజులుగా మారణ హోమం జరుగుతున్నది. వందల మంది ఆదివాసీలు ఇతరులు హత్యలకు గురవుతున్నారు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక లైంగిక దాడులకు పాల్పడుతూ భారతావని సిగ్గుతో తలదించుకునే విధంగా సంఘటనలు జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి అమానుష ఘటనల పట్ల మీనమేషాలు లెక్కిస్తున్నాయి. శాంతిని నెలకొల్పడంలో పూర్తిగా వైఫల్యం చెందాయి. ఆ సంఘటనలకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ తక్షణం రాజీనామా చేయాలి' అని గిరిజన,సామాజిక,ప్రజా సంఘాల నాయకులు, కవులు రచయితలు, సాంస్కృతిక సంస్థల నేతలు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ మారణ హోమంపై నిరసన గళాల పేరుతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ సాహితి సంస్థ ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రజా గాయకురాలు విమలక్క, మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు రాములు నాయక్, ప్రదేశ్ ఎరుకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రఘు ఎరుకుల, అంబేద్కర్ సంఘం జాతీయ నాయకులు శంకర్. ప్రయివేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విజయ్ మాట్లాడుతూ మణిపూర్‌లో వందలకొద్దీ హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్న క్రమంలో ఇంటర్నెట్ సేవలు నిలిపేయాల్సి వచ్చిందని స్వయానా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం ఆందోళనకరమని చెప్పారు. ఆయన అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రపతి, దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మణిపూర్ విషయంలో తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడు నెల్ల నుంచి ఆ రాష్ట్రంలో మారణ హోమం జరుగుతుంటే దేశ ప్రధాని ఎన్నికల ప్రచారం, విదేశీ టూర్లలో బిజీగా ఉన్నారు తప్ప.. అక్కడ పర్యటించి శాంతిని నెలకొల్పలేక పోయారని విమర్శించారు. కేంద్రం ప్రారంభంలోనే స్పందించి ఉంటే ఇంతటి దారుణాలు, వందల కొద్ది మరణాలు, మహిళలపై సామూహిక లైంగిక దాడులు జరిగేవి కావని గుర్తుచేశారు. కుకీ గిరిజన తెగకు సంబంధించిన ఒకరిని తల నరికి వేలాడదీశారంటే ఆ రాష్ట్రంలో ఎంతటి భయానక పరిస్థితులు నెలకొన్నాయో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మా నాయక్, సేవాలాల్ సేన నాయకులు కళ్యాణ్ ,శీను, తెలంగాణ సాహితి సంస్థ నాయకులు మోహన్‌కృష్ణ, సలీమ, తెలంగాణ గిరిజన సంఘం హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు రామ్ కుమార్, ఎం బాలు నాయక్, రఘు, ఎ .కృష్ణ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

- సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను గౌరవించి గెస్ట్ లెక్చరర్స్‌ను కొనసాగిస్తూ వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దాదాపు 1,654 మంది గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారి ఉద్యోగాలను కొనసాగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా ఇంటర్ విద్యాశాఖ కొత్తవారి నియామకానికి నోటిఫికేషన్ పంపించిందని పేర్కొన్నారు. ఈ విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్‌ను వేశారని తెలిపారు. దాన్ని విచారించి గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని న్యాయస్థానం ఆదేశించిందని గుర్తు చేశారు. ఈ ఆదేశాలను, ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 1145 ప్రకారం గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాల్సిన అవసరముందని సూచించారు. విద్యా శాఖలో జూనియర్ లెక్చరర్ల పోస్టులు భర్తీ చేయకపోయినా వారు విధిగా విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగాలతో సమానంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పదేండ్ల నుంచి గెస్ట్ లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నా వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయకపోవడం అన్యాయంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం పెట్టిన మెరిట్ ఆధారంగా, త్రిసభ్య కమిటీ ద్వారా వారు ఎంపికయ్యారని వివరించారు. కావున వారిని యథావిధిగా కొనసాగిస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

హైకోర్టులకు జడ్జిల నియామకాల్లో 75 శాతం అగ్రకులాలవారే

- కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

న్యూఢిల్లీ:దేశంలోని న్యాయస్థానాల్లోనూ సామాజిక న్యాయం కొరవడుతున్నది. సాక్షాత్తూ హైకోర్టులకు జరిపే జడ్జిల నియామకాల్లోనూ పెత్తందారీ కులాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. 2018 నుంచి దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టులకు జడ్జిలుగా నియమితులైనవారిలో 75 శాతానికి పైగా పెత్తందారీ కులాలకు చెందినవారే ఉండటం గమనార్హం. ఇక ఇతర వెనుకబడిన కులాలు(ఓబీసీ) నుంచి ఈ సంఖ్య 12 శాతం కంటే తక్కువగా ఉన్నది. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ మంత్రి ఈ విషయాన్ని లోక్‌సభలో వెల్లడించారు. 2018 నుంచి ఈనెల 17 వరకు 604 మంది హైకోర్టు జడ్జిల నియామకం జరిగింది. ఇందులో 458 మంది జడ్జిలు జనరల్ కేటగిరివారు ఉన్నారు. ఇక 18 మంది ఎస్సీలు, 9 మంది ఎస్టీలు, 72 మంది ఓబీసీలు ఉన్నారు.

ఉప్పొంగిన పెన్‌గంగ

నదీతీర ప్రాంతాలను ముంచెత్తిన వరద


- శ్రీరాంసాగర్‌లోకి భారీగా నీరు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద ఉధృతి
- గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- తగ్గుతున్న గోదావరి
- గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

నాలుగు రోజులుగా ఎడతెరపివ్వకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరుతోంది. అలాగే, వాగులు ప్రవహిస్తుండగా.. చెరువులు, కుంటలు నిండాయి. ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. పంట పొలాలు వరదతో నిండాయి. రోడ్లపై గుంతల్లో నీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోయాయి. గోదావరి ప్రవాహం పెరిగి కాస్త తగ్గుముఖం పట్టింది. అలాగే, ఏజెన్సీ ప్రాంతాల్లో అధికారులు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున ప్రవహిస్తున్న పెన్‌గంగా నది ఉగ్రరూపం దాల్చింది. నదీ పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకొని రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. ఉమ్మడి జిల్లా సరిహద్దులోని గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా నదికి వరద ఉధృతి కొనసాగుతోంది. ఆయా ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. కిందటేడాది కడెం ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితిని తలపించగా.. ఈసారి 14గేట్లను ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. ప్రస్తుతానికి ప్రమాదమేమీ లేకపోయినా వరద ఉధృతి మాత్రం భారీగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోపక్క భీంపూర్ మండలం వడూర్ గ్రామానికి చెందిన దాదిబా.. పెన్‌గంగా నదిలో కొట్టుకుపోతుండగా స్థానికులు కుషాల్, శ్రీనివాస్ సాహసం చేసి వెంటనే అతన్ని కాపాడారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం బంగారిగూడ వాగులో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకురావడం కలకలం రేపింది. నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండటంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు బయటకు వెళ్లకపోవడంతో పత్తి, సోయా పైర్లు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, ప్రతినిధులు పెన్‌గంగా నది పరివాహక ప్రాంతాల్లో పంటలను పరిశీలించారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు.





పెరుగుతూ.. తగ్గుతున్న గోదావరి

భద్రాచలం వద్ద గోదావరి శనివారం ఉదయం 7 గంటలకు 39.4 అడుగుల వద్ద ప్రవహించగా.. సాయంత్రం 7 గంటలకు 40.8 అడుగులకు చేరింది. పెరుగుతూ తగ్గుతూ ప్రవహిస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడూ వరదను అంచనా వేస్తున్నారు. గోదావరి వరదలపై రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ మంత్రికి ఫోన్ చేసి గోదావరి వరదలపై ఆరా తీశారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

ములుగు జిల్లాలో గోదావరి ఉధతి తగ్గుముఖం పట్టడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మెడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ నుంచి 61,9370 కూసెక్కులు, ఇంద్రావతి బ్యారేజ్ నుంచి 246220 క్యూసెక్కుల నీరు తుపాకుల గుడెం సమ్మక్క సారక్క బ్యారేజ్‌కి వచ్చి చేరుతుండటంతో 59 గేట్లు ఎత్తి 865590 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పూర్తిస్థాయిలో వరదలు తగ్గుముఖం పట్టేవరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. అలాగే వరద వచ్చి తగ్గిన ప్రాంతాల్లో, ప్రజల నివాస ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం, వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వెంకటాపురం మండలంలోని సీతారాంపురం, కలిపాక, కొత్తగుంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరాలు ఉన్న గ్రామాల్లో ఇంటి, ఇంటి సర్వే నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు.

శ్రీరాంసాగర్‌లోకి భారీగా వరద

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మూడ్రోజులుగా భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువన మహారాష్ట్రలో కుండపోత వర్షాలతో లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 54.387 టీఎంసీలకు పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిస్థాయి 1080.70 అడుగులకు చేరింది. మహారాష్ట్రకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎగువ ప్రాంతాల్లో నుంచి వస్తున్న వరదకు తోడు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్‌ను నిలుపుదల చేశారు.

కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం 9.81 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 29,300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కళ్యాణి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. వరద గేట్ల ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సింగితం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550 మీటర్లకుగాను ప్రస్తుతం నిండుకుండలా మారింది. 916 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

జలపాతాల సవ్వడులు

మహబూబాబాద్ జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. బయ్యారంలో ఏడు బావులు, మినీ బొగత, పెద్ద గుట్ట జలపాతాలు, గూడూరు మండలంలో భీముని పాదం జలపాతాలు జాలువారుతున్నాయి.

ఈ జలపాతాలను చూసేందుకు దూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు.

మణిపూర్ దారుణాలపై ఆందోళన

- ప్రజాసంఘాల నిరసన : దిష్టిబొమ్మలు దహనం



నవతెలంగాణ- విలేకరులు

మణిపూర్‌లో దారుణ ఘటనలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం కూడా నిరసన కార్యక్రమాలు జరిగాయి. వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలు దహనం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతిపరిరక్షణకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

వికారాబాద్ పట్టణంలో గిరిజన సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఎన్‌టీఆర్ చౌరస్తాలో మతోన్మాదుల ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనునాయక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.మహిపాల్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం రైతుబజార్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలో మణిపూర్ అకృత్యాలను అరికట్టాలని టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐద్వా అధ్వర్యంలో నకిరేకల్‌లో నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి పాల్గొన్నారు. మిర్యాలగూడలో ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మణిపూర్ ఇరువర్గాల మధ్య అల్లర్లను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. సభ్య సమాజం తలదించుకునే రీతిలో సంఘటనలు జరుగుతున్నా...మోడీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అధికార ప్రతినిధులు పాల్వాయి స్రవంతి, జహీర్ అక్తర్, వేణుగోపాల్ యాదవ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు.

ఎన్నికల్లో కమ్యూనిస్టులతో పొత్తు కీలకం

- మంత్రితో విభేదాలు ఒట్టిదే..
- పార్టీ అవకాశం ఇస్తే అమిత్ పోటీ చేస్తారు : శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

"రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టులతో పొత్తు కీలకం కానుంది. కమ్యూనిస్టులతో పొత్తు అంశం తేలితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సీట్ల మార్పు ఉండొచ్చు. జిల్లా మంత్రి జి.జగదీశ్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలూ లేవు" అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో చిట్ చాట్‌లో మాట్లాడారు. జగదీశ్‌రెడ్డితో తనకు విభేదాలు ఉన్నట్టు జరుగుతున్న ప్రచారం ఒట్టిదే అన్నారు. జిల్లా అధికారిక వ్యవహారాల్లో తానెప్పుడూ జోక్యం చేసుకోనని చెప్పారు. ఉద్యోగాల బదిలీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో తాను జోక్యం చేసుకోలేదన్నారు. అధికారికంగా, రాజకీయంగా ఏం జరిగినా సీఎం కేసీఆర్ దృష్టిలో ఉంటుందన్నారు. ఎవరైనా తన వద్దకు వచ్చినా నిబంధనల ప్రకారం వెళ్లాలని చెబుతానన్నారు. తన కుమారుడు అమిత్‌రెడ్డి టికెట్ విషయంలో పార్టీదే తుది నిర్ణయమని, పార్టీ అవకాశం ఇస్తే అమిత్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని చెప్పారు. టికెట్ కోసం ఎలాంటి పైరవీలూ చేయనని స్పష్టం చేశారు. సొంత పార్టీ ఎంపీపీ, మున్సిపల్ చైర్మెన్‌లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టడం సరికాదని, ఈ పరిణామాలను తీవ్రంగా వ్యతిరేకిస్తానని అన్నారు. నోటికి అడ్డు అదుపు లేకుండా ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతున్నారన్నారు. భాషా ప్రయోగం విషయంలో తాను హుందాగా ఉంటానని, బురదలో రాయి వేసే అలవాటు తనకు లేదని అన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటమిలు సహజమన్నారు. వామపక్షాలు బీఆర్ఎస్‌తో పొత్తుకు సుముఖంగా ఉన్నాయన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. కృష్ణా జలాల పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి వ్యవహరిస్తోందని విమర్శించారు.

వనరుల కోసమే మణిపూర్ మారణకాండ



- పౌరహక్కుల సంఘం స్పష్టీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సహజ వనరుల దోపిడీ కోసమే ప్రభుత్వాలు మణిపూర్‌లో మారణకాండను సృష్టిస్తున్నాయని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పీఎమ్ రాజు తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) మణిపూర్ కొండ ప్రాంతాల్లో చేసిన సర్వేలో మలాకైట్, అజూరైట్, మాగ్నెటైట్, నికెల్, కాపర్, ప్లాటినం గ్రూప్ ఎలిమెంట్స్, మెటల్స్ ఉన్నట్టు నివేదికలు ఇచ్చిందని తెలిపారు. వీటికోసం అక్కడి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కొండ ప్రాంతాల్లోని ఆదివాసీలను ఖాళీ చేయించేందుకు తెగల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, హింసను ప్రేరేపిస్తున్నాయని స్పష్టం చేశారు. మణిపూర్, మయన్మార్, థాయ్‌లాండ్‌లను కలుపుతూ అంతర్జాతీయ బింస్టక్ హైవే ఇక్కడ వస్తున్నదనీ, మయన్మార్‌లోని ఓడరేవు అదానీకి చెందినదని విశ్లేషించారు. మణిపూర్ కొండ ప్రాంతాల్లోని సహజ వనరులను లూటీ చేసేందుకు అధికారపార్టీతో సన్నిహితంగా ఉండే ప్రయివేటు మైనింగ్ సంస్థలు అక్కడి హక్కుల కోసం ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. వెయ్యేండ్లుగా మణిపూర్ కొండ ప్రాంతాల్లో ఉంటున్న ఆదివాసీ తెగల్ని అక్కడి నుంచి వెళ్లగొట్టడం కోసం, ప్రభుత్వాలే ఒక వర్గానికి ఆయుధాలను అందచేస్తున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో సాయుధ బలగాల నుంచి 6వేల ఆయుధాలను ఆందోళనకారులు లాక్కున్నారని అక్కడి పోలీసులే నివేదికలు ఇచ్చారని చెప్పారు. రాజ్యహింసకు ఇంతకంటే ఉదాహరణ, దుర్మార్గం ఏమున్నాయని అన్నారు.

మణిపూర్ హింసతో అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట మసకబారిందన్నారు. కచ్చి తంగా ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలనీ, సిట్టింగ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఇంత జరుగుతున్నా జాతీయ మానవహక్కుల కమిషన్ ఏంచేస్తున్నదని ప్రశ్నించారు. తక్షణం ఈ దారుణాలపై జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రధాని నరేంద్రమోడీ మణిపూర్‌లో పర్యటించి, అక్కడ శాంతి నెలకొనేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

మోడీ మౌనం హింసను మరింత ప్రేరేపిస్తున్నదని అభిప్రాయపడ్డారు. ప్రజల మధ్య నిట్టనిలువుగా చీలిక తెస్తున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో గట్టి బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

శిరీష అరెస్టు అక్రమం

ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు అగ్రనేత రామకృష్ణ సహచరి శిరీషను ఎన్ఐఏ పోలీసులు అరెస్టు చేయడాన్ని మానవహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆమెతో పాటు కేవీపీఎస్ నేత దుడ్డు ప్రభాకర్, బెల్లాల పద్మ, దేవేందర్‌లను ఎన్ఐఏ పోలీసులు నిర్బంధించారని తెలిపారు.

డైట్ చార్జీల పెంపు

- ఫైలుపై సీఎం సంతకం
- ఈ నెల నుంచే అమలు..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలోని అన్ని రకాల గురుకులాలతోపాటు పలు శాఖలకు అనుబంధంగా నడుస్తున్న హాస్టళ్ల మెనూ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచనున్నది. ఈ మేరకు సీఎం కేసీఆర్ శనివారం సచివాలయంలో డైట్ చార్జీలను పెంచుతూ సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. పెరిగిన చార్జీలు జూలై నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనాన్ని అందిస్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

పెరిగిన డైట్ చార్జీల వివరాలు :

తరగతి-- ప్రస్తుతం(రూ)--పెరిగింది(రూ.)

మూడు నుంచి ఏడు వరకు-950-1,200

ఎనిమిది నుంచి పది వరకు-.1,100 -1,400

11 నుంచి పీ.జీ వరకు-1,500 -.1,875

టీఎస్ యూటీఎఫ్ హర్షం..

ఈ నెల నుంచి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీఎస్‌యూటీఎఫ్ స్వాగతిస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య చావ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేవీపీఎస్ హర్షం

హాస్టళ్లలో విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచటం పట్ల కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పోరాటాల ఫలితమే..మెస్ చార్జీల పెంపు-ఎస్ఎఫ్ఐ

డైట్ చార్జీలతో పాటు కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో పోల్చి చూసినప్పుడు పెరిగిన డైట్ చార్జీలు కేవలం కంటి తుడుపు చర్యమాత్రమేనని పేర్కొన్నారు. పెరిగిన ధరలతో సమానంగా డైట్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెల్లుగా పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.కాస్మొటిక్ చార్జీలు నెలకు బాలురకు రూ.62, బాలికలకు రూ.100, ప్రిమెట్రిక్ హాస్టళ్లలో ఇస్తున్నారని తెలిపారు. ఇవి ఏ మాత్రం సరిపోవని పేర్కొన్నారు. నెలకు బాలురకు రూ.500, బాలికలకు రూ.1000ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాశాల వసతి గృహాల విద్యార్థులకు నెలకు రూ.1500పాకెట్ మనీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రాలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న కేంద్రం

- విద్యుత్ సంస్కరణలు అమలు చేయకుంటే ఆర్థిక ప్రయోజనాలు నిలిపేస్తున్న వైనం : కేరళలో జరిగిన 'ఈఫీ' వర్కింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణల్ని అమలు చేయకుంటే రాష్ట్రాలకు ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నిలిపివేస్తామని బాహటంగానే మోడీ సర్కార్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నదని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఫీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యల్ని సహించేది లేదనీ, విద్యుత్ చట్ట సవరణ బిల్లు-2022ను అడ్డుకొని తీరతామని స్పష్టం చేసింది. కేరళలోని తిరువనంతపురంలో ఈనెల 21, 22 తేదీల్లో రెండ్రోజులపాటు జరిగిన 'ఈఫీ' వర్కింగ్ కమిటీ సమావేశాలు ముగిసాయి. ఈ సందర్భంగా శనివారంనాడక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఈఫీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎలమారం కరీం, ప్రశాంత ఎన్ చౌదరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తున్న విద్యుత్ చట్ట సవరణ బిల్లు కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ఉద్దేశించిందేననీ, దీనివల్ల ప్రజలపై తీవ్రమైన ఆర్థికభారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంటు చార్జీల పెంపుతో పాటు ప్రభుత్వ ఆస్తుల్ని వారికి ధారాదత్తం చేయడమే ఈ బిల్లు లక్ష్యమని వివరించారు. ప్రజలకు తీవ్ర నష్టాల్ని మిగిల్చే అ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన, మహిళా, శ్రామిక సంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి, మహోద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. దీనికోసం నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజినీర్స్ (ఎన్‌సీసీఓఈఈఈ)తో కలిసి పనిచేస్తామన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థల్ని అదానీ గ్రూప్‌కు కట్టబెట్టేందుకు సమాంతర లైసెన్సులు ఇచ్చి, స్మార్ట్ మీటర్లను తెరపైకి తెచ్చారని వివరించారు. ఈ సంస్కరణలు అమలైతే ప్రజలపై తీవ్రమైన ఆర్థికభారాలు పడతాయని హెచ్చరించారు.

తెలంగాణ నుంచి...

కేరళ తిరువనంతపురంలో జరిగిన 'ఈఫీ' వర్కింగ్ కమిటీ సమావేశాల్లో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌యూఈఈయూ) నుంచి వీ గోవర్ధన్, ఈఫీ కార్యదర్శి కే ఈశ్వరరావు, వర్కింగ్ కమిటీ సభ్యులు వీ కుమారస్వామి, ఎన్ చారి పాల్గొన్నారు.



మొన్నొకడు ఆదివాసీపై మూత్రం పోస్తాడు. దళితుడితో ఒకడు బూట్లు నాకిస్తాడు. నేడు ఆదివాసీ మహిళలల్ని నగ్నంగా హింసిస్తారు. ఇంతటి కుల దురహంకారాన్ని ప్రదర్శిస్తూ హిందువులందరూ బంధువులని నినాదాలిస్తారు! ఎంతటి కపటనాటకం! మనుషులుగా బతకటం మాని మతంగానో, కులంగానో, ప్రాంతంగానో విద్వేషపు మంటలు రేపుతున్న సంఘటనలు చూస్తున్న జనులందరూ దోషులెవరో కనిపెట్టటం కష్టం కాబోదు.

ఎవరు దోషులు!

ఆ ఘటన జరిగింది మే 4న. అంటే రెండు నెలలు దాటిపోయింది. ఇప్పటికీ సోషల్ మీడియా లేకపోతే దారుణం వెలుగుచూసేదే కాదు. మణిపూర్‌లో ఇంతటి అఘాయిత్యం జరిగిందని ప్రపంచానికి తెలిసేదే కాదేమో! అందుకనే అధికారం ఇంటర్‌నెట్‌నూ బంద్ పెట్టింది. ఇది ఇప్పుడు తెలిసింది. తెలియకుండా జరిగిన అమానుషత్వాలెన్నో ఇప్పుడు మణిపూర్ కావచ్చు. నిన్న కాశ్మీర్‌లో జరగలేదా! మొన్న గుజరాత్‌లో ఏమయింది! ఉత్తర భారతంలో నిర్భయలెంతమంది! గర్భవతి పొట్టచీల్చి పసిగుడ్డును హతమార్చి సామూహిక హత్యాకాండ యధేచ్ఛగా సాగినప్పుడు, నేరస్తులకు శిక్షపడిందా? లేదు. అది పురికొల్పిన వారికి ఏకంగా దేశ అధికారమే అందింది. లైంగికదాడి చేసి హత్య చేసినవారికి మద్దతుగా మహాప్రదర్శన తీసినవారు కళ్ళెదుటే అధికారంలో ఊరేగుతున్నారు. కాశ్మీర్‌లో చిచ్చురేపి మారణకాండకు ఉసిగొల్పుతుంటే చూస్తూనే ఊరకవున్నాము కదా! నేరస్తులు రాజ్యం చేస్తున్న చోట ఘోరాలు కాక ఘనకార్యాలేముంటాయి! మెజారిటీల మాట మైనారిటీలు వినాలనీ, లోబడి ఉండాలనీ, తంతే పడాలనీ వాదం మొదలయ్యాక, అది మతమైనా, జాతయినా, తెగలయినా ఇలా తగలబడిపోవడమే కదా! జరిగిన ఘటనకు కన్నీరు కారుస్తూ రగిలిపోతున్నవారు దోషులనూ గుర్తించాలి.

79రోజుల క్రితం మణిపూర్‌లోని కాంగ్ పోక్పీ ఆదివాసీ ప్రాంతం. కుకీ తెగ నివాసాలపై మైటీ తెగ మారణాయుధాలతో దాడికి తెగబడింది. ప్రజలు భయభ్రాంతులైపోయారు. మహిళలూ పరుగుతీసారు. పోలీసులు రక్షిస్తారనుకున్నారు. కానీ దాడులకు తెగబడిన గుంపుకే మహిళలను అప్పగించారు. వాళ్ళు స్త్రీలను వివస్త్రలుగా చేసి ఊరేగించారు. సామూహిక అత్యాచారమూ చేశారు. అడ్డొచ్చిన తండ్రినీ, తమ్ముణ్నీ చంపేసారు. పైశాచికంగా ప్రదర్శన తీశారు. పోలీసులు వీటన్నింటికీ కాపలాకాసారు. ఎందుకంటే మైటీ సమూహానికే అక్కడి ప్రభుత్వం సంఘీయ మూకలూ మద్దతుగా ఉన్నారు. అరాచకానికి అమానవీయానికి రాజ్యం నేతృత్వం వహిస్తే ఏం జరుగుతుందో ఎన్ని అనుభవాలు లేవుమనకు! అందుకే అక్కడా అలానే జరిగింది. దాడి చేస్తున్నప్పుడూ పోలీసులున్నారు. నగ్నంగా ఊరేగిస్తున్నప్పుడూ ఉన్నారు. హత్యలు చేస్తుండగానూ ఉన్నారు. అక్కడ డబుల్ ఇంజన్ ప్రభుత్వమూ ఉంది. ఇది దేశానికి అవమానకరమని సిగ్గుపడాల్సిన విషయమని బాధపడి ఖండిస్తున్న మానవీయులు అసలు దోషులెవరో గుర్తించాలి!


ఏం సిగ్గుంది మనకు. ఎన్ని సహించి, భరించి, నికృష్టంగా వెళ్లదీస్తున్నాం! ఎంత నిర్లజ్జగా, నిర్భయంగా ఘటనలు జరిగిపోతున్నాయి. మూడు నెలలుగా రెండు వర్గాలు మంటల్లో కాలిపోతుంటే కనీసం మాట్లాడకుండా ఉండే నాయకుడు ప్రపంచంలో ఎవడయినా ఉంటాడా? ఇప్పుడు మొసలికన్నీరు కార్చడానికి సిగ్గూలేదు యెగ్గూలేదు! పైగా యాభైఆరు యించుల ఛాతీ! మన వ్యవస్థలేమయ్యాయి? రాష్ట్రపతి, ఎస్టీ కమిషన్, మానవహక్కుల సంఘం, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం, మేధావులు, మీడియా యేరి? ఎక్కడున్నారు! ఈ ప్రశ్నలన్నీ కొందరు ఐఏఎస్‌లు వేస్తున్నారు. మణిపూర్ ఘటనపై ఏం చర్య తీసుకున్నారు? మీరు కదులుతారా? మేము కలుగచేసుకోవాలా? అని సుప్రీంకోర్టు అనేదాకా అటువైపుకే చూడని, మాట్లాడని మౌన చతురున్ని కన్నాకనైనా ఓ నా సోదరులారా! దోషులను నిలెయ్యండి.

మొన్నొకడు ఆదివాసీపై మూత్రం పోస్తాడు. దళితుడితో ఒకడు బూట్లు నాకిస్తాడు. నేడు ఆదివాసీ మహిళలల్ని నగ్నంగా హింసిస్తారు. ఇంతటి కుల దురహంకారాన్ని ప్రదర్శిస్తూ హిందువులందరూ బంధువులని నినాదాలిస్తారు! ఎంతటి కపటనాటకం! మనుషులుగా బతకటం మాని మతంగానో, కులంగానో, ప్రాంతంగానో విద్వేషపు మంటలు రేపుతున్న సంఘటనలు చూస్తున్న జనులందరూ దోషులెవరో కనిపెట్టటం కష్టం కాబోదు. ఆదివాసీల హక్కులు, మానవహక్కుల విధ్వంసమవుతున్నాయని అంతర్జాతీయంగా చర్చ జరుగుతుంటే, యూరోపియన్ యూనియన్ పరిష్కరించమని తీర్మానం చేస్తే కూడా కదలని, మెదలని, ఉలకని, పలకని మహోపన్యాసకుడు నేతయిన చోట నిత్యం పొగిడే భక్తజనం ఇప్పుడు కనపడరేం! సచ్ఛీలత గురించి, సంప్రదాయం, సంస్కృతి గురించి తెగ ఓండ్రపెట్టే గుంపు ఇప్పుడు దోషులెవరో చెప్పాలి కదా! ఒక సెలబ్రెటీకి కూతురు పుడితే ఆసుపత్రి చుట్టూ మూగిపోయే మీడియా ఏమైంది! కేరళ స్టోరీ అనీ, కాశ్మీర్‌ఫైల్స్ అనీ ఉన్నవి లేనివి తెరకెక్కించే సినీ మాయకులు మణిపూర్ ఫైల్స్ తీసే దమ్ముందా చెప్పండి! అరచి కేకలు పెట్టే ప్రోగ్రామర్సేరి! ఎక్కడ దాక్కున్నారు. ఛానళ్ల గొంతు ధ్వనించదేమి! నేరపూరిత మౌనాన్ని బద్దలు కొట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపకుండా, అందరి సహాయాన్ని తీసుకుని సమస్యను పరిష్కరించేందుకు బాధ్యతగా పూనుకోవాలి. దోషుల ఇల్లు తగులబెట్టి, ఎన్‌కౌంటర్ చేసి, మరో నేరానికి పాల్పడటం దుర్మార్గమే అవుతుంది. ప్రపంచంలోని ప్రతి మనిషి సిగ్గుపడే ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో జనం తెలుసుకుని చైతన్యపరచి దోషులను గుర్తించాలి, శిక్షించాలి!

సంపాదకీయం

కుటిల రాజకీయాలతోనే మణిపూర్ మంటలు


తెలకపల్లి రవి

ఇటీవలి చరిత్రలో ఎన్నడూ లేనంతగా మణిపూర్ దురంతం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కార్ వాషింగ్ వర్క్‌షాప్‌లో పనిచేసుకుని బతికే ఇద్దరు ఆదివాసి యువతులను వివస్త్రలను చేసి వెంటాడి మానప్రాణాలు బలిగొంటున్న బీభత్స దృశ్యం జాతిని కలచివేసింది. ఘోరకలి జరిగాక రెండున్నర నెలలకు ఈ వీడియోలు బయటకు వచ్చినా ఇంత ఆగ్రహావేదనలు ప్రజ్వరిల్లాయంటే జరిగింది ఎంత దారుణమో, వాస్తవ పరిస్థితి మరెంత ఘాతుకంగా ఉందోననే సందేహం ప్రతివారిలో కలిగింది. దానికదే విషయం బహిర్గతమయ్యే వరకూ తెలియనట్టే ప్రవర్తిస్తున్న డబుల్‌డబ్బా పాలకులకు ఘోర పరాభవం ఎదురైంది. మొన్ననే ఎన్‌డీఏ విస్తృత సమావేశంలో గజమాల వేయించుకుని సూక్తులు వినిపించిన విశ్వగురు ప్రధాని మోడీ బోనులో నిలబడాల్సి వచ్చింది. అయితే అలాంటి పరాభవాలు పట్టించుకునే ఘటం కాదు గనక పార్లమెంటు సమావేశాల సందర్భంగా చేసిన అనివార్య వ్యాఖ్యలలో ఆయన ఈ తప్పుకు దేశంలోని వంద కోట్లమంది ప్రజలదీ బాధ్యత అన్నట్టు మాట్లాడేశారు. దేశం, సమాజం సిగ్గుపడాలన్నారు. విశ్వగురుగా గజమాల వేయించుకోవడానికి నమో నమో కీర్తనలతో ఊరేగడానికి తాను, అమానుషానికి మాత్రం అందరిదీ బాధ్యత! ఇంత కన్నా విడ్డూరమైన విపరీతమైన విషయం మరొకటి ఉంటుందా? కాని బీజేపీ మోడీ పాలనలో అదే భారతీయ వాస్తవం.

చర్చకే దిక్కులేదు, చర్య ఎక్కడ?

మణిపూర్‌లోనూ, ఢిల్లీలోనూ పాలించేది అక్షరాలా వారు చెప్పే డబుల్ ఇంజన్ సర్కార్. ఆపైన ఈశాన్య రాష్ట్రాలకు బీజేపీ తరపున బాధ్యుడూ, మంత్రిగా ఈ శాఖకు తన కుడిభుజమైన హోంమంత్రి అమిత్ షానే. మణిపూర్ పాలకుడైన బీరేన్ సింగ్ సరేసరి, అయినాసరే దేశ ప్రజలు వందకోట్ల మంది సిగ్గుపడాలి గాని ఈ ఇద్దరు ముగ్గురు మనుషులు ఈషణ్మాత్రం సిగ్గుపడినట్టు కనిపించరు. తమకు నచ్చని రాష్ట్రాలలో చీమ

అస్సాం ముఖ్యమంత్రి శర్మ, బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ ఆ ప్రాంతంలో పనిచేస్తున్న కాలంలోనే కుకీ తీవ్రవాద సంస్థ యుకెఎల్‌ఎఫ్ (యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్)తో సంబంధం పెట్టుకుని నిధులు సమకూర్చినట్టు తర్వాత వెల్లడైంది. ఇందుకు ప్రతిగా వారు 2017లోనూ 2019లోనూ బీజేపీకి ఎన్నికల్లో మద్దతునిచ్చారు. ఈ విషయం బయటకు వచ్చాక ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్‌కు మైతేయిలలో కూడా మద్దతు లేకుండా పోయింది.

చిటుక్కుమంటే ట్వీట్లు పెట్టి పీట్లు చేసే సంఘ్ పరివార్ పెద్దలెవరూ స్పందించరు. నూతన పార్లమెంటు భవనం ముందు ఈ ఘోరవార్తపై స్పందిస్తూ మణిపూర్ పుత్రికలకు జరిగిన ఘోరం పట్ల ప్రతివారూ విచారిస్తున్నారని కారకులెవరైనా వదలిపెట్టే ప్రసక్తి లేదని గంభీర ప్రకటన చేసిన ప్రధాని ఆ సభలోనే ఈ సమస్యపై చర్చకు హాజరు కారు. సమగ్ర చర్చ కాకుండా స్వల్ప వ్యవధితో సరిపెడతామంటారు. బాధ్యులెవరైనా కఠినచర్యలు తీసుకుంటామని గర్జించినవారు తమ అనుంగు ముఖ్యమంత్రిని మాత్రం ముట్టుకోరు, రాజీనామాకు ఆదేశించరు. మే 4న జరిగిన ఈ దారుణంపై మే 14న ఎఫ్‌ఐఆర్ నమోదైతే ఇంతకాలం ఏ గుడ్డిగుర్రానికి పళ్ళు తోముతున్నారని నిలదీయరు. ఇవన్నీ చేయకపోవడం ఒకటి, ఈ వీడియో ఇంతకాలం తర్వాత ఇప్పుడే రావడంలో కుట్ర ఉందని ఆరోపిస్తారు. గతంలో జరిగిన మరికొన్ని అఘాయిత్యాలతో పోటీపెట్టి మాట్లాడతారు. చర్చలు జరిపిస్తారు, వ్యాసాలు రాయిస్తారు. జరిగిందాన్ని కప్పిపుచ్చడానికి తీవ్రత తగ్గించడానికి సకల శక్తియుక్తులూ వెచ్చిస్తారు. అందుకే ఇది డబుల్ హిపోక్రసీ. రెట్టింపు వంచన. టెలిగ్రాఫ్ పత్రిక 79 మొసళ్ల కార్టూన్ వేసి ఆపైన మోడీ విచారాన్ని పెట్టి క్యాప్షన్ కూడా రాయకుండా వదలిపెట్టింది. ఎందుకంటే నవవర్ష నమో పాలన తర్వాత వీటికి తేలిగ్గా లోబడిపోయే స్థితిలో దేశ ప్రజలు లేరు.

కాషాయ వ్యూహాల కరాళ ఫలితమే

ఈశాన్య రాష్ట్రాలు కూడా తమ ప్రాబల్యంలోకి రావడం మోడీ మహత్తులలో ఒకటని చెప్పుకునే బీజేపీ అందుకు అనుసరించిన ఎత్తులు జిత్తుల పర్యవసానమే ఈశాన్య జ్వాలలు. గుర్తు చేసుకుంటే కొంతకాలం కిందట అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌ల మధ్య సరిహద్దు వివాదం ప్రజ్వరిల్లడం ఎవరూ మర్చిపోలేదు. నిరంతరం తన మాటలతో వివాదాలు సృష్టించే అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వశర్మ పరిష్కారానికి ఏమీ చేసింది లేదు ఎగదోయడం తప్ప. తర్వాత మేఘాలయతోనూ ఇదే తరహా ఘర్షణ చెలరేగి ఆరుగురు చనిపోయారు. ఇవి అసాం నుంచి విడదీయబడిన రాష్ట్రాలు కావడం గుర్తుంచుకోదగింది. ఎందుకంటే 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు ఈశాన్యాన మణిపూర్, త్రిపుర మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉండేవి. 1954లో అరుణాచల్ ప్రదేశ్, 1963లో నాగాలాండ్, 1969లో మేఘాలయ,1972లో మిజోరాం అస్సాం నుంచి విడదీసి ఏర్పాటు చేసినవే. మొదటి నుంచి ఉన్న మణిపూర్, త్రిపుర 1972లో పూర్తి రాష్ట్రాలయ్యాయి. ఈశాన్య ప్రాంతం నేరుగా బ్రిటిష్ వారి పాలనలో ఎన్నడూ లేదు. వారు కావాలనే చైనాకూ తమకూ మధ్య ఒక విడుపులాగా దాన్ని అట్టిపెట్టారు. అక్కడ అనేక జాతులు, ఉపజాతుల గిరిజనులు, ఆదివాసులు జీవించేవారు. నాగా, కుకీ, మిసో తదితర తెగలు ఉపజాతులు అలాంటివే. గిరిజనులలో క్రైస్తవ మిషనరీల ప్రభావం కూడా ఎక్కువే. మణిపూర్ మైదాన ప్రాంతాలలో మైతేయిలు ఉంటారు. కుకీలు మూలవాసులైనప్పటికీ రాజకీయ వ్యవస్థలో మైతేయిల ప్రాబల్యమే ఎక్కువ. ఈ చిన్న రాష్ట్రంలో మొత్తం 36తెగలు ఉపజాతులు ఉంటారంటే సమస్య అర్థమవుతుంది. మైతేయిలు ఇంఫాల్ లోయలో ఉంటూ హిందూమతాన్ని సనామహి అనే స్థానిక విశ్వాసాలను ఆచరిస్తారు. కుకీలు, నాగాలు అత్యధికంగా క్రైస్తవ మతానుయాయులు. ఈతెగలు ఉపజాతుల మధ్య స్వార్థరాజకీయ శక్తులు పట్టించుకోని కేంద్రం కారణంగా నిరంతర ఘర్షణలు తిరుగుబాట్లు జరుగుతూ వచ్చాయి. అందులో నాగా, కుకీల తగాదాలు ప్రధానమైనవి.

2017లో బీజేపీ అధికారంలోకి రావడంతో ఆరెస్సెస్ రంగంలోకి దిగి హిందూ విశ్వాసాలు గల మైతేయిలను క్రైస్తవాన్ని అనుసరించే కుకీలకు వ్యతిరేకంగా కూడగట్టింది. దాంతో ఇది మత వివాదంలా కూడా మారిపోయింది.

ఎఫ్‌ఐఆర్ తెలియదా?

పొరుగునే ఉన్న మయన్మార్‌లో 2021లో సైనిక నియంతృత్వం అధికారం కైవసం చేసుకున్నాక దాడి తట్టుకోలేక వేలాది మంది చిన్ శరణార్థులు వచ్చిపడటంతో పరిస్థితి మరింత దిగజారింది. వీరు కూడా కుకీలే. మిజోరాం, మణిపూర్‌లలోని కుకీలు వారిని ఆహ్వానించి ఆశ్రయమిచ్చారు. కాని మోడీ ప్రభుత్వం వారికి ఆశ్రయం నిరాకరించి అక్రమ చొరబాటుదారులుగా ప్రకటించింది. ఇదే సమయంలో బిరేన్ సింగ్ ప్రభుత్వం రిజర్వు అడవుల నుంచి కుకీలను భారీ ఎత్తున తొలగించడం మొదలెట్టింది. అడవులలో మాదక ద్రవ్యాల పంటలను నాశనం చేసేందుకు దాడి కూడా గిరిజనులను దూరం చేసింది. కుకీలు అక్రమ చొరబాటుదారులని ప్రచారం చేసే తీవ్రవాద మైతేయి వర్గాలకు ఆరెస్సెస్ వత్తాసునిచ్చింది. అస్సాం ముఖ్యమంత్రి శర్మ, బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ ఆ ప్రాంతంలో పనిచేస్తున్న కాలంలోనే కుకీ తీవ్రవాద సంస్థ యుకెఎల్‌ఎఫ్ (యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్)తో సంబంధం పెట్టుకుని నిధులు సమకూర్చినట్టు తర్వాత వెల్లడైంది. ఇందుకు ప్రతిగా వారు 2017లోనూ 2019లోనూ బీజేపీకి ఎన్నికల్లో మద్దతునిచ్చారు. ఈ విషయం బయటకు వచ్చాక ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్‌కు మైతేయిలలో కూడా మద్దతు లేకుండా పోయింది. కుకీలు ఆయనను తమ



సమస్యలకు మూల కారణంగా ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. బీజేపీలోనే ఉన్న పదిమంది కుకీ ఎంఎల్‌ఎలు ప్రత్యేక పాలనా విభాగం కావాలని ఆందోళన మొదలెట్టారు. ఇప్పుడు మనం చూస్తున్న కల్లోలం వెనక ఇంత లోతైన నేపథ్యముందని గుర్తుంచుకోవాలి. పులి మీద పుట్రలా ఈ పరిస్థితులలో మైతేయిలను కూడా గిరిజనులుగా పరిగణించాలని మార్చి 27న మణిపూర్ హైకోర్టు తీర్పు చెప్పడం, దానికి అభ్యంతరం లేదని బీరేన్‌సింగ్ హడావుడిగా ప్రకటించడంతో ఈ ఘర్షణలు పరాకాష్టకు చేరాయి. ఈ క్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోకపోగా కుటిల వ్యూహంతో మరింత రగలడానికి కారణమైనాయి. మే4వ తేదీ మహిళలపై ఘోర కలి వీడియో జులై 20 బయటకు వచ్చినప్పటికీ నిజానికి రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసులకు ఈ విషయాలు తెలియవని కాదు. మే రెండవ వారంలోనే వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఎఫ్‌ఐఆర్ నమోదు జరిగాయి. మే29న అమిత్‌షా అక్కడ పర్యటించి వచ్చారు. ఇక ఘనమైన మోడీకి ఈ సమస్య పట్టించుకునే ఆలోచనే లేకుండా పోయింది.

ఇంత జరిగినా ఆ ముఖ్యమంత్రిని ముట్టుకోని కేంద్రాన్ని ఏమనాలి? ఈ విషయంలో ముందే జోక్యం చేసుకుని తీవ్రంగా ఖండించిన సిజెఐ డివై చంద్రచూడ్ ప్రభుత్వం చర్య తీసుకోకుంటే తాము రంగంలోకి దిగాల్సి వస్తుందన్నారు. అత్యున్నత న్యాయమూర్తి స్పందనకూ ప్రభుత్వాధినేత స్పందనకూ తేడా కనిపిస్తూనే ఉంది. వాస్తవానికి రాని స్పందనకోసం వ్యవధి ఇవ్వడం కంటే సుప్రీంకోర్టు వెంటనే రంగంలోకి దిగి చర్య తీసుకోవడం చాలా మంచిది.

ప్రతిపక్షాలు ఆందోళన, ఆగ్రహం వెలిబుచ్చుతున్నా చీమకుట్టినట్టు లేకపోయింది. మణిపూర్ నుంచి బీజేపీ తరపున రెండు ప్రతినిధి బృందాలు, ప్రతిపక్షాల తరపున ఒక బృందం ఆయన్ను కలుసుకోవడానికి ఢిల్లీలో నిరీక్షిస్తుంటే ఆయన మాత్రం అమెరికాలో భుజకీర్తులందుకుంటున్నారు. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాలలోనూ యూరోపియన్ పార్లమెంటులోనూ మణిపూర్ పరిస్థితిపై తీర్మానాలు చేస్తుంటే పట్టించుకోలేదు సరికదా చర్చ కూడా చేయకుండా మన పార్లమెంటును వాయిదా వేయించారు! కనుక మణిపూర్ పుత్రికలంటూ ఆయన మాట్లాడటాన్ని మొసలి కన్నీరు కన్నా మోడీ కన్నీరు అంటే చాలదా?

జరగాల్సిందేమిటి?

మాట్లాడితే వీర జవాన్లు దేశభక్తి అంటూ ఊదరగొట్టే కేంద్ర పాలకులు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుని భార్యకు ఈ దుర్గతి పడితే స్పందించకపోవడం ఏమంటాం? మే 4 రాత్రి దుష్టమూకలు వేల సంఖ్యలో ఆగ్రామాన్ని చుట్టుముట్టి కుకీ కుటుంబాలను తరిమేయడమే గాక ఇద్దరు యువతుల బట్టలూడదీయించి మృగాల్లా హింసిస్తూ ఈడ్చుకుపోయారు. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. వాళ్లను కాపాడేందుకు వెళ్లిన వారిని చంపేశారు. రక్తసిక్తమైన శరీరంతో ఆ అభాగ్యురాళ్లు ఇద్దరినీ తీసుకుని వారు ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు చేరుకుంటే పరిధి సమస్య వచ్చింది. దాన్ని మరో స్టేషన్‌కు బదలాయించారు. ఇంత జరిగినా ఏ చర్య తీసుకున్నది లేదు, ఇంటర్‌నెట్ సెన్సార్ ఉంది గనక బయటకు రాలేదు. ఈ లోగా మహిళా కమిషన్‌కు ముఖ్యమంత్రికి ఫిర్యాదు వెళ్లినా స్పందన లేదు. వందల సంఖ్యలో ఇలాంటివి వస్తుంటే ఏదని చూస్తామన్నది వారి అహంకార పూరితమైన జవాబు. ఇంత జరిగినా ఆ ముఖ్యమంత్రిని ముట్టుకోని కేంద్రాన్ని ఏమనాలి? ఈ విషయంలో ముందే జోక్యం చేసుకుని తీవ్రంగా ఖండించిన సిజెఐ డివై చంద్రచూడ్ ప్రభుత్వం చర్య తీసుకోకుంటే తాము రంగంలోకి దిగాల్సి వస్తుందన్నారు. అత్యున్నత న్యాయమూర్తి స్పందనకూ ప్రభుత్వాధినేత స్పందనకూ తేడా కనిపిస్తూనే ఉంది. వాస్తవానికి రాని స్పందనకోసం వ్యవధి ఇవ్వడం కంటే సుప్రీంకోర్టు వెంటనే రంగంలోకి దిగి చర్య తీసుకోవడం చాలా మంచిది. ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ తక్షణం గద్దెదిగాలి. ఇప్పటికీ బయటకు రాని ఘోరాలు మరెన్ని ఉన్నాయో ప్రత్యేకంగా దర్యాప్తు చేసేందుకు ఒక కమిటీని నియమించాలి. బాధితుల రక్షణ కోసం తక్షణం కేంద్రం రంగంలోకి దిగాలి. ■

కలియుగ ద్రౌపది

అది గోకులం, కృష్ణుడి అష్ట భార్యలు ఒకే పొన్నపూల చెట్టు కింద సమావేశమయ్యారు. అందరి మొహంలో ఒకే ఆందోళన కన్పిస్తోంది. తమ హృదయాలను దొంగిలించిన వెన్నదొంగ జాడ గత కొన్ని రోజులుగా కనబడటం లేదు. అందరూ అన్ని విధాలుగా వెతికారు. కాని కృష్ణుడి జాడ కనబడలేదు.

అందరూ సత్యభామ వైపు చూశారు. ఆ చూపులకు అర్థం ఏమిటో సత్యభామకు తెలుసు అందుకే.

"మన నాధుడిని నేను పారిజాతమూ తెమ్మని కోరలేదు" అన్నది.

అందరూ జాంబవతి వైపు చూశారు.

"అక్కా! ఒక్క శమంతకమణి చక్క నా దగ్గర ఏమున్నది? అదీ, నేనూ మన నాథుడి వశమైనాము కదా?" అన్నది జాంబవతి బేలగా.

ఈసారి అందరూ రుక్మిణి వైపు చూశారు!

"చెల్లెమ్మలూ! నేనూ ఏమీ చేయగల స్థితిలో లేను. ఎంత భక్తితో ప్రార్థించినా మన నాథుడి పొడ కానరావటం లేదు!" రుక్మిణి తన నిస్సహాయతను వెల్లడించినది.

అష్టభార్యలు దిగాలు పడ్డారు. వారంతా కృష్ణుడిని వెదుకుతున్నది తమ కోసం కాదు! ఎంతోసేపటి నుండి మహిళల ఆక్రందనలు వినబడుతున్నవి. వారిని కాపాడటానికి తమ నాధుడు వెళ్ళి ఉంటాడని వారి నమ్మకం! కాని ఎంతసేపటికీ ఆక్రందనలు ఆగటం లేదు! తన చెల్లెళ్ళను కృష్ణుడు ఆదుకుంటే ఆక్రందనలు ఆగిపోవాలి! కాని ఆక్రందనలు ఆగిపోవటం లేదు. పైగా పెరుగుతున్నవి. అసలేం జరుగుతున్నదో అర్థం కావటం లేదు.

ఇంతలో నవ్వుతూ, తుళ్ళుతూ ద్రౌపది వచ్చింది. ఆమెను చూడగానే వదినలందరికి ఉత్సాహం వచ్చింది.

"నీవైనా పిలువమ్మా మీ అన్నను పిలవమ్మా! వస్తాడేమో?" అన్నారు అష్టభార్యలు ఏక కంఠంతో.

"ఎందుకు వదినా! ఆడపిల్లలు కష్టంలో ఉండి పిలిస్తే అన్న ఆగలేడు! పిలవగానే వస్తాడు! నా వస్త్రాపహరణం జరుగుతుంటే నన్ను రక్షించింది అన్నే కదా! నన్ను మించిన సాక్ష్యము కావలెనా?" అన్నది ద్రౌపది.

"అందుకే నమ్మా మరోసారి పిలువు!" అన్నారు అష్టభార్యలు.

"అన్నా! నీ చెల్లెలిని పిలుస్తున్నా కాపాడన్నా!" అన్నది ద్రౌపది దీనంగా, కాని లాభం లేదు.

కృష్ణుడి జాడ లేదు.

ద్రౌపది మళ్ళీ మళ్ళీ పిలిచింది. కాని ఫలితం లేదు. కృష్ణుడు రాకపోయినా నారదుడు మాత్రం వచ్చాడు.

"నారాయణ! నారాయణ! ఏమిటి అంతా సమావేశం అయ్యారు! ఏమిటీ విశేషం?" అడిగాడు నారదుడు.

"రండి స్వామీ! దేశంలో ఆడపిల్లల ఆక్రందనలు ఆకాశాన్ని అంటుతున్నాయి! కాని స్వామి వారు మాత్రం వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారో లేదో కూడా తెలియటం లేదు" అన్నారు.





"దీనికి అంత ఆందోళన ఎందుకు తల్లీ!" మీ వద్ద స్వామివారు ప్రసాదించిన "భవిష్యత్ పేటిక" ఉంది కదా! అందులో వెతకండి! స్వామి వారు ఎక్కడున్నారో తెలుస్తుంది!" అన్నాడు నారదుడు.

క్షణాల్లో భవిష్యత్ పేటిక వచ్చింది. రుక్మిణీ స్వయంగా పేటిక తెరిచింది. పేటికలోని దృశ్యం చూడగానే "ఘోరం! ఘోరాతి ఘోరం నేను చూడలేను!" అంటూ కళ్ళు మూసుకుంది.

దాంతో మిగిలిన వారూ పేటికలోని కనబడుతున్న దృశ్యాన్ని చూశారు! వారూ చూడలేక పేటికను మూసివేశారు!

"ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి ఉంది. వీధుల్లో తిప్పుతున్న భయానక దృశ్యం అందులో కనిపిస్తోంది. వారిపై అత్యాచారాలు చేసిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. అది చూసి నారదుడు కూడా తల్లడిల్లిపోయాడు. మెల్లిగా ద్రౌపది వైపుచూశాడు.

ఈసారి తనే కృష్ణ పరమాత్మను స్మరించు పేటికను మళ్ళీ తెరిచాడు. ఈసారి పేటిక తెరపై ఒక పురుషుడు కనబడ్డాడు. "నా ప్రాణాలకు తెగించి కార్గిల్ యుద్ధంలో నా దేశాన్ని కాపాడుకున్నాను. నా త్యాగాలను గొప్పగా చెప్పిన వారు అధికారంలోకి వస్తే ఆనందపడ్డాను. కాని నా భార్యను కాపాడుకోలేకపోయాను" అని ఆ మాజీ సైనికుడు రోదిస్తున్నాడు.

"కృష్ణా ఏమిటి నీ లీల! ఏమిటీ వైపరీత్యం! అన్న పిలవగానే ద్రౌపదికి అండగా నిలిచి, ఆమె శీలాన్ని కాపాడావు! మణిపూర్‌లో నిన్నెవరూ పిలవలేదా! లేక పిలిచినా రాలేదా?" అని ఆక్రోశించాడు నారదుడు.

"నారదా!" అంటూ ఒక ముద్ర స్వరం వినిపించింది అందరూ అటూ ఇటూ చూశారు. అది కృష్ణుడి స్వరమే.

"మీ ఆవేదన నాకర్థమైంది! ద్రౌపదిని కాపాడిన నేను మిగిలిన మహిళలను ఎందుకు కాపాడటం లేదని ఆవేదన చెందుతున్నారు. కాని అది ద్వాపరయుగం, అదేమో కలియుగం, ద్వాపర యుగంలో దుశ్శాసనుడు, కీచకుడూ, ఇలా కొంత మందే ఉన్నారు. ఆనాడు కేవలం కౌరవసభ మాత్రమే గుడ్డివాడి పాలనలో ఉండింది. కాని ఈనాడు భారతదేశమే కళ్ళు ఉండీ చూడలేని ధృతరాష్ట్రుల పాలనలో మగ్గుతున్నది. ఈ అత్యాచారం గురించి మాట్లాడలేని మూగవారి పాలన కొనసాగుతున్నది. కలియుగంలో ప్రజాస్వామ్యం అత్యంత శక్తివంతం! కాని ఆ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవలసింది ప్రజలే! భావోద్వేగాలకు, రాగద్వేషాలకు ప్రజలు లోనైతే వచ్చేది ధృతరాష్ట్రుల పాలనే! దీనికి ప్రజలే సరైన సమాధానం చెబుతారు! నేను నిమిత్త మాత్రుడిని!" అంటూ పేటిక మూతపడింది.

- ఉషాకిరణ్

నరమేధ వేట



మహాత్ముని బలికొన్న
నరహంతక ఆత్మ
భారత జాతిని నేడు
భయంకరంగా
వేటాడుతున్నది.
గుజరాత్ నరమేధం
రక్తపు టేర్ల తడి
ఇంక ఆరనే లేదు
మణిపూర్
మారణహోమ జ్వాలలు
ఎగసెగసి పడుతున్నాయి
అటు ఆదివాసీలు
ఇటు ఆడవారు
గొంతు పెగలని గోడుతో
సమిధలవుతున్న కాలం
కాషాయమే
కాలకూట విషమై
దేశమంతటా విద్వేషం
బుసలు కొడుతున్నది
నాజీ నరహంతక హిట్లర్
20వ శతాబ్దపు మాట
ఈ నరమేధ విద్వేషం
21వ శతాబ్దపు వేట.

- కె. శాంతారావు,
సెల్:9959745723

మా తాత ఎంత మంచోడో...

వాన కురిస్తే.. హరివిల్లు విరిస్తే... ఆ ఆనందమంతా తమదేనని ఉప్పొంగిపోతారు చిన్నారులు. గత నాలుగైదు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాన కురుస్తూనే ఉంది. హరివిల్లు విరుస్తూనే ఉంది. దీంతో హైదరాబాద్ నగర పరిధిలోని పాఠశాలలన్నింటికీ ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. తొలుత గురువారం, ఆ తర్వాత శుక్ర, శనివారాలు కూడా బడులు బందయ్యాయి. ఇక ఆదివారం ఎట్లాగూ సెలవేనాయే. దీంతో బుడతల ఆనందానికి అవధులే లేవు. వచ్చిన చిక్కల్లా ఏంటంటే... పార్కుల్లో ఆడుకోవటానికి వీల్లేదు.. స్నేహితుల ఇండ్లకు వెళ్లటానికి అంతకంటే వీల్లేదు.. సరదాగా అమ్మా నాన్నలతో కలిసి ఏదైనా సినిమాకో, షికారుకు వెళదామన్నా అస్సలు కుదరకపోతుండే. ఆకాశానికి చిల్లులు పడ్డట్టు ఒకటే జోరువాన పడుతుంటే ఇటు ఇంట్లో ఉండలేక.. అటు బయటక పోలేక పిల్లలు తెగ ఇదైపోతున్నరు. ఈ క్రమంలో ఆదివారం నుంచి రానే వచ్చే. సోమవారం నుంచి మళ్లీ బడికిపోక తప్పదాయే. దీంతో మరింత బెంగపట్టుకుంది చిన్నారులకు. 'మా కేసీఆర్ తాత ఎంత మంచోడో.. వరసగా నాలుగు రోజులు సెలవులిచ్చిండు. మళ్లీ వర్షం పడితే బాగుండు.. తాత మళ్లీ సెలవులిస్తే బాగుండు...' అనుకుంటున్నారు భావి భారత పౌరులు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి రోడ్ల మీద వెళుతుంటే.. గల్లీ క్రికెట్ ఆడుతున్న పోరలు అన్నప్పుడు చెవిన పడ్డ మాటలివి.

-బి.వి.యన్.పద్మరాజు

రిపోర్టర్స్ డైరీ

ఏడ్పొచ్చిందంట!

నాకేడ్పొచ్చింది..! అందుకే బాత్‌రూంలోకి పోయి ఏడ్సినా..! అన్నడు ఓ పువ్వు గుర్తు పార్టీ లీడరు. గాయనెవ్వరో సమజైతలేనుల్లా... గదే కోమటిరెడ్డి రాజగోపాలుడు. ఇంతకెందుకేడ్సిండో చెప్పిండా మరీ... గదే కమలం పువ్వుగుర్తు పార్టీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ దిగిపోయినందుకట! అందుకే గాయన్ను సూస్తే బాధని పించిదంట!

గిదంతా ఒకెత్తయితే... అసలు అధిష్టానానికి ఫిర్యాదు చేసినొళ్లే ఏడ్సేదేందని ముక్కునేలేసుకుంటున్నారు. అంతేకాదు..జర నన్నయితే పనిజేయనివ్వలే... ఇగ కిషన్‌రెడ్డినన్న పనిజేయనియ్యండ్రి.. ఫిర్యాదు చేయకండ్రని సంజ యన్నా కూడ చెప్పే. అంతజేసినంకా ఏడ్సుడెందుకో మరీ! ఆ ఏడ్పేందో ముందేడ్సితే బాగుండేది కదా. ఏమో అనుకోని ఫిర్యాదు చేస్తే ఏకంగా అధ్యక్షుడినే మార్చేశారు. గింతదాక వస్తదనుకోకపోవచ్చు. కానీ క్రమశిక్షణలో మారుపేరని చెప్పుకుంటున్న కమలం పార్టీలోనూ నేతలు దారి తప్పుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నవి.

- నిరంజన్ కొప్పు

రెయిన్ ఫైటర్..!

రాష్ట్రంలో కురుస్తున్న వానలతో నేల పులకించి రైతులు సంతోషంగా ఉన్నారు. నాలుగురోజులుగా ఎడతెరపిలేని ముసురుతో వాహనదారులు రోడ్ల మీద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంతా రెయిన్‌తో ఫైట్ చేస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకోవాలంటే రెయిన్‌ను తట్టుకోవాలి. అందుకు అందరూ రెయిన్ ఫైటర్‌ను ఆశ్రయిస్తున్నారు. ఫైటర్ల కోసం జనం ఎగబడుతున్న నేపథ్యంలో వాటి ధరలు కూడా పైకి ఎగబాకుతున్నాయి. అందులోనూ రకరకాల వెరైటీలు దర్శనమిస్తున్నాయి. ఫుట్ పాత్‌పై దుకాణాలు వెలుస్తున్నాయి. వంద రూపాయల నుంచి మొదలుకుంటే ఐదు వేల వరకు ధర పలుకుతున్నాయి. అయినా ఎవరి స్థోమతను బట్టి వారు కొంటున్నారు. అత్యధికంగా ప్రముఖ కంపెనీలు సైతం ఉత్పత్తి చేసి సొమ్ము చేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లోనూ విపరీతమైన గిరాకీ ఉన్నది. సందులో సడేమియా అన్నట్టు ఎవరికి ఇష్టమెచ్చినట్టు వారు డిమాండ్‌ను బట్టి ధరలు పెంచుతున్నారు. ఇదే కాబోలు ఎక్కడ పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలనేది నానుడి. వానలు మూడు లేదా నాలుగు నెలలు కురుస్తాయి. ఈ సమయంలోనే రెయిన్ కోట్లు అమ్ముడుపోతాయి. ఏడాదంతా గిరాకీ ఉండదు. కాబట్టి ఇప్పుడే దండుకుంటున్నారని వినియోగదారులు గుసుక్కుంటున్నారు.

- గుడిగ రఘు

నవతెలంగాణ

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,160	▲ 280
22 క్యారెట్లు	- 55,150	▲ 250
కిలో వెండి	- 80,500	▲ 1500

ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన కవి దాశరథి

- పదునైన రచనలతో ప్రజల్లో చైతన్యం : తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి



నవతెలంగాణ-ముషీరాబాద్

నిజాం పాలకుల చేతిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయి జీవచ్ఛవాల్లా బతుకుతున్న ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన కవి దాశరథి అని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అన్నారు. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం దాశరథి కృష్ణమాచార్య 98వ జయంతి సభ.. తెలంగాణ సాహితి ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆనందాచారి మాట్లాడుతూ.. నిజాం పాలనపై అక్షర శరాలు సంధించి ధిక్కార స్వరం వినిపించిన ఉద్యమ వైతాళికుడు దాశరథి కృష్ణమాచార్యులు అని తెలిపారు. పాతికేండ్ల వయస్సుకే మహాకవిగా దాశరథి కీర్తి గడించినా.. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలనే తత్వమే ఆయన్ని ఇంతవాణ్ని చేసిందని చెప్పారు. నేడు మణిపూర్ రగులుతోంది.. పాలకులు మౌనం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో దాశరథి స్ఫూర్తితో మనమంతా పోరాడాలని సూచించారు. ఈ సభలో టీపీఎస్‌కె బాధ్యులు భూపతి వెంకటేశ్వర్లు, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ ఆర్.వాసు, మేనేజర్ కృష్ణారెడ్డి, తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు అనంతోజు మోహన్‌కృష్ణ, సలీమ, ప్రభాకరా చారి, ఎం.రేఖ, పేర్ల రాము, రఘు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపైనే రూ.10 వేల భారం

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం రూ.35 వేలు చెల్లిస్తున్నట్టు ప్రకటించడంతో అభ్యర్థులపైనే రూ.10 వేల భారం పడుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస ఫీజు పెంచకపోవడంతో పేద విద్యార్థులు కొందరు ఇంజినీరింగ్ విద్యకు దూరమయ్యే ప్రమాదమున్నది. ప్రభుత్వం పేద విద్యార్థుల గురించి ఆలోచించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రూ.45 వేలకు పెంచాలని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

అత్యధిక ఫీజు రూ.1.60 లక్షలు

విద్యాశాఖ జారీ చేసిన జీవో నెంబర్ 37 ప్రకారం 40 ఇంజినీరింగ్ కాలేజీల్లో రూ.లక్ష ఆపైన ఫీజులను ఖరారు చేసింది. ఈసారి అత్యధిక ఫీజు రూ.1.34 లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పెరిగింది. గతంలో సీబీఐటీలో అత్యధిక ఫీజు రూ.1.34 లక్షలుంటే, ఈసారి ఎంజీఐటీలో అత్యధిక ఫీజు రూ.1.08 లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పెరిగింది. ఆ కాలేజీలో ఏకంగా రూ.52 వేలు ఫీజు పెరగడం గమనార్హం. సీవీఆర్‌లో రూ.1.50 లక్షలు, సీబీఐటీ, వాసవి, వర్ధమాన్ కాలేజీలకు రూ.1.40 లక్షల ఫీజు ఖరారైంది. అత్యల్ప ఫీజు మాత్రం రూ.35 వేల నుంచి రూ.45 వేలకు ప్రభుత్వం పెంచింది. రూ.45 వేల ఫీజున్న కాలేజీలు తొమ్మిది ఉన్నాయి. ఈ ఫీజులు 2022-23, 2023-24, 2024-25 విద్యాసంవత్సరాల బ్లాక్ పీరియెడ్‌కు అమల్లో ఉంటాయి.

ఇంజినీరింగ్ ప్రవేశాల వివరాలు

వివరాలు	అభ్యర్థులు
మొదటి విడతలో కేటాయింపు	70,665
ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు	54,467
పూర్తి ఫీజుకు అర్హులైన వారు	
ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలు	11,555
ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారు	11,822
ఎంసెట్‌లో పదివేల లోపు ర్యాంకువారు	2,492
రూ.35 వేల ఫీజుకు అర్హులైన వారు	28,598

మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి


- గ్రూప్-1 నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థుల్లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని పలువురు నిరుద్యోగ అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీని డిమాండ్ చేశారు. వచ్చేనెలలో గ్రూప్-1 తుది కీతోపాటు ప్రిలిమ్స్ ఫలితాలను విడుదల చేయనున్న నేపథ్యంలో శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లోని 994 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష కోసం 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 2,33,506 మంది హాజరయ్యారు. అయితే గ్రూప్-1 నోటిఫికేషన్ ప్రకారం 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. కానీ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్‌ను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసింది. దీంతో చాలా మంది అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడు 1:50 నిష్పత్తి ప్రకారం మెయిన్స్‌కు ఎంపికైన 25,150 మంది అభ్యర్థుల జాబితాను కూడా టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. అయితే జూన్‌లో నిర్వహించిన పరీక్ష ప్రశ్నాపత్రం సివిల్ సర్వీసెస్‌లో మాదిరిగా రావడంతో అప్పుడు మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు ఎంపిక అవుతామో లేదోనన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందుకే 1:100 నిష్పత్తి ప్రకారం మెయిన్స్‌కు ఎంపిక చేస్తే అభ్యర్థులందరికీ న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. 2011 తర్వాత తెలంగాణలో తొలి గ్రూప్-1 నోటిఫికేషన్ కావడంతో ఎక్కువ మందికి మెయిన్స్ రాసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్-1లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయని (2003) గుర్తు చేశారు. ఇటీవల తెలంగాణ పోలీసు నియామక బోర్డు నిర్వహించిన కానిస్టేబుల్, ఎస్సై ప్రిలిమ్స్‌లో కటాఫ్ తగ్గించి అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ విపక్షాలు అడిగితే సీఎం కేసీఆర్ స్పందించి అంగీకరించారని తెలిపారు. అదే పద్ధతిలో గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరుతున్నారు. అలా చేయకుండా ఫలితాలు ప్రకటిస్తే గతంలో ఎంపికై ఇప్పుడు కాని వారు కోర్టును ఆశ్రయించి కేసు వేస్తామని పేర్కొన్నారు. 2011 గ్రూప్-1లో కొందరు అభ్యర్థులు కోర్టుకు వెళ్లడం వల్లే సుప్రీంకోర్టు తీర్పుతో 2016లో మళ్లీ మెయిన్స్ నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ అభ్యర్థనను మన్నించి గ్రూప్-1లో 1:100 నిష్పత్తితో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేలా టీఎస్‌పీఎస్సీని ఆదేశించాలని కోరారు.

ఎన్సీడబ్ల్యూ చైర్‌పర్సన్
రాజీనామా చేయాలి

- మణిపూర్ మహిళా నేరాలపై ఫిర్యాదులొచ్చిన ఎందుకు చర్యలు తీసుకోలేదు..?
- ఈ క్రూరమైన దాడిని ఎన్సీడబ్ల్యూ ఉద్దేశపూర్వకంగా విస్మరణ
- పాలక పక్షపాతిగా దిగజారడం దారుణం
- ఎన్సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖాశర్మకు మహిళా సంఘాల లేఖ



చురన్‌చంద్‌పూర్‌లో..

మణిపూర్ ఫైల్స్..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించి ఫిర్యాదులంది నప్పటికీ, జాతీయ మహిళ కమిషన్ (ఎన్సీడబ్ల్యూ) చర్యలు తీసుకోకపోవడం పట్ల మహిళా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను కట్టడి చేయడంలో విఫలమైనందుకు బాధ్యత వహించి ఎన్సీడబ్ల్యూ చైర్ పర్సన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం ఎన్సీడబ్ల్యూ చైర్ పర్సన్ రేఖా శర్మకు ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐపీడబ్ల్యూయూఏ, ఎఐఎంఎస్ఎస్, ఎఐఎంఎస్, ఏఐసీపీపీఐ తదితర మహిళ సంఘాలు సంయుక్తంగా లేఖ రాశాయి.

" మణిపూర్‌లో ముగ్గురు మహిళలను ఒక గుంపు బహిరంగంగా బట్టలు విప్పి లైంగికదాడికి పాల్పడిన దారుణ ఘటనకు సంబంధించి ఎన్సీడబ్ల్యూకి ఫిర్యాదు అందినప్పటికీ, నెలకు పైగా ఏమీ పట్టనట్లు వ్యవహరించడంపై మహిళా సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. మణిపూర్‌లో ఇతర లైంగిక వేధింపుల కేసులు కూడా ఉన్నట్టు సమాచారం అందింది. కొద్దిరోజుల క్రితం క్రూరమైన హింసకు సంబంధించిన వీడియో బయటకు వచ్చినప్పుడు, దేశవ్యాప్తంగా ఉధృతంగా ఆగ్రహావేశాలు వ్యక్తమైనప్పుడు, ఎన్సీడబ్ల్యూ నిద్ర నుంచి మేల్కొని నేరాన్ని "సుమోటో కాగ్నిజెన్స్ కింద తీసుకుంది" అని విమర్శించాయి. "మే 3న హింస ప్రారంభమైన వెంటనే, మే 4న జరిగిన ఘటనలో కేవలం జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో బాధితుల పట్ల పోలీసుల ఉదాసీనత, నేరానికి పాల్పడిన వారితో కుమ్మక్కు కావడం స్పష్టంగా కనిపించింది" అని ధ్వజమెత్తాయి. "రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని మౌనం అత్యంత ఖండించదగినది. దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని మీకు తెలుసు. మణిపూర్‌లో జరుగుతున్న హింసకు ప్రత్యక్ష బాధితులుగా మహిళలు మారారని మీకు తెలియదా?" అని ప్రశ్నించాయి. " ఎన్సీడబ్ల్యూ తన బాధ్యతకు ద్రోహం చేసిందని, ఉద్దేశపూర్వకంగా ఈ సంఘటనను కప్పిపుచ్చడానికి ప్రయత్నించిందని మేము గట్టిగా అభిప్రాయపడుతున్నాం. దేశంలోని మహిళలను రక్షించడం, వారి హక్కులను కాపాడటం ఎన్సీడబ్ల్యూ బాధ్యత..అలాంటిది తాజా ఘటనతో ఆ సంస్థ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని విమర్శించాయి.

జాతీయ మహిళా కమిషన్ అధికార పార్టీ అస్త్రంగా వ్యవహరించకుండా, దాని ఉన్నత లక్ష్యాన్ని సాధించడంలో దాని స్వయంప్రతిపత్తి, గౌరవాన్ని కాపాడాల్సి ఉంది. ఎన్సీడబ్ల్యూ దాని ఉన్నతమైన లక్ష్యం నుంచి పక్కదారి పట్టకుండా మేం తరచు గొంతెత్తుతాం. మహిళలకు సంబంధించిన అనేక సమస్యలలో చురుకైన జోక్యం చేసుకున్న చరిత్ర ఎన్సీడబ్ల్యూకి ఉంది. కానీ మీ సారథ్యంలో, ఈ సంస్థ డబుల్ ఇంజిన్ సర్కారుకు జీ హుజూర్ అంటోందని మేము చూశాం.

మణిపూర్‌లోని అధికారులకు తెలియజేసినట్లు మీ వాదనలు చాలా ఆలస్యంగా వచ్చాయి. సంస్థ ఇంత అవమానకరంగా దాని స్వంత ఆదేశాన్ని అణగదొక్కడం మేం ఎన్నడూ చూడలేదు. ఇద్దరు గిరిజన మహిళలపై జరిగిన ఈ క్రూరమైన దాడిని ఉద్దేశపూర్వకంగా విస్మరించి, అణచివేయడంలో ఎన్సీడబ్ల్యూ తన కార్యాలయాన్ని దుర్వినియోగం చేసింది. ఎన్సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా ఈ అవమానకరమైన పరిస్థితికి మేము మిమ్మల్ని బాధ్యులుగా భావిస్తున్నాం. అనర్హులుగా నిరూపించుకున్న మీరు వెంటనే పదవికి రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశాయి.

కేరళ ప్రభుత్వ స్కూల్‌లో చేరిన మణిపూర్ చిన్నారి జెజెమ్
ఆమె ఇప్పుడు కేరళ కుమార్తె

- ప్రేమగల స్నేహితులు, ఉపాధ్యాయులు సంతోషంగా ఉంది
- ఆమె ముఖం నుంచి హింస, భయం నెమ్మదిగా మసకబారుతున్నాయి
- మణిపూర్ హింసలో జెజెమ్ ఇల్లు దహనం
- బంధువుతో కేరళకు చేరుకున్న చిన్నారి
- అన్ని విధాలా ఆదుకుంటాం: విద్యా శాఖ మంత్రి వి.శివన్ కుట్టి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లోని హింసాత్మక ప్రాంతానికి చెందిన బాలిక కేరళ ప్రభుత్వ పాఠశాలలో చేరింది. హెూనీ జెమ్ వైఫే ముద్దుగా 'జెజెమ్' అని పిలిచే విద్యార్థిని తిరువనంతపురం థైకాడ్ గవర్నమెంట్ మోడల్ ఎల్‌పీ స్కూల్‌లో రెండో తరగతి లో అడ్మిషన్ పొందింది. పాఠశాలలో సందర్శించిన విద్యాశాఖ మంత్రి వి. శివన్ కుట్టి, జెజెమ్‌ను కలిశారు. ఆమెకు అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చా రు. ప్రశాంతంగా జీవించడానికి, చదువుకోవడానికి కేరళ మంచి ప్రాంతమని, తదుపరి చదువులకు అన్ని విధాల సహకారం అందిస్తానని మంత్రి పేర్కొన్నారు. అక్కడ కొనసాగుతున్న హింసాకాండలో మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలోని నకుజాంగ్ గ్రామంలో జెజెమ్ ఇల్లు దహనమైంది. ఈ ప్రాంతంలో మైయితీ ప్రజ ల ఆధిపత్యం ఉంది. మాంగ్‌డోయ్, అచోయ్‌ల రెండో కుమార్తెగా జెజెమ్ జన్మించింది. తన కుటుంబం దీనస్థితిని గుర్తించిన జెజెమ్‌ను తిరువ నంతపురంలోని కవడియార్‌లో ఆదాయపు పన్ను కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె బంధువు లుంబి చియాంగ్ కేరళకు తీసుకొచ్చారు. అదే గ్రామానికి చెందిన లుంబి చియాంగ్ కూడా అల్లర్లలో తన ఇంటిని కోల్పోయారు. సింగా కడంగ్‌బండ్‌లోని ఒక పాఠశాలలో ఆ చిన్నారి జెజెమ్ తన చదువును మధ్యలోనే నిలిపివేయవలసి వచ్చింది. ఇప్పుడు జెజెమ్ కేరళలోని తిరువనంతపురం థైకాడ్ గవర్నమెంట్ మోడల్ ఎల్‌పి స్కూల్‌లో రెండో తరగతిలో చేరింది. జెజెమ్ పట్ల ఆమె క్లాస్-ఇన్‌చార్జి టీచర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జెజెమ్ సంతోషంగా ఉంది. కేరళ రాజధాని నగరంలోని ఆమె కొత్త పాఠశాలలో ఆమె చుట్టూ ప్రేమగల స్నేహితులు, ఉపాధ్యాయులు ఉన్నారు. ఆమె ముఖం నుంచి హింస, భయం నెమ్మదిగా మసకబారుతున్నాయి. ఆమె క్లాస్‌లో ముందు బెంచ్‌లో కూర్చుంటున్నారు. జెజెమ్ ఇప్పటి నుండి 'కేరళ కుమార్తె' అని అక్కడి వారు భావిస్తున్నారు.

జెజెమ్ కేరళ అందిస్తున్న భద్రతా భావాన్ని తెలిపింద్ది వి.శివన్ కుట్టి

"మణిపూర్ నుంచి వచ్చి తిరువనంతపురంలోని థైక్కాడ్ మోడల్ గవర్నమెంట్ ఎల్‌పీ స్కూల్‌లో రెండో తరగతిలో ప్రవేశం పొందినహెూనీజెమ్ వైఫే (జెజెమ్)ను వ్యక్తిగతంగా కలుసుకున్నప్పుడు, ఆమె కేరళ కల్పిస్తున్న భద్రతా భావాన్ని తెలియజేసింది. అశాంతి ఉన్న రోజుల్లో తల్లిదండ్రులు, తోబుట్టువులు లేకుండా తన బంధువుతో కలిసి కేరళకు రైలు ఎక్కినప్పుడు ఆ చిన్నారి హృదయంలో ఏమని భావించి ఉండాలి? డియర్ జెజెమ్, కేరళ ప్రశాంతంగా జీవించడానికి, చదువుకోవడానికి మంచి ప్రదేశం. తదుపరి చదువుల కోసం అన్ని సహాయాలు అందిస్తాం" అని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ మంత్రి వి.శివన్ కుట్టి తెలిపారు.

న్యాయం కావాలి



సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరగాలి

- బీరెన్ సింగ్ ప్రభుత్వంపైనా, సీబీఐపైనా నమ్మకం లేదు
- జంతర్ మంతర్‌లో మణిపూర్ కుకీల భారీ ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సామూహిక లైంగికదాడికి గురైన మహిళలకు న్యాయం చేయాలని, కుకీలు అధికంగా ఉండే ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, హింసను ఆపాలని డిమాండ్ చేస్తూ మణిపూర్‌కు చెందిన కుకీలు భారీ ఆందోళన చేపట్టారు. శనివారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఉమ్మడి కుకీ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో వేలాది మంది కుకీలు పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకుని న్యాయం చేయాలని, దోషులను శిక్షించాలని నినాదాలు హెూరెత్తించారు. అధికార బీజేపీ ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్‌పైనా, సీబీఐపైనా తమకు విశ్వాసం లేదని ప్రకటించిన కుకీ నేతలు, హింసాకాండపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ కోర్టును ఆశ్రయి స్తామని ప్రకటించారు. "భారతీయులుగా గర్విస్తున్నాం. మణిపూర్‌లోని కొన్ని సాయుధ గ్రూపులు కోరుకునేది స్వేచ్ఛ కాదు. బదులుగా రాజ్యాంగ స్వయంప్రతిపత్తి అవసరం. భౌగోళికంగా, మానసికంగా మైయితీల నుండి వేరు చేయ బడ్డాం. ఎన్. బీరెన్ సింగ్ హయాంలో రాష్ట్రంలో నిరంకుశ పాలన జరుగుతోంది. స్వేచ్ఛ బీరెన్ సింగ్ హయంలో కొనసాగదు. వారు మసీదుల, చర్చీలను తగులబెట్టినప్ప టికీ, చురచంద్‌పూర్‌తో ఒక్క హిందూ మందిరం కూడా ధ్వంసం కాలేదు" అని పేర్కొన్నారు. మసీదులో ప్రార్థనలు చేస్తున్న మహిళపై మైయితీ దుండగులు నిప్పంటించారని, హత్యకు గురైన కుకీల మృతదేహాలు ఇంఫాల్‌కు కూడా చేరు కోలేక మార్చురీలో కుప్పలుగా పోసి ఉన్నాయని కుకీ నాయ కులు తెలిపారు. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నా రని ధ్వజమెత్తారు. కుకీలు మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వాళ్లగా చిత్రీకరిస్తున్నారని, అలాంటప్పుడు సరిహద్దుల్లో కాపలాకాస్తున్న సైనికులు, వారికి ఆధార్ కార్డులు, పాస్ పోర్టులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం విదూషకులా అని నేతలు ఆగ్రహంతో ప్రశ్నించారు. చివరి వరకు పోరా టాన్ని కొనసాగించాలని, విభజన లేకుండా అప్రమత్తంగా ఉండాలని నాయకులు కుకీలకు సూచించారు. ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ముందు వాటిని నిర్ధారించకోవాలని కూడా పిలుపు నిచ్చించారు. జాతీయ గీతం ఆలపించిన అనంతరం ఆందోళన విరమించారు. నిరసన వేదిక వద్ద భారీ పోలీసు బలగాలు మోహరించాయి.

మణిపూర్‌పై ప్రధాని ప్రకటన చేయాలంటూ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు సిద్ధం

మణిపూర్ హింసాకాండపై చర్చ జరగకుండా పార్లమెంట్‌లో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో ఉభయ సభల్లో ఈ అంశంపై ప్రధాని మోడీ ప్రకటన చేయాలని ఒత్తిడి చేసేందుకు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సోమవారం పార్లమెంట్ ఆవరణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఆందోళన చేపట్టనున్నారు. జులై 24 సోమవారం ఉదయం 10 గంటలకు ప్రతిపక్షాల సమావేశం ముగిసిన తరువాత, నాయకులు ఉభయ సభల్లోకి ప్రవేశించే ముందు గాంధీ విగ్రహం దగ్గర నిరసన తెలుపుతారు. ప్రతిపక్షాలు ఎటువంటి సమయ పరిమితులు లేకుండా అన్ని పార్టీలు మాట్లాడటానికి అనుమతించేలా చర్చను కోరుతున్నాయి.

చర్యలు తీసుకోవాలి :రాష్ట్రాల మహిళా కమిషన్లు

మణిపూర్ వీడియో ఘటనపై చర్యలు తీసుకోవాలని వివిధ రాష్ట్రాల మహిళా కమిషన్లు డిమాండ్ చేశాయి. జాతి కలహాలతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలో పాల్గొన్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, మణిపూర్ ప్రభుత్వాన్ని మేఘాలయ రాష్ట్ర మహిళా కమిషన్ కోరింది. మిజోరాం స్టేట్ కమిషన్ ఫర్ ఉమెన్, అరుణాచల్ ప్రదేశ్ ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ, నాగ మదర్స్ అసోసియేషన్ కూడా బాధితులకు న్యాయం చేయాలని, మహిళలకు, బలహీన వర్గాలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ మహిళా కమిషన్, మణిపూర్ ప్రభుత్వానికి లేఖలు రాశాయి.

మణిపూర్‌లో మతతత్వ శక్తుల దుష్ట ఎజెండా వల్లే హింస... పినరయి విజయన్



మణిపూర్‌లో మతతత్వ శక్తుల 'దుష్ట ఎజెండా' వల్లే హింస జరుగుతోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. మణిపూర్ నుంచి వెలువడుతున్న హింసాత్మక ఘటనలు "భయంకరమైనవి"గా ఉన్నాయని పేర్కొన్నారు. "మణిపూర్ హింసాత్మక ఘటనలు ప్రతి భారతీయుడి మనస్సాక్షిని ఛిద్రం చేశాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న కలహాలు మత ఉద్రిక్తతలకు ఆజ్యం పోసే దుర్మార్గపు ఎజెండా కారణంగానే జరుగుతున్నాయి. అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు మణిపూర్‌లో శాంతి, సాధారణ స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేయాలి" అని పేర్కొన్నారు. మణిపూర్‌లో రెండు నెలలకు పైగా కొనసాగుతున్న జాతి హింసను భయాందోళనలతో మాత్రమే చూడగలమని ఆయన అన్నారు. మానవ స్పృహను వేధించే భయంకరమైన దృశ్యాలు ఆ రాష్ట్రం నుంచి వస్తూనే ఉన్నాయని, కుకీ కమ్యూనిటీకి చెందిన మహిళలను అల్లరి మూకలు అత్యంత నీచంగా, క్రూరమైన రీతిలో వేటాడాయని విమర్శించారు.

మణిపూర్‌లో క్రైస్తవ సమాజాన్ని లక్ష్యంగా చేసుకునే ప్రయత్నం జరుగుతోందని, గిరిజన సంఘాల చర్చిలపై విస్తృతంగా దాడులు చేసి ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికార రాజకీయాల కోసం రాష్ట్రాన్ని అల్లకల్లోలంగా మార్చే ఎజెండాను సంఘ్ పరివార్ కలిగి ఉందని, ఈ విషయాన్ని దేశంలోని లౌకిక సమాజం గుర్తించాలని కోరారు. ఈ అంశంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం, హింస వెనుక ఉన్న సంఘ్ పరివార్ ఎజెండా స్పష్టం అవుతోందని విమర్శించారు. మత ధ్రువీకరణను బలోపేతం చేయడానికి ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నాలను ప్రతిఘటించాలని, ఓడించడం ప్రజాస్వామ్య సూత్రాలపై నమ్మకం ఉన్న ప్రజల కర్తవ్యమని పిలుపు ఇచ్చారు.

జైలు గోడలపై దాశరథి ధిక్కార రాతలు

పర్యాటక కేంద్రంగా నిజామాబాద్ ఖిల్లా జైలు : సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-కల్చరల్

నైజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి కృష్ణమాచార్యను నాటి పాలకులు బంధించినా.. నిజామాబాద్‌లోని ఖిల్లా జైలు గోడలపై కూడా ధిక్కార రాతలు రాశారని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆ జైలును ఎమ్మెల్సీ కవిత అభ్యర్థన, ప్రభుత్వ సలహాదారు రమణాచారి సూచన మేరకు పర్యాటక కేంద్రంగా.. భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా రూపొందిస్తామని ప్రకటించారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై శనివారం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ కవి దాశరథి కృష్ణమాచార్య 98వ జయంతి నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని.. పండిత కవి ఆయాచితం నటేశ్వరశర్మకు దాశరథి పురస్కారం అందజేశారు. రూ.లక్షా వెయ్యి నూట పదహారు, జ్ఞాపికను బహుకరించారు. దాశరథి అనాథలు, అన్నార్తులు లేని కాలం, కరువు కాటకాలు లేని రోజుల గురించి కలలు కన్నారని, రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఆ కలలు సాకారమవుతున్నాయని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక కొందరు విద్వేష ప్రచారం చేస్తున్నారని, వారికి దీటుగా కవులు కళాకారులు రాష్ట్ర ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ.. దేశంలో కొన్నిచోట్ల ఆకృత్యాలు, అమానవీయ ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానవతను ప్రేమించిన దాశరథి.. ఆధిపత్యాన్ని ధిక్కరించారని వివరించారు. శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణకు అత్యంత ఆత్మీయ కవి దాశరథి అన్నారు. పురస్కార గ్రహీత నటేశ్వరశర్మ.. సీఎం కేసీఆర్‌ను కృష్ణరాయలులతో పోలుస్తూ ప్రస్తుతించారు. వేదికపై ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి, సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరి గౌరీశంకర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, అధికార భాషా సంఘం చైర్మెన్ మంత్రి శ్రీదేవి, సంగీత నాటక అకాడెమీ చైర్మెన్ దీపికా రెడ్డి, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. సభకు సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ స్వాగతం పలికారు.

కులవృత్తుల ఆర్థిక పథకానికి నిధులు విడుదల చేయాలి : పైళ్ళ ఆశయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల వృత్తుల ఆర్థిక పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం అధ్యక్షులు జి నరేశ్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక పథకంలో ప్రజా ప్రతినిధుల జోక్యంతో అవినీతి పెరిగిందని తెలిపారు. అర్హత కలిగిన వత్తిదారులందరికీ పారదర్శకంగా ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రచారం చేసుకోవటంలో ఉన్న ఆసక్తి.. వృత్తిదారులకు పథకాన్ని చేరువ చేయటం లేదని విమర్శించారు. అర్హులందరికీ లక్ష సాయాన్ని అందించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాలకృష్ణ, సి మల్లేష్, జ్యోతి ఉపేందర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఎదునూరి మదార్, పాయిరాల రాములు, కోట్ల నవీన్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవిని పూజించే దేశంలో మహిళల గౌరవానికి భంగం

- స్త్రీలను అగౌరవపరిచే వారికి మతం గురించి మాట్లాడే హక్కే లేదు :నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లక్ష్మీ, సరస్వతీ, దుర్గాదేవీలను పూజించే మన దేశంలో మహిళల గౌరవానికి భంగం కలుగుతున్నదని నోబెల్ బహుమతి గ్రహీత, బచ్‌పన్ బచావో ఆందోళన్ వ్యవస్థాపకులు కైలాష్ సత్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీలను అగౌరవపరిచే వారికి మతం గురించి మాట్లాడే హక్కే లేదని స్పష్టం చేశారు. అలాంటి వారికి హిందువులు, ముస్లీంలు, క్రైస్తవులు తదితర మతాలకు చెందిన వారమని చెప్పుకునే అర్హత లేదన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ట్రిబుల్ ఐటీ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కరోనా సమయంలో విధించిన తొలి లాక్‌డౌన్ సమయం లో మొదటి 15 రోజుల్లోనే తాము నిర్వహించిన సర్వేలో భయానక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఆ సమయంలో చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (పిల్లల పట్ల లైంగిక వేధింపులకు సంబంధించినవి) 90 శాతం పెరిగాయని తెలిపారు. దయగల నాయకత్వం ప్రపంచపు తక్షణావసరమని కైలాష్ సత్యార్థి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. రాజకీయ, మత తదితర రంగాల్లో కరుణ కలిగిన వారు నాయకులుగా ఉండాలని సూచించారు. ప్రజల పట్లనే కాదు... వారిని నమ్మిన వారి పట్ల కొంత మంది అలాంటి దయను కనబరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక విషయాలు ప్రపంచీకరణ చెందాయనీ, ప్రస్తుతం కరుణ ప్రపంచీకరణ కావాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా మానసిక జబ్బులు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దావానంలా పెరుగుతున్న ఈ వ్యాధులు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వీటిపై ప్రతి ఏడాది దాదాపు ఒక ట్రిలియన్ యూఎస్ డాలర్లు ఖర్చు చేస్తున్నదని చెప్పారు. ప్రతి ఏడాది 89 మిలియన్ల మంది డిప్రెషన్ (నిరాశ)తో చనిపోతున్నారని వివరించారు. ఇందులో సగం నిధులు విద్య, వైద్యం, ఇతర రంగాలకు ఖర్చు చేస్తే మానసిక జబ్బులకు అడ్డుకట్ట వేయవచ్చని సూచించారు. ఆత్మవిశ్వాసాన్ని విడిచిపెట్టొద్దని సత్యార్థి ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. సమస్యలు, కష్టాల నుంచి వచ్చిన తాను ఎదిగిన ప్రస్థానాన్ని, నిరక్షరాస్యురాలైన తన తల్లి సంతానం పట్ల చూపించిన శ్రద్ధను ఆయన వివరించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు టెక్నాలజీతో పరిష్కారాలు చూపించాలని పిలుపునిచ్చారు. పట్టుదలతో ఎదిగిన వారు కచ్చితంగా నోబెల్ బహుమతిని పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచం ప్రగతి పథాన ఉన్నా... దానికి సంబంధించిన డేటా కొన్ని కంపెనీలు, కొన్ని దేశాల నియంత్రణలోనే ఉందని తెలిపారు.

వనస్థలిపురం ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సంగిరెడ్డి భీంరెడ్డి




నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురం ఏసీపీగా సంగిరెడ్డి భీంరెడ్డి శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ జలంధర్ రెడ్డి నేతృత్వంలో డిటెక్టివ్ సీఐ వెంకటయ్య, ఎస్ఐలు, మాధవరెడ్డి, జగన్, రవిలు నూతన ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఏసీపీ సంగిరెడ్డి భీంరెడ్డి మాట్లాడుతూ వనస్థలిపురం వాసులకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఆన్లైన్ మోసాలకు లోనవ్వకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సరూర్ నగర్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ



నవతెలంగాణ-గడ్డిఅన్నారం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సరూర్ నగర్ కట్ట నుంచి వస్తున్న వరదకు వీవీ నగర్ కాలనీలో పునర్నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. దీంతో ఆ మురుగునీరంతా కాలనీల్లో ప్రవహిస్తుంది. దీని నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాల దృష్ట్యా, ఈ మురుగు ప్రవాహం వలన వ్యాధులు సంభవించే అవకాశాలు ఉన్నాయని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యను వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వయం కృషితో మహిళలు ఎదగాలి



- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

నవతెలంగాణ- అబ్దుల్లాపూర్ మెట్

స్వయం కృషితో మహిళలు ఎదగాలని...అందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. మండలంలోని బాట సింగారం గ్రామంలో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు శిక్షణ పొందిన మహిళలకు శనివారం ఎమ్మెల్యే కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్ రెడ్డి మాట్లాడు తూ మండలంలోని బాట సింగారం, బండ రావిరాల, కుంట్లూరు తదితర గ్రామాలకు చెం దిన 140 మంది శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్ల తో పాటు, సర్టిఫికెట్లను అందజేసి నట్లు తెలిపారు. మహిళలకు ఇలాంటి ఉపాధి అవకాశాలు కల్పించినట్లయితే వారు ఆర్థిక బలో పేతం కావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఉపాధి ద్వారా మహిళా అభివృద్ధి సాధికారత సాధించవచ్చని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులు సత్ఫలితాలిస్తున్నాయి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎస్ఎన్‌డీపీ పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి...గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్‌తో కలిసి డివిజన్ పరిధిలోని కోదండరాం నగర్, వీవీనగర్ నందు కాలనీల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగావీవీనగర్‌లో జరుగుతున్న పైపు లైన్ పనుల దగ్గర చెత్త, చెదారం జామ్ అయిందన్నారు. దానివల్ల మురుగునీరు కాలనీలోకి చేరుతుందని చెప్పారు. వెంటనే ఆ చెత్త, చెదారాన్ని తొలగించినట్లు తెలిపారు. అలాగే వరద ప్రవాహం తగ్గడానికి గేట్లు తెరచినట్లు తెలిపారు. దాని ప్రభావానికి కొన్ని కాలనీలలో వరదనీరు చేరిందని..వెంటనే గేట్లు మూసివేసినట్లు వివరించారు. సరూర్ నగర్ చెరువు నందు మూడో గేటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం కోదండరాం నగర్, వీవీనగర్ కాలనీలకు ముంపు నుంచి విముక్తి లభించిందని పేర్కొన్నారు. ఇప్పటికే 80% పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయి.. వాటిని కూడా ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు 'వైశ్యులు-ఆత్మగౌరవ' సదస్సు



నవతెలంగాణ - చైతన్యపురి

చట్ట సభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కర్మన్‌ఘట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే 'వైశ్యులు-ఆత్మగౌరవ' సదస్సును విజయవంతం చేయాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ కాచం సత్య నారాయణ గుప్తా కోరారు. చైతన్యపురిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ఆర్యవైశ్యులకు ప్రాతి నిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ఈ చర్చా గోష్టికి మేధావులు, జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభలో 15 మంది ప్రాతినిధ్యం వహించగా..ప్రస్తుతం తెలంగాణ మొత్తంలో ఒక్కరే ఉన్నారని తెలిపారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లే వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. వైశ్యులను ఓటు బ్యాంక్‌గా చూడకుండా జనాభా ప్రాతిపదికన అన్ని పార్టీలు రాబోయే ఎన్నికల్లో తగిన సీట్లు కేటాయించాలన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్త చర్యలు



- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సంతోష్ నగర్

వర్షం కారణంగా నీటి నిల్వలు ఉండే ప్రాంతాలను గుర్తించి..ఎప్పటికప్పుడు అప్రమత్త చర్యలు చేపడుతున్నట్లు మలక్‌పేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ తెలిపారు. మలక్‌పేట్ డివిజన్ పరిధిలోని మూసారంబాగ్ మూసీ ఫ్లేవర్ సిగ్నల్ వద్ద రోడ్డుపై నిలిచిన నీటితో ట్రాఫిక్ సమస్య తలెత్తిందన్నారు. వెంటనే అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి, రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ, ఏఈ అధికారులు, ట్రాఫిక్ పోలీస్, సిబ్బందిలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బుర్గుల ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మి కుల సమ్మె న్యాయబద్ధమైందన్నారు. వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కొందరు ప్రజాప్రతి నిధులు, పంచాయతీ కార్యదర్శిలు అసత్య ప్రచారాలు చేస్తూ.. కార్మికులను మభ్యపెడుతూ ఉద్యోగం నుంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అభూత కల్పనలు, కాకమ్మ కథలకు భయపడేది లేదని హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా, కార్మిక చట్టాలను అనుసరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహా కార్యదర్శి శివకుమార్, సిబ్బంది అంజయ్య, లింగం, రవి, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్‌ను కలిసిన బ్రహ్మయ్య

నవతెలంగాణ -నాగోల్

ఇటీవల రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రజిని సాయి చందును శనివారం గుర్రం గూడలోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర గాడ్గే రజక సంఘం అధ్యక్షులు పెదవురే బ్రహ్మయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి చందుకు పూల మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. సాయి చందును కలిసిన వారిలో లట్టుపల్లి తిరుపతి, ఈ. రమేష్, నరేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా రోడ్లు




నవతెలంగాణ - నాగోల్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నాగోల్ డివిజన్‌లోని పలు కాలనీల రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. గత రెండేళ్లుగా నాగోల్ డివిజన్‌లోని కాలనీలు వరద ముంపునకు గురవుతున్న విషయం తెలిసిందే..దీనిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ ద్వారా బాక్స్ డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ నేటికీ ఆ పనులు పూర్తికాలేదు. వర్షాలు ముంచుకొస్తున్న ప్పటికీ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలను గురవుతున్నారు. ఎడతెరపి లేకుండా కురిసిన ఈ వర్షాలకు నాగోల్ నుండి బండ్లగూడ మీదుగా ఓఆర్ఆర్‌కు వేళ్లే రేడియల్ రోడ్డు..ఆనంద్ నగర్ చౌరస్తా నుండి మన్సురాబాద్ కు వెళ్లే, జైపూర్ కాలనీ అంబేద్కర్ చౌరస్తా నుండి శుభం కన్వెన్షన్‌కు వెళ్లే దారిలోని రోడ్లు నీటితో నిండి చెరువును తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్మాణంలో ఉన్న బాక్స్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శభాష్ హయత్ నగర్-1 డిపో మహిళా కండక్టర్



నవతెలంగాణ-హయత్‌నగర్

హయత్ నగర్- 1 డిపో మహిళా కండక్టర్.. తనకు దొరికిన చెవి బంగారు దిద్దును బాధిత ప్రయాణికురాలికి అందజేసి శభాష్ అనిపించుకున్నారు. పూర్తి వివరాలు..విధి నిర్వహణలో భాగంగా హయత్ నగర్-1 డిపో మహిళ కండక్టర్..అనాజ్ పూర్ నుండి కోఠికి డ్యూటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ మహిళ ప్రయాణికురాలు లష్కర గూడలో ఎక్కింది. తను వనస్థలిపురం స్టేజీలో దిగుతుండగా..ఆమె చెవి బంగారం దిద్దు(25000 విలువగల) బస్సులో కింద పడిపోయింది. దీనికి గమనించిన కండక్టర్ వెంటనే ఈ విషయాన్ని హయత్ నగర్-1 డిపో మేనేజర్ రఘుకు చేరవేసింది. తర్వాత ఆ ప్రయాణికురాలిని డిపోకు పిలిపించి..సహాయ మేనేజర్ కిష్టయ్య, విజయకుమారి విజిలెన్స్ అధికారి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఆ బంగారు దిద్దును అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రఘు మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరు మా సంస్థ ఉద్యోగులు అని కొనియాడారు. అనంతరం కండక్టర్ ఉదయశ్రీకి అభినందనలు తెలియజేశారు.

'వార్డు ఆఫీస్ ఏర్పాటుకు గడువు ఇవ్వండి'



నవతెలంగాణ-వనస్థలిపురం

ఎన్జీవోస్ కాలనీలోని వార్డు ఆఫీస్ ఏర్పాటుకు గడువు ఇవ్వండి అని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎన్జీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ అండ్ హౌసింగ్ సొసైటీ మెంబర్స్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్జీవోస్ కాలనీలోని మోడల్ హౌస్ జీహెచ్ఎంసీ వార్డు ఆఫీస్ ల్యాండ్ కోర్టు కేసులో ఉందన్నారు. అందుకే ఆ వార్డు ఆఫీస్‌ను ఓపెన్ చేయడానికి ఒక నెల టైం కావాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ మెంబర్స్ సోమయాజులు, పంపన్న వెంకటేశ్వరరావు, సాయికుమార్, జైపాల్ రెడ్డి, వర్ధని, శరత్, సిద్ధార్థ, హర్షద్ అలీ ఖాన్, నరసింహారెడ్డి, న్యూటన్, ఆనంద్, శ్యాం కుమార్, ప్రసాద్, ధనలక్ష్మి, ఓం ప్రకాష్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ షాపులో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ -చైతన్యపురి

దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ మొబైల్ షాపులో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్ నగర్ వద్ద ఉన్న మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి పొగలు వ్యాప్తించాయి. గమనించిన స్థానికులు డయల్ 100, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.5 లక్షల నష్టం జరిగిందని పేర్కొన్నారు.

'పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి అని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ సంకేశ్వర్ బజార్, సాయిరాం నగర్, పలు బస్తీల్లో ఆదివారం బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాకాల దృష్ట్యా ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులను కోరారు. చెత్త, చెదారం, వ్యర్థపదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడివేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్, విజయ, అజయ్, రాజ్ కుమార్, శేఖర్, చంద్రయ్య, మధు, రాజు కాలనీవాసులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి'



నవతెలంగాణ -చైతన్యపురి

విధి నిర్వహణలో జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఓమ్ని హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్లు వెంకట్ రమణారెడ్డి, గౌతమ్ రెడ్డి, సందీప్ రెడ్డిలు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ జోన్‌లకు సం బంధించిన జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఆరోగ్యం ఉంటేనే ఏదైనా చేయగలం, సాధించవచ్చు అని అన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించా లన్నారు. ఈ ఏడాది కూడా జర్నలిస్టుల ప్రమాద బీమా పాలసీల రెన్యూవల్ ప్రీమియంను అక్షరాల రెండున్నర లక్షల రూపాయల ప్రీమియంను ప్రముఖ టాటా ఇన్సూరెన్స్ సంస్థకు అందజేసినట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఏడేండ్లుగా దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్ జోన్లకు సంబంధించిన వారే కాకుండా ఇతర ప్రాంతాల్లోని పలువురి జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీలు అందజేస్తున్న కొత్తపేట ఓమ్ని హాస్పిటల్ యాజమాన్యానికి యావత్ జర్నలిస్టుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కటకం సుభాష్, తగరం సత్యనారాయణ, చిత్రం సైదులు, ఓరుగంటి నాగరాజు, అశోక్ గౌడ్, నాగరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలి

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

వర్షాకాల దృష్ట్యా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి..ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్, బడంగ్‌పేట్‌లలోని పలు కాలనీల్లో శనివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో నిలిచిన వర్షపు నీటిని జేసీబీ సహాయంతో తొలగించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీల్లో నీరు నిలిచిపోయిందన్నారు. ఈ నీటి నిల్వలు దోమలకు నిలయాలుగా మారి.. ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. వైద్య, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ, వరద కాల్వల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి రెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, లిక్కి కృష్ణ రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులకు శాశ్వత పరిష్కారం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ అల్కాపురి రోడ్ నెంబర్-18 (మసీద్ ఎదురుగా) యూజీడీ పైప్ లైన్, ఈస్ట్ యాదవ నగర్‌లలో నాలా పనులకు శాశ్వత పరిష్కార దిశగా పరిష్కారం చూపుతున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి తెలిపారు. డివిజన్‌లో రూ.40 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ ఆర్‌సీసీ లైన్ అభివృద్ధి పనులకు మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఈస్ట్ యాదవ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ వర్షపు నీరు పోయేలా నాళాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గంలో రూ.130 కోట్లతో నాళాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దయనంద్, యెగ్గే మల్లేశం, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జోనల్ కమిషనర్ పంకజ, మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, రామాచారి, సాజీద్, గొడుగు శ్రీనివాస్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, లింగస్వామి గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, కొండ్ర శ్రీనివాస్, శ్యాం గుప్త, యాదవ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తాడేపల్లి వెంకటేశం గుప్తా, ప్రొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా, జగిని రమేష్ గుప్తా, పటేల్ సునీత రెడ్డి, శైలజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

38 ఏండ్లుగా

ఆదరణ పొందుతున్న శ్రీ దుర్గా విలాస్ హోటల్



నవతెలంగాణ-సిటీ బ్యూరో

శ్రీ దుర్గా విలాస్ హోటల్ స్థాపించి 38 ఏండ్లు విజయవంతంగా పూర్తి అయిందని శ్రీ దుర్గా విలాస్ ప్రొప్రైటర్ ముప్పువరపు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన నవతెలంగాణలో మాట్లాడుతూ ఈ హోటల్ 1985లో స్థాపించినట్లు తెలిపారు. దీన్ని మొదటగా మా నాన్న ముప్పు వరపు రంగయ్య నాయుడు చిన్న హోటల్‌గా ప్రారంభించారని.. అంచలంచలుగా ప్రజల విశేష ఆదరణ పొందుతూ ఈ స్థాయికి చేరుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. మా నాన్న హైదరాబాద్‌లో పూర్వపు విశాలాంధ్ర పత్రికలో కంపోజర్‌గా పనిచేశారని, తర్వాత ఉద్యోగ బదిలీలో విజయవాడకు వెళ్లారన్నారు. మళ్లీ హైదరాబాద్‌కు తిరిగి వచ్చి 1985లో ఈ హోటల్ పెట్టారని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు, చుట్టుపక్కల వనస్థపురం వాస్తవ్యులకు ఈ హోటల్ ద్వారా మంచిగా నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పారు.

ఈ హోటల్ నుంచే రామోజీ ఫిల్మ్ సిటీకి భోజనాలు..

ఇక్కడి నుండి రామోజీ ఫిల్మ్ సిటీ సినిమా షుటింగ్ టైంలో ప్రముఖ హీరోలు రజనీకాంత్, గీతా సింగ్, తమిళ హీరోలకు భోజనాలు తీసుకెళ్తారని చెప్పారు. అంతేకాదు ఈ హోటల్‌కి ప్రముఖ దర్శకులు శంకర్, తేజ, వంశీ, సురేందర్ రెడ్డి, పైడిపల్లి వంశీ, తనికెళ్ల భరణి తదితరులు వస్తారని వివరించారు. మా దగ్గర స్పెషల్ వంటకాలు... చికెన్ దమ్కా బిర్యానీ, నాటుకోడి, బొమ్మిడాయిలు చేపలు, కొరమేన్ పులుసు, గోంగూర మటన్, గోంగూర చికెన్, రొయ్యలు, పీతల వంటకాలు లభిస్తాయన్నారు. మార్నింగ్ టైంలో టిఫిన్స్..రాగి దోశ, రాగి ఇడ్లీ, పెసరట్టు ఉప్మా, వడ వంటివి ఉంటాయని వివరించారు. మా హోటల్‌కు సంబంధించి కస్టమర్స్ సలహాలు, సూచనలు తప్పక తీసుకుంటామని తెలిపారు.

'రవాణా రంగా కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి'



నవతెలంగాణ -నాగోల్

రవాణా రంగా కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరవని రాజు గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడీ భవన్‌లో శనివారం తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులుగా గుర్తించబడిన రవాణా రంగా కార్మికులకు సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకవచ్చి, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని.. అలాగే ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్టకొడుతున్న ఓలా, ఉబర్, రాపిడో కంపెనీలను తెలంగాణలో నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రభుత్వమే రవాణా రంగా యాప్‌ను తయారు చేయాలని కోరారు.ఈ డ్రైవర్లకు తెల్ల రేషన్ కార్డు, డ్రైవర్లకు రూ.పది లక్షల ఇన్సూరెన్స్, ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన లేదా సాధారణ మరణం పొందిన ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని చెప్పారు. ఈ నెల 29న అసెంబ్లీ ఎదుట తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి రవాణా రంగ కార్మికులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రవి గౌడ్, కోశాధికారి పొడుగు శ్రీకాంత్, ప్రచార కమిటీ కార్యదర్శి భాష సత్యం నేత, రాష్ట్ర నేతలు సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, కాశిరెడ్డి, ఆనంద్, రమేష్, ఆటో రంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణయ్య పాల్గొన్నారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

- సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నవతెలంగాణ - ధూల్ పేట్

మణిపూర్‌లో సభ్య సమాజం తలదించుకునేలా పరిణామాలు, మహిళల పరిస్థితి ఏర్పడడం దారుణమని సీఐటీయూ, ఐద్వా(అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం) హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లక్ష్మమ్మ పి.శశికళ, సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీ నర్ కే. జంగయ్య, జిల్లా నాయకులు పి.నాగేశ్వర్‌లు అన్నారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రను(నగ్నంగా) చేసిన ఘటనకు నిరసనగా శనివారం సీఐటీయూ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో బేగం బజార్ బూలక్ష్మి గుడి చౌరస్తా నుం డి బేగం బజార్ ఛత్రి మీదుగా మచిలీ మార్కెట్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై చెలరేగుతున్న దౌర్జన్యాలను అరికట్టే చర్యలు తీసుకోకుండా నిందితుల వైపు మద్దతుగా ఉన్న ఆ రాష్ట్ర బీజేపీ ముఖ్య మంత్రి బీరెన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక వైపు 'భేటీ బచావో' అంటున్న బీజేపీ పాలనలో సామాన్య గిరిజన మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందలాది మహిళలను ఇదే విధంగా అవమానిం చిన ఘటనలు 80 రోజులుగా జరుగుతున్నాయని.. స్వయా నా ఆ రాష్ట్ర సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనలు బయటికి రాకుండా ఇంటర్నెట్ సేవలను 80 రోజులుగా నిలిపి వేశారని మండిపడ్డారు. దీంతో నిందితుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. ఈ ఘటనలపై తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. జూన్ 6న ఇద్దరు కుకీ తెగ మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులను..శుక్రవారం పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు నిలదీసేవరకూ అరెస్ట్ చేయని అక్కడి బీజేపీ సీఎం బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కోరారు. ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతాలను అమలు చేస్తున్న బీజేపీ విధానాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేశాక..గత్యంతరం లేక కొందరి నిందితులను అరెస్ట్ చేశారని విమర్శించారు. ఈ నిరసనలో స్థానిక కార్యకర్తలు శివ, ఎం. రాజు, ఎస్.కిరణ్, నారాయణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలు, అత్యాచారాలకు పాల్పడిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ. పద్మ, కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ Xరోడ్‌లో మణిపూర్‌లో మహిళలను వివస్త్రను(నగ్నంగా) చేసిన ఘటనను ఖండిస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి



మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణం దేశ ప్రజలందరినీ కలచివేస్తోందన్నారు. 3 నెలలుగా అక్కడ మారణ హోమం జరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. ఈ ఘటనపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటే గానీ..అక్కడి ప్రభుత్వం నిందితులను అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. మహిళలకు రక్షణ కల్పించలేని ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు షాబాన, విమల, ప్రవళిక, వరలక్ష్మి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన మున్సిపల్ కమిషనర్లు



నవతెలంగాణ-ఘట్కేసర్

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని శనివారం ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్అలీ, పోచారం మున్సిపల్ కమిషనర్ వేమన రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి కమిషనర్ సాబేర్ అలీని, వేమనరెడ్డిలను శాలువాతో సన్మానించి పూలబొకేను అందజేశారు. కమిషనర్లు మున్సిపల్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అన్నారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. షేక్ జాకీర్ హుస్సేన్‌కు రూ. 12వేలు, దివ్యకు రూ.60వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, పల్లే నర్సింగరావు, గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, తిరుమలేష్, జేసీబీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్



నవతెలంగాణ-బోడుప్పల్

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోడుప్పల్ 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలత జంగారెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఉదయ నగర్, ఈస్ట్ హనుమాన్ నగర్ కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, అల్మాస్‌కుంట చెరువు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా పడడంతో కాలనీల్లో అనేక చోట్ల వర్షం నీరు చేరిందని తెలిపారు. వర్షం కురుస్తున్న సమయంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి, డివిజన్ అధ్యక్షులు తిరునగరి ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి మొగుళ్ల రవికాంత్‌రెడ్డి, గడ్డం నరేంద్ర కుమార్, దొంతి రమేష్ కుమార్, కే.ప్రభాకర్, డి.బాల్ రెడ్డి, ఎ.మోహన్, జీ. భాస్కర్, బిచ్చు నాయక్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్
- మహిళల నగ్న ఊరేగింపును నిరసిస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో కండ్లకు నల్లగుడ్డలు కట్టుకొని నిరసన



నవతెలంగాణ-కాప్రా

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరప్ చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన లైంగిక దాడిని నిరసిస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తా దగ్గర కండ్లకు నల్లగడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపునకు బాధ్యత మోడీ సర్కార్ వహించాలన్నారు. మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణను నిలువరించడంలో మణిపూర్ ప్రభుత్వం, మోడీ విఫలమైందన్నారు. మూడు నెలల నుంచి మణిపూర్‌లో మైతి, కూకీ జాతుల మధ్యలో ఘర్షణ జరుగుతుంటే రాష్ట్రం ప్రభుత్వం ఏం చేస్తున్నది ప్రశ్నించారు. మహిళలపై అత్యాచారాలు జరగడం ఇది మొదటిసారి కాదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీ ఇలాంటి ఘర్షణలను రాజకీయాల కోసం ఉపయోగించుకుంటుందని విమర్శించారు. కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళలను బహిరంగ ప్రదేశాలలో నగ్నంగా ఊరేగించి వారిని సామూహిక అత్యాచారం చేసిన వారిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. అత్యాచారం చేసిన దుర్మార్గులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు దేశవ్యాప్తంగా ప్రజలు అండగా ఉండాలని కోరారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరన్‌సింగ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేసి కుకీజాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అత్యాచారం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సృజన, వినోద, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృపాసాగర్, బాలపీర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు తీగల అరుణ్, సుమంత్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా నాయకులు బంగారు నర్సింగ్ రావు, ఐద్వా జిల్లా నాయకులు బి.మంగ, సఫియా, శారద, లక్ష్మి, శోభారాణి, గౌశబేగం, నాగమణి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

దయనీయ స్థితిలో లక్ష్మీ నగర్ పార్క్



- మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి లేఖ

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోనే అతిపెద్ద పార్క్‌గా ఉన్న లక్ష్మీ నగర్ పార్కు పరిస్థితి దయనీయంగా మారిందని బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫక్కీర్ హరినాథ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. బోడుప్పల్ నగర పాలక సంస్థ హూడా లక్ష్మీ నగర్ పార్క్ అభివృద్ధి కోసం గతంలోనే మూడు కోట్ల రూపాయలు వెచ్చించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని తెలిపారు. నేడు సరైన నిర్వహణ లేక దయనీయ స్థితికి చేరుకుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్క్ నిర్వహణ సక్రమంగా చేయాలని కోరారు. రక్షణ గోడను పూర్తి స్థాయిలో నిర్మించి కాపలా దారులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె కనిపించడం లేదా?



- సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికుల సమ్మె ప్రభుత్వానికి కనిపించడం లేదా అని సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ అన్నారు. శనివారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దండుకుంటున్న రాజకీయ నాయకులు,అధికారుల అవినీతిని అరికడితే పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచడం పెద్ద సమస్యమే కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సుధాకర్, బాబు, లీలమ్మ, నర్సింహ, రవి, మల్లేష్, గణేష్, నరసమ్మ, ప్రమీళ పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఘట్కేసర్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్. సబిత అన్నారు. శనివారం ఘట్కేసర్ ఎమ్మార్వో కార్యాలయం దగ్గర చేపట్టిన జీపీ కార్మికుల సమ్మె17వ రోజు కు చేరింది. వారికి సీఐటీయూ సబిత మద్దతు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు, పంపు ఆపరేటర్లు, కారోబార్లు, ఎలక్ట్రిషియన్లు, బిల్ కలెక్టర్లు కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని తెలిపారు. మోడీ స్వచ్ఛభారత్, కేసీఆర్ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలు జీపీ కార్మికుల చిత్తశుద్ధితోనే అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. 2014, 2018లో జరిగిన ఎన్నికల సందర్భంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని సీఎం వాగ్దానం చేశారని గుర్తు చేశారు. 9 ఏండ్లు గడిచినా నేటికీ అమలు చేయలేదు. వేతనాలు పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారంగా రూ.19వేలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం రూ.8500 ఇస్తుండడం దారుణమని వాపోయారు. పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51 రూపొందించి ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. బీజేపీ సర్కార్ కార్మికుల హక్కులను కాలరాసే చర్యలకు ఒడిగట్టిందన్నారు. 8గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బీజేపీ సర్కార్‌దేనని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు సీహెచ్ దానయ్య, కనకరాజు, శివ, బాలరాజు, వేణు, లక్ష్మీ, బాలమణి, నర్సమ్మ, ము త్యమ్మ యాదమ్మ, భిక్షపతి, రామచందర్, ఈరమ్మ, సత్యమ్మ సీహెచ్ పద్మ, జయమ్మ పాల్గొన్నారు.



ఘట్కేసర్‌లో నేడు బోనాలు



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాల్టీలో బోనాల పండుగ సందర్భంగా పలు వార్డుల్లోని అమ్మవారి ఆలయాలను మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్య యాదవ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాల్టీ పరిధిలోని ఆలయాల వద్ద ఏర్పాట్లను పరిశీలించామని తెలిపారు. ప్రజలు పోలీస్, ఆలయ నిర్వాకులకు సహకరించాలని కోరారు. పోలీస్‌లు ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. వారి వెంట కౌన్సిలర్ మేకల పద్మారావు, రహీం, శానిటేషన్ ఇన్‌చార్జి రాజేష్, ఆలయ నిర్వాకులు ఆంజనేయులు , తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగొద్దు : వైస్‌చైర్మెన్

మున్సిపల్‌లో ఆదివారం జరగే బోనాల పండుగకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దని ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ పలుగుల మాధవ్ రెడ్డి ఆలయాల కమిటీలకు సూచించారు. ఈ సందర్భంగా బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట 4 వ వార్డ్ కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్, సంజీవ, కిరణ్ మామిండ్ల సత్యనారాయణ, శ్రీను రవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్డీపీ పనులను త్వరగా పూర్తి చేయాలి

- కాంగ్రెస్ నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి
- ప్రజల తరపున నిరంతరం పోరాటం



నవతెలంగాణ-బోడుప్పల్

వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చేపట్టిన ఎస్ఎన్డీపీ పనులను త్వరగా పూర్తి చేయాలని పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2020లో వచ్చిన అకాల వర్షాల కారణంగా నగరంలోని అనేక కాలనీలు నీట మునిగాయని తెలిపారు. అప్పుడు లోతట్టు ప్రాంతాలలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, కార్మిక మంత్రి మల్లారెడ్డిలతో స్థానిక మేయర్లు పర్యటించి ముంపు ప్రాంతాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.110 కోట్లతో ఎస్ఎన్డీపీ ద్వారా మూసికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారని వారు పేర్కొన్నారు. 2022 ఫిబ్రవరి2న పనులు ప్రారంభించినా నేటికీ ముందుకు సాగకపోవడం లేదన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పీర్జాదిగూడ నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మంత్రి మల్లారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్ పట్టించుకోలేదని తెలిపారు. పాలక వర్గం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రెండు రోజులు ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రతి కాలనీల్లో పర్యటించామని ప్రజా సమస్యలపై పీర్జాదిగూడ కమిషనర్‌ను కలిసి వత్తిడి తీసుకోచ్చామని తెలిపారు. ఎస్ఎన్డీపీ అధికారుల తో మాట్లాడిన పనులు పునః ప్రారంభం చేశారని అది కాంగ్రెస్ పోరాట ఫలితమేనని అన్నారు. పనులను ప్రారంభించినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పనులు పూర్తి కాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ఓటరు లిస్ట్ సవరణపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 పోలింగ్ బూతుల ఓటర్ల సవరణలపై బూతుల వారీగా శనివారం అవగాహనా సదస్సును బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నాయబ్ తహశీల్దారు (శామీర్‌పేట్) వెంకట్ నరసింహరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థాయిలో ఓటరు లిస్ట్ సవరణపై పోలింగ్ బూత్ అధికారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటరు లిస్ట్ సవరణలో బీఎల్వోలకు 20 ప్రశ్నలతో కూడిన పరీక్ష నిర్వహించామని తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్వోల పాత్ర చాలా కీలకమైందన్నారు. కావునా బీఎల్వోలు అందరూ నిష్పక్షపాతంగా ఓటరు జాబితా సవరణ చేయాలని సూచించారు. బీఎల్వోలు చేసే సర్వేపై ఉన్నతాధికారులు నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి, బీఎల్వోలు, సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ -ఉప్పల్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ డివిజన్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం పరిసర ప్రాంతంలో జరగబోయే బోనాల పండుగ జాతర సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఉప్పల్ ప్రధాన రహదారి నుంచి దేవాలయం వరకు రోడ్లపైన గుంతలు లేకుండా కాంక్రీట్ రోటో సాండ్ వేయించి గుంతలను పూడ్చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డీఈ నిఖిల్ రెడ్డి, ఎస్ డబ్ల్యూ డీఈ చందన, ఉప్పల్ గ్రామస్తులు మేకల శివారెడ్డి,పోగుల దయాకర్‌రెడ్డి, సల్ల రాజీరెడ్డి, బిక్కుమల్ల అంజయ్యగుప్తా, కుమ్మరి నారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, వేముల సంతోష్ రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి, చింతల నరసింహారెడ్డి, కాటిపల్లి రవీందర్‌రెడ్డి, గుడి మధుసూదన్‌రెడ్డి, వంగ మహేందర్ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, నయా వెంకట్రావు, అన్య వెంకటేష్, వీరేష్, స్వీట్ హౌస్ రాజు, పల్లె నర్సింగరావు ఉన్నారు.

చైతన్య భారతి స్కూల్లో బోనాలు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో బోనాల ఉత్సవాలలో పురస్కరించుకొని శనివారం ఉప్పల్ గణేష్ నగర్‌లోని చైతన్య భారతి పాఠశాలలో బోనాల ఉత్సవాలను విద్యార్థినీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ వెంకన్న గౌడ్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి ప్రతీక బోనాల ఉత్సవాలని, సాంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా బోనాల ఉత్సవాల నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజు గౌడ్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

"భారతదేశం-వివిధ మతాలు" అనే అంశంపై సదస్సు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో "భారతదేశం-వివిధ మతాలు" అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు ప్రముఖ అభ్యుదయ కవి దాశరథి కృష్ణమాచారికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భారత దేశంలో వివిధ మతాలు వివిధ రూపాలలో ప్రజల ముందుకు వచ్చాయని చెప్పారు. సనాతన ధర్మం పేరిట యజ్ఞాగాదులు చేస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ వేదాలే ప్రామాణికంగా ఉన్న మతం వైదిక మతం అని చెప్పారు. వైదిక మతంలో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు పేరిట కుల వివక్ష కొనసాగిందని తెలిపారు. బౌద్ధమతం సమాజ పురోభివృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. ఇస్లాం, క్రైస్తవం వచ్చాయని అందులో కూడ వివక్ష ఉందని పేర్కొన్నారు. హిందూమతం అనే మతం లేదన్నారు. ముస్లింలు పెట్టిన సింధూకు బదులుగా హిందూవు అన్నారని వెల్లడించారు. హిందూ మతంలో ఎన్నో సంస్కరణలకు పనిచేసినప్పటికీ నేటికీ వివక్ష కొనసాగుతుందని చెప్పారు. భారతదేశంలో అన్ని మత భావనలకు భిన్నంగా దేశ ప్రజలందరూ ఒక్కటే అని రాజ్యాంగం చెప్పిందని గుర్తు చేశారు. అందరూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలన్నారు. నేటి పాలకులు దానికి భిన్నంగా సనాతన ధర్మాలను, మనువాదాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దానికి వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. కార్యక్రమంలో పి.బి చారి, శ్రీమన్నారాయణ, ప్రసాద్ బాబు, ఉన్నికృష్ణ, కోమటి రవి, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, సాయప్ప, శారద, వినోద, మంగ, గౌసియా, శోభ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గానికి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ ఆమోయ్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చెయ్యాలని కోరారు. డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయింపు, కాప్రా, చర్లపల్లి రామంతపూర్, చెరువుల వద్ద చత్ పూజ, సూర్య భగవాన్ పూజకు ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేయాలని కోరారు. జీవో నెంబర్ 58 ,59 దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు త్వరగా పట్టాల పంపిణీ చేయాలని విన్నవించారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, కాటేపల్లి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయానందారెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు, శ్రీరంగవరం గ్రామ సర్పంచ్ విజయానందారెడ్డి పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర మంత్రులు చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులను శనివారం వేర్వేరుగా వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు విజయానందారెడ్డికి శాలువ కప్పి,కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ వెంకటేశ్, జెడ్పీటీసీలు శైలజ విజయానందారెడ్డి, అనితలాలయ్య, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు నవీన్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.





మణిపూర్ ఘటన దోషులను శిక్షించాలి



నవతెలంగాణ-కాప్రా

మణిపూర్ ఘటన దోషులను శిక్షించాలని ఉప్పల్ నియోజకవర్గం మానవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు తాడూరి గగన్ కుమార్, సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో జమ్మిగడ్డ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యం యావత్ దేశం తలదించుకునేలా ఉందన్నారు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని చెప్పుకునే ప్రభుత్వాలు మహిళలపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నా వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతన్నాయని తెలిపారు. మహిళను దేవతగా భావించే భారతదేశంలో ఈ విధంగా నగ్నంగా ఊరేగిస్తూ హత్యాచారానికి పాల్గొనడం సిగ్గుచేటన్నారు. బీఎస్పీ జిల్లా నాయకులు ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు రక్షణ లేదన్నారు. మణిపూర్ మహిళలకు రక్షణగా ఉంటూ దోషులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రపంచ శాంతి సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాధ్యులు శ్రీమన్నారాయణ, జమ్మిగడ్డ వివిధ కాలనీలో సభ్యులు రామలింగం నాగేష్, నరసింహ చారి, కనకయ్య వెంకట్, రాజు, యాదగిరి పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరవు'

నవతెలంగాణ -జవహర్‌నగర్

బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మణిపూర్ ఘటనకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కార్పొరేషన్‌లోని దళితభవన్‌లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో మణిపూర్ ఘటనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మణిపూర్ మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మండిపడ్డారు. దేశంలో మహిళల్ని గౌరవించేది పోయి వారిపై ఈ లాంటి ఘటనలు చోటుచేసుకోవడం బీజేపీ దుర్మార్గపు పాలనకు నిదర్శనమని విమర్శించారు. మణిపూర్ ఘటన వెనుక కాషాయ, కార్పొరేట్ శక్తులు దాగి ఉన్నాయని దుయ్యబట్టారు. అత్యాచారాలు, దాడులను అడ్డుకోవాలని, లేనియెడల ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ అధ్యక్షుడు పాషామీయా, కార్యదర్శి కాలేషా, సీపీఐ(ఎం) జవహర్ నగర్ శాఖ కార్యదర్శి శివనారాయణ, సీపీఐ దర్శనం యాదగిరి, రాజేశ్వరి, నాగమణి, నాగేష్, నర్సింహులు, మట్టయ్య, వెంకటేశ్వర్లు. ఆంజనేయులు, మస్తానీ, షేక్మీరా, సావిత్రి, పుణ్యవతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
కూకట్‌పల్లి-మల్కాజిగిరి
ఆదివారం ,23 జులై ,2023 8

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో వర్షానికి జలమయమైన సత్య రాఘవేంద్ర కాలనిలో కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. కాలని వాసులు వర్షానికి డ్రయినేజీ ఓవర్ ఫ్లో అవుతుందని సమస్య పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు సహకారంతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ. శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, నవీన్ యాదవ్, సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆమోయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఉప్పల్ నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయాలనీ, డిగ్రీ కాలేజీకి స్థలం కేటాయించాలనీ, కాప్రా, చర్లపల్లి, రామాంతపూర్ చెరువుల వద్ద, చత్ పూజ, సూర్య భగవాన్ పూజ కోసం ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేయాలనీ, జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు త్వరగా పట్టాల పంపిణీ చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, కాటెపల్లి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండను ఖండిస్తున్నాం

- సీపీఐ(ఎం), మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ అసమర్థత పాలన వల్లే మణిపూర్ రాష్ట్రంలో మహిళపై అత్యాచారాలు జరిగాయని కుత్బుల్లాపూర్ మండల సీపీఐ(ఎం) కార్యదర్శి ఈ. ఉమా మహేష్ విమర్శించారు. ఈ మేరకు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ నగర్ సీపీఐ(ఎం) కార్యాలయ ప్రాంగణంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై, గిరిజనులపై, మహిళల పై దాడులు పెరిగాయని వాటిని అరికట్టకుండా నేరస్తులకు సన్మానం చెయ్యడం, నేరస్తులకు శిక్షలు పడవు అనే అభిప్రాయం ఏర్పడటం వల్లే హత్యలు, అత్యాచారాలు పెరిగాయని మహిళలు బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ముక్త కంఠంలో పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర నాయకులు కె .ఏసురత్నం, మహిళ సమాఖ్య కార్యదర్శి హైమావతి మాట్లాడుతూ మహిళల పై జరిగిన దష్టికాన్ని ఖండించకుండా ఇతర వర్గాల పై దాడి చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. మహిళల పై జరిగిన దాష్టికాలను సమర్ధించుకోవడం వారి మూర్ఖత్వానికి నిదర్శనమని ఒక మనిషిగా కాకుండా కనీసం మహిళగా కూడా చూడకపోవడం దారుణమని అన్నారు. బీజేపీకి మద్దతు ఇచ్చే మహిళలు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, సీపీఐ కార్యవర్గ సభ్యులు, వి.హరినాథ్, సహదేవ్ రెడ్డి, సదానంద్, కృష్ణ, రాములు, శ్రీనివాస్ మహిళ సమైక్య నాయకురాలు మహేశ్వరి,లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ: మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలకు హింసకాండకు హత్యలకు అత్యాచారాలకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం బీ రన్ సింగ్ వెంటనే రాజీనామా చేయాలని ప్రజాసంఘాల జిల్లా నాయకులు బి.ఎన్. సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం కేపీహెచ్‌బీ రోడ్ నెంబర్ 2 ధనలక్ష్మి సెంటర్ నుండి గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఎం. శంకర్ సీఐటీయు కూకట్‌పల్లి మండల కార్యదర్శి



కే. కృష్ణ నాయక్‌లు పాల్గొని నిరసన తెలుపుతూ మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయన్నారు. దీని వెంటనే ఆపి అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడి హత్య చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని పేర్కొన్నారు. మణిపూర్ జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న మైతి కులస్తులకు కుకి నాగ గిరిజన తెగల మధ్య బీజేపీ తన రాజకీయ లబ్ది కోసం చిచ్చు పెడుతుందని విమర్శించారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలు బాధ్యత వహించి రాజీనామా చేయాలని దోషులను వెంటనే శిక్షించాలని బాధితులకు న్యాయం చేయాలని అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి జే శివకుమార్, మండల అధ్యక్షులు బి. గోపాల్, మహిళా సంఘం నాయకురాలు అనురాధ, సీఐటీయు జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్ , బి శ్రీను , గిరిజన సంఘం నాయకులు, మంగయ్య ,హనుమంతు రాజులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మణిపూర్‌లో మహిళలపై దాడులు, నగ్నంగ చేసీ ఊరేగించడం దేశం మొత్తం తలదించుకునే విషయ మని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో గత 80 రోజులుగా అల్లర్లు జరు గుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ నోరు విప్పకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనలపై తక్షణమే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నా రు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో సమాజంపై అట్టడుగు వర్గాలపై అగ్రవర్గాల దాడులు తీవ్రంగా ఖండించారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘోరం చూస్తుంటే ప్రతి ఒక్క భారతీయుడి గుండె రగులుతుందన్నారు. కేవలం



ఆర్థిక లాభం కోసం కా ర్పొరేట్ సంస్థలతో చేయి కలిపిన ప్రధాని మోడీ మణిపూర్‌లో మైనిం గ్‌కు అనుకూలంగా ఉన్న గిరిజన ప్రాంతాలను అదానీకి కట్టబెట్టే కుట్రలో భాగంగా రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. జరుగుతున్న విధ్వంసాన్ని వెంటనే ఆపి ,శాంతిని నెలకొల్పాలని సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమతంగా ఉండాలి



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్..

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శనివారం 130 సుభాష్ నగర్ డివిజన్ పైపులైను రోడ్డులోని మిత్ర హెూమ్స్ గల ముంపు ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత కొద్దీ సంవత్సరాల నుండి చేపడుతున్న అభివృద్ధి పనుల వల్ల దాదాపు నియోజకవర్గంలో వరద నీటి తాకిడి తట్టుకోగలిగామని అలాగే నిర్మాణ దశలో వున్న పనులను కూడా పూర్తిచేసేలా చర్యలు చేపడుతామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో వరదనీటి కాలువలు, మురుగునీటి కాలువలు, అలాగే కల్వర్టులు, బాక్స్ డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, కస్తూరి బాల రాజు, గౌసుద్దీన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న అశోక్ చక్రవర్తి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



సీఎంపి స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో వరల్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, న్యూఢిల్లీలో త్యాగరాయ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీలో, తెలంగాణ రాష్ట్రం నుండి నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఎక్సలెన్స్ 2023 అవార్డ్స్‌లో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన గ్రాండ్ మాస్టర్ అశోక్ చక్రవర్తి సత్తా చాటారు. న్యూఢిల్లీలో 21వ తేదీన నిర్వహించిన ఈ పోటీల్లో, తైక మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు అశోక్ చక్రవర్తికి నిర్వాహకులు ఈ అవార్డును ప్రధానం చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మార్షల్ ఆర్ట్స్ కోసం విశేష కృషి చేస్తున్న కొద్ది మందిని ఎంపిక చేసి, ప్రతి సంవత్సరం పురస్కారాలను అందజేస్తుంటామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ, తనకు నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును అందజేసిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి తాను ఈ అవార్డుకు సెలెక్ట్ కావడం ఎంతో ఆనందంగా ఉందన్నాడు. ఈ అవార్డు రాడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యాస్ ఓవర్సీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సూచిత్ర రోడ్డు జీడిమెట్లలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యాస్ ఓవర్సీస్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ కన్సల్టెన్సీని శనివారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్వహకులు శుభాకాంక్షలు తెలియచేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ వారి మన్ననాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు యాదగిరి, మాధవి, భాను, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, సంపత్ మాధవ్ రెడ్డి, సమ్మయ్య నేత, కాలే గణేష్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హాష్ (గంజాయి) విక్రయిస్తున్న ముగ్గురు నిందితులు రిమాండ్

- 300 5.యమ్ఎల్ బాటిళ్లు, నాలుగు సెల్ ఫోన్లు, కారు, నగదు నాలుగు వేలు స్వాధీనం
- డీసీపీ శ్రీనివాసరావు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట /బాలానగర్

గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత(గంజాయి) హష్ ఆయిల్ 5 ఎం.ఎల్. బాటిళ్లలో నింపి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం షాపూర్ నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో టీ. శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూరారం ప్రాంతంలో నివసించే జితేష్ శర్మ వెంకట హరికృష్ణ, సయ్యద్ ఇమ్రాన్‌లు ముగ్గురు యువకులు గ్రూప్‌గా ఏర్పడి బాలనగర్, బాచుపల్లి, మాదాపూర్, సనత్ నగర్, తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న ప్లాస్టిక్ బాటిళ్లలో హష్ ఆయిల్ నింపి యువతీ, యువకులే టార్గెట్‌గా విక్రయిస్తూ గత కొంతకాలంగా అక్రమంగా సరఫరా చేస్తున్నారని పోలీసులు తెలిపారు. పక్క సమాచారం తెలుసుకున్న ఎస్ఓటి పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి వద్దనుండి 300 బాటిళ్లు, ఒక కారు, నాలుగు సెల్ ఫోన్లు, 4 వేల నగదును స్వాధీనపరుచుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పక్క సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసు బృందాలను డీసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా స్థలాలను కాపాడాలి



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడే స్మశాన వాటిక, డంపింగ్ యార్డ్ పరిసర ప్రభుత్వ స్థలాలను ఆక్రమనలకు గురికాకుండా కాపాడాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శనివారం ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమీషనర్ రామకృష్ణ రావు, సీనియర్ నాయకులు, కోలన్ గోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతో కలిసి ప్రగతి నగర్ స్మశాన వాటిక, డంప్ యార్డ్‌ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అట్టి ప్రదేశాలు ఎలాంటి ఆక్రమణకు గురి కాకుండా సంరక్షించగలరని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు విన్నావించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ స్థలాలను నిరీక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, స్వతంత్ర కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు శనివారం మేయర్ నీలా గోపాల్ రెడ్డిని కలిసి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సం దర్భంగా వారి ప్రాంతంలో గగన్ సాయి ఎంక్లేవ్ నుండి హ రితవనం అపార్ట్మెంట్స్ వరకు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ లైన్ పనులు పూర్తి అయిన సందర్భంగా గౌరవ మేయర్‌ని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎల్లపుడూ కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికి వారధులు

- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



సంక్షేమ సంఘాలు తమ కాలనీల అభివృద్ధికి వారధులని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్ ఏ' బ్లాక్ నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రుద్ర అశోక్ ఆధ్వర్యంలో కలిశారు. ముందుగా నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. పార్టీల కతీతంగా అందరికీ కలుపుకుపోతూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, భూదేవి హిల్స్ నూతన అధ్యక్షుడు సోమయ్య, త్రివేణి, నరేష్, కృష్ణ, గుంటూరు శ్రీను, రామ్ మోహన్,లక్ష్మి లలిత, గండయ్య, నాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి...

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి లోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ని తన నివాస కార్యాల యంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్యాలయంను పరిశీలిస్తున్నా ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి మెట్రో పార్క్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న, ఎ మ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం పరిశీలించారు. అలాగే బిల్డింగ్‌లో చేపట్టాల్సిన కొన్ని మార్పులు చేర్పులను నిర్మాణ దారులకు సూచించారు. చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా మొక్కలు పెంచాలని తెలిపారు. ఈ సందర్భంగా అతి త్వరలోనే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ంను ప్రారంభిస్తామని అన్నారు.

డ్రయినేజీ సమస్య తలెత్తకుండా చర్యలు

- కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో బాలానగర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహం కారణంగా డ్రయినేజీ సమస్య ఏర్పడిందని స్థానికుల ఫిర్యాదు మేరకు శనివారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సంబంధిత అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి స్వయంగా పలు కాలనీల్లో పర్యటించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొంగుతున్న డ్రయినేజీ సమస్యను పరిష్కారమయ్యేలా సిబ్బందితో పనులను చేయించారు. ప్రధానంగా రోడ్డు వెంట నడిచే బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిలిచి ఉన్న వరద నీటితో దోమలు, ఈగల వ్యాప్తి ఎక్కువగా ఉంటోందని, రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే మురుగునీటి ప్రవాహం సాఫీగా వెళ్ళేలా డ్రయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుద్దాల హనుమంతు భావాలను అందిపుచ్చుకొన్న అశోక్ తేజ



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ సాయుధ పోరాట కవి యోధుడు సుద్దాల హనుమంతు వారసునిగా ఆయన భావాలను అశోక్ తేజ అందిపుచ్చుకున్నారని సి.బి.ఐ విశ్రాంత, ఉన్నతాధికారి వీ. వీ.లక్ష్మీ నారాయణ అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నెషనల్ సౌజన్యంతో శారద మ్యూజిక్ అకాడెమీ నిర్వహణలో విఖ్యాత గాయకుడు ఎస్.పీ. బాల సుబ్రహ్మణ్యం జీవిత సాఫల్య పురస్కారం ప్రముఖ కవి సుద్దాల అశోక్ తేజకు బహుకరణ ఉ త్సవం జరిగింది. ముఖ్య అతిథిగా లక్ష్మీనా రాయణ పాల్గొని పురస్కరం అందించి మాట్లాడారు. తాను పోటీ పరీక్షలకు హాజరు అయ్యే వారికి అశోక్ తేజ రాసిన ఒకటే జననం ఒకటే మరణం పాట సిరివెన్నెల రాసిన ఎప్పుడూ ఒప్పుకోవద్దు రా ఓటమి పాట వింటే ఆత్మ స్థైర్యం ఆత్మ విశ్వాసం కలుగుతాయ న్నారు. అశోక్ తేజకు జ్ఞానపీఠ్ అవార్డ్ రావాలని ఆకాంక్షించారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జాతీయ అవార్డ్ తెలుగు పాటకు శ్రీ శ్రీ,వేటూరి, తరువాత చిన్న వయస్సులోనే అశోక్ తేజకు వచిందని గు ర్తు చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వంశీ రామ రాజు మాట్లాడుతూ బాల సుబ్రమణ్యం అశోక్ తేజ తొలి రోజుల్లో వంశీ పురస్కా రాలు అందుకున్నారని తెలిపారు. నిర్మాత రామసత్యన్నారా యణ, రాజు, దైవజ్ఞ శర్మ, తనికెళ్ళ రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు. శారద నిర్వహణలో పలువురు గాయనీగాయకులు సినీ గీతలు మధురంగా గానం చేశారు.

అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇండ్లు కేటాయించాలి



- పన్నాల హరీష్ రెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి 9 సం॥ అవుతున్నా అర్హులైన పేదలకు ఇంకా డబుల్ బెడ్ రూములు కేటాయించకపోవడం దురదృష్టకరం అని బీజేపీ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి అన్నారు. శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గతంలో ధరఖాస్తు చేసుకున్న పేదల దగ్గర నుండి అప్లికేషన్‌లను తీసుకోవడం జరిగిందన్నారు. వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అల్లూరి రామరాజు, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్ రెడీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కో ఆర్డినేటర్స్ నియామకం



నవతెలంగాణ- కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కోఆర్డినేటర్స్, ఎగ్జిక్యూటివ్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, విలువలను, పార్టీ సిద్ధాంతాలను నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తీసుకువెళ్లి పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా అతి త్వరలో డివిజన్ , బూత్ స్థాయి నూతన కమిటీలను కూడా నియమించడం జరుగుతుందని అన్నారు.

భూదానం స్కిమ్ క్రింద గజంకి ఒక లక్ష రూపాయలు విరాళం

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



స్వామి కార్యంలో భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని సెవెన్ హిల్స్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భూదానం స్కిమ్ యొక్క కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం కోసం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రక్కన గల 227 గజాల స్థలంను భూదానం స్కిమ్ క్రింద కొనుగోలు చేయుటకు గాను కరపత్రంను ఆవిష్కరించడం జరిగిందన్నారు. భూదానం స్కిమ్ క్రింద గజంకి ఒక లక్ష రూపాయలు చొప్పున చెల్లించవల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే గాంధీ ఒక లక్ష రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ దేవాదాయశాఖ రామకృష, ఈఓ సత్య చంద్రారెడ్డి, ఆలయ చైర్మెన్ కెఆర్కె రాజు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, శ్రీహరి, కిరణ్ ,అప్పిరెడ్డి, కుమార్ స్వామి, లక్ష్మి, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, పోతుల రాజేందర్, పద్మ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షాలకు, మూసా పేట్ డివిజన్, బబ్బుగూడలో రెండు రోజుల క్రితం బొల్లం లక్ష్మి, రాములు ల ఇండ్లు కూలిపోవడం జరిగింది. విషయం తెలుకున్నా కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ శనివారం రోజున ఆ కుటు ంబాన్ని పరామర్శించి వారికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, పేదలకు అందిస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం, క్రింద లబ్ది చేకూరేలా చూస్తా నని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్తీ వాసులు, కాల నీ వాసులు, అప్రమత్తంగా ఉండాలనీ, కబీర్ నగర్ నాలా పక్కన ఉండే కాలనీ వాసులు ఏదైనా సమస్య ఉంటే వెంటనే తెలియజేయాలని ప్రజలకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్ర స్వామి, నాగరాజు, శ్రీధర్, సతీష్ చారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అల్వాల్ సర్కిల్ పరిధిలోని కనాజిగూడలో ప్రసిద్ధి చెందిన మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కార్య నిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రీ ఆధ్వర్యంలో మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామికి ఉదయము నవగ్రహ అభిషేకములు, పంచామృత అభిషేకం, శనికి తైలాభిషేకం, తిల దానం, నవగ్రహ హెూమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి మాట్లాడుతూ... ఈ పూజలో పాల్గొన్న భక్తులకు కాలసర్ప పూజ నవగ్రహ దోషాలు తొలగిపోతాయన్నారు. అన్న ప్రసాద విరాళాలు అందచేసే భక్తులు ఆలయ కార్యాలయంలో తనను సంప్రదించాలని సూచించారు. అన్నం పరబ్రహ్మం స్వరూపమని ఆలయ ట్రస్ట్ ద్వారా ప్రతి రోజు దేవాలయంలో సుమారు 500 మందికి, అదే విధంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చిలకలగూడ చౌరస్తాలో, బంజారాహిల్స్ బసవ తారకరామ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆయన తెలిపారు.



మలేషియా కబడ్డీ టీం శనివారం హైదరాబాదులో టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ బాబును కలిశారు. ఈ సందర్భంగా కాసాని వీరేష్ బాబు కబడ్డీ టీం సభ్యులకు టీ షర్ట్‌లను ఆవిష్కరించారు.

నవతెలంగాణ-దుండిగల్

నవభారత లయన్స్ క్లబ్ నూతన కమిటీకి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నవభారత లయన్స్ క్లబ్ 2023-24కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బెల్లం కొండ విన య్, ప్రధాన కార్యదర్శి డా.పి.స్వ రూపా రాణి, కోశాధికారి ఎ.టి.హర్ష ఆర్య జోనల్ చైర్మెన్ సీహెచ్ గోపా లకష్ణకు లయన్ డా.హిప్నో పద్మా కమలాకర్, లయన్ జీ.కష్ణ వేణి, లయన్ వి.జే.క్యార్లిన్ శుభాకా ంక్ష లు తెలిపారు. డా.హిప్నో కమ లాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో వారు మీడి యాతో మాట్లాడారు. నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపులు, వ్యక్తి త్వ వికాస శిక్షణా కార్యక్రమాలు, స్కూల్స్, అనాథ విద్యార్థి గహంలో, స్లం ఏరియాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిం చామనీ, నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు కూడా మరిన్ని కార్యక్రమాలు చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. తనను క్లబ్ పాధ్యక్షురాలిగానియమించినందుకుమొదటి,రెండోవైస్‌జిల్లా గవర్నర్ డా.డి. కోటేశ్వర రావు, డా.మహేందర్‌కుమార్ రెడ్డి, యాదయ్యగౌడకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏసీపీ

నవతెలంగాణ-బేగంపేట్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు ఏసీపీలు శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బేగం పేట ఏసీపీ రామలింగరాజు, గాంధీనగర్ ఏసీపీ రవి కుమా ర్, మహంకాళి ఏసీపీ రవీం దర్ యాదవ్, ఎస్ఆర్.నగర్ ఏసీపీ వెంకటేశ్వరరా వులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు.



జలాశయాలకు జలకళ



- **హిమాయత్ సాగర్ మరో 4గేట్ల ఎత్తివేత**

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎగువలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జంట జలాశయాల్లో హిమాయత్ సాగర్ రిజర్వాయర్ వరద నీరు కొనసాగుతోంది. ఇప్పటికే జలాశయం నిండు కుండలా మారిన నేపథ్యంలో ఈ రోజు మరో నాలుగు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నిన్న (శుక్రవారం) రెండు గేట్లు ఎత్తగా జలమండలి అధికారులు ఈ ఉదయం 10 గంటలకు రెండు గేట్లు, మధ్యాహ్నం 1 గంటలకు మరో రెండు గేట్లు రెండు ఫీట్ల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మొత్తం రిజర్వాయర్ 6 గేట్ల ద్వారా మొత్తం 4120 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీలోనికి విడుదల చేస్తున్నారు. మరోవైపు ఉస్మాన్ సాగర్ (గండిపేట్) రిజర్వాయర్ కు 300 క్యూసెక్కుల వదర నీరు వస్తోంది. రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 3.9 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.980 టీఎంసీలు. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుతం 1785.85 అడుగులు ఉంది.

హిమాయత్ సాగర్ రిజర్వాయర్ వివరాలు:
- పూర్తి స్థాయి నీటి మట్టం : 1763.50 అడుగులు
- ప్రస్తుత నీటి మట్టం : 1763.25 అడుగులు
- రిజర్వాయర్‌పూర్తి సామర్థ్యం : 2.970 టీఎంసీలు
- ప్రస్తుత సామర్థ్యం : 2.875 టీఎంసీలు
- ఇన్ ఫ్లో : 3500 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో : 4120 క్యూసెక్కులు
- మొత్తం గేట్ల సంఖ్య : 17
- ఎత్తిన గేట్ల సంఖ్య : 06

ఉస్మాన్ సాగర్ (గండిపేట్) రిజర్వాయర్ వివరాలు:
- పూర్తి స్థాయి నీటి మట్టం : 1790.00 అడుగులు
- ప్రస్తుత నీటి మట్టం : 1785.85 అడుగులు
- రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం : 3.900 టీఎంసీలు
- ప్రస్తుత సామర్థ్యం : 2.980 టీఎంసీలు
- ఇన్ ఫ్లో : 300 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో : 0 క్యూసెక్కులు
- మొత్తం గేట్ల సంఖ్య : 13
- ఎత్తిన గేట్ల సంఖ్య : 0

సులభతరంగా సంతాన సాఫల్యం

- ఫర్టిలిటీ సెంటర్‌లో తొలిసారిగా ఏ.ఐ ఆధారిత ఆర్.ఐ.విట్ నెస్ సిస్టం
- 25న సికింద్రాబాద్‌లో ప్రారంభించనున్న సినీ నటి ప్రణీత
- "లోగో విడుదల చేసిన ఫర్టీ ఫర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీ. జ్యోతి'



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆధునిక పద్ధతుల ద్వారా సులభతరంగా సంతాన సాఫల్యం పొందవచ్చని ఫర్టీ 9 ఫర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీ.జ్యోతి అన్నారు. ఎన్నో ఏళ్లుగా సంతానం కోసం నిరీక్షిస్తున్న మహిళలను కత్రిమ గర్భధారణ పద్ధతులు ఎంతో ఆదుకుంటున్నాయని చెప్పారు. సంతాన లేమి సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రస్తుతం సరికొత్త పరిజ్ఞానంతో వైద్య సేవలు అందిస్తున్నామని, మాతత్వం మహిళలకు దేవుడు ఇచ్చిన వరమని అన్నారు. ఈనెల 25వ తేదీన వరల్డ్ ఐ.ఏ.ఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో తొలిసారిగా ఏ.ఐ. ఆధారిత ఆర్.ఐ.విట్ నెస్ సిస్టంను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సికింద్రాబాద్‌లోని ఎన్‌సీఎల్ బిల్డింగ్‌లో ఉన్న ఫర్టీ ఫర్టిలిటీ సెంటర్‌లో ప్రముఖ సినీ నటి ప్రణీత ఈ.ఏ.ఐ ఆధారిత ఆర్.విట్ నెస్ సిస్టంను లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించిన లోగోను శనివారం హైదరాబాద్ సోమాజిగూడలో ఫర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి. జ్యోతి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతత్వం ఒక వరం, ఏ స్త్రీకైనా గొప్ప ఆనందం మారుతున్న జీవన విధానం, వాతావరణంలో మార్పులు, వత్తిపరమైన జీవితమని, పెరిగిన ఒత్తిడి, పిల్లలు లేని సమస్య ప్రబలంగా ఉన్నాయన్నారు. ఫర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్ పిల్లలు లేని కారణాలను సరైన రోగ నిర్ధారణ ద్వారా ఆధునిక వైద్య విధానాల సహాయంతో వైద్య శాస్త్రంలో తాజా సాంకేతిక ఆవి ష్కరణల ద్వారా తగిన చికిత్సను అందించడం ద్వారా ఈ కీలక మైన సమస్యను వేగంగా పరిష్కరించడానికి ప్రయత్ని స్తోందని అన్నారు. 25వ తేదీన వరల్డ్ ఐ.ఏ.ఎస్. దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫరీ సంతాన సాఫల్యత పరిశోధనా కేంద్రం అత్యాధునిక అడ్వాన్స్డ్ ఐ.వీ.ఎఫ్ పద్ధతులపై మహిళలకు 50 శాతం రాయితీని కల్పి స్తు న్నట్లు డాక్టర్ సి. జ్యోతి వెల్ల డించారు. ఈ అవకా శాన్ని ఫర్టీ 9 బ్రాంచ్ లలో మహిళలు విని యోగిం చుకోవ చ్చని తెలిపారు. కొన్ని వేల మందికి ఐ.వి. ఎఫ్.ఐ.సి. ఎస్ ఐ,ఐ. ఎం.ఎస్ఐ, ఉచి త వైద్య శిబిరాల ను పలు ప్రాంతాల్లో నిర్వ హించినట్లు వివరించారు. వివరాల కో సం 9550 4004 45 ఫోన్ నెం బర్లో సం ప్రదిం చవ చ్చని తెలిపారు.

తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకన్న ఆధ్వర్యంలో శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మబ్బు పరశురాం (రసాయన శాస్త్రం), ప్రభుత్వ జూనియర్ కళాశాల కుత్బుల్లాపూర్. ప్రధాన కార్యదర్శిగా మగవత్ జగన్ (వాణిజ్యశాస్త్రం), ప్రభుత్వ జూనియర్ కళాశాల కూకట్‌పల్లి, ఇతర కార్యవర్గాన్ని ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్స్‌గా నాగేశ్వరరావు (భౌతిక శాస్త్రం), కూకట్‌పల్లి. వాసంతి స్వామి (గణితశాస్త్రం) మల్కాజిగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్ కుమార్ (భౌతిక శాస్త్రం, మల్కాజిగిరి, కోశాధికారిగా బానోతు రవి (వక్షశాస్త్రం), కూకట్‌పల్లి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్యాంకుమార్ (రసాయనశాస్త్రం) బొల్లారం, జాయింట్ సెక్రెటరీస్‌గా గౌరీ శంకర్ (గణితశాస్త్రం) కూకట్‌పల్లి, శారద (జంతుశాస్త్రం, మల్కాజిగిరి, లేడీస్ సెక్రెటరీస్‌గా అనంతలక్ష్మి (భౌతికశాస్త్రం) కూకట్‌పల్లి, దీపిక (గణితశాస్త్రం) బొల్లారం, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా విజయ్ (అర్థికశాస్త్రం) మల్కాజిగిరి, మమత (వాణిజ్యశాస్త్రం) మేడ్చల్, రామిరెడ్డి (తెలుగు) కూకట్‌పల్లి, పద్మజ (ఒకేషనల్) మల్కాజిగిరి, మల్లీశ్వరరావు (ఒకేషనల్) కూకట్‌పల్లి, స్వర్ణ (పౌరశాస్త్రం) కూకట్ పల్లి లను ఎన్నుకున్నారు.

భారీ వర్షాల దష్ట్యా శానిటేషన్‌పై ప్రత్యేక చర్యలు



- **మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల దష్ట్యా శానిటేష న్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు సూచించారు. శనివారం మేయర్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం తన ఛాంబర్‌లో పలు అంశాల పై కమిషనర్‌తో చర్చించారు. వర్షాకాలంలో డెంగ్యూ కేసు లు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నివారణకు ముందు జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పించే ఐఈసి కార్యక్రమాలు చేపట్టాలని మేయర్ కోరారు. స్లమ్ ఏరియాలో ఎక్కువ దష్టిసారించాలి అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... ప్రతి రోజు శానిటేషన్ మెరుగు పరిచేందుకు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయడం శానిటేషన్ పై అధికారులకు, సిబ్బంది ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. జీ.వీ.పీ పాయింట్స్ పై స్పెషల్ ఫోకస్ చేస్తున్నామన్నారు. వార్డు కార్యాలయాలను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ వివరించారు.

జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన మేయర్

గత ఐదు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల నేపథ్యంలో నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉన్నామని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ నగరవాసుల నుండి అందిన ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా తీశారు. నగరంలో మొత్తం 946 నీటి నిల్వలపై వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం అయినట్లు తెలిపారు.

బస్తీలలో కార్పొరేటర్ దీపిక పర్యటన

నవతెలంగాణ-కంటోన్మెంట్



గత మూడు రోజులగా కురిసిన వర్షాలకు మోండా డివిజన్‌లో పలు బస్తీలు, కాల నీలో మురుగు కాలువలు నిండి ఏర్పడిన సమ స్యల ను పరిష్కరించేందుకు శనివారం ఉదయం కార్పొరేటర్ దీపిక అధికారులతో కలిసి డివి జన్‌లో పర్యటించి పలు సమస్యలను పరిశీలిం చారు. రోడ్లపై పడిన గండీలకు మరమ్మతులు చేయించారు. జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ టీంతో కొన్ని సమస్యలను తాత్కాలికంగా మర మ్మతులు చేయించి ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పసిపాప

నవతెలంగాణ-ఓయూ



హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. జామై ఉస్మానియా రైల్వే స్టేషన్‌వద్ద అడిక్‌మెట్‌కు వెళ్లే రోడ్డు పక్కన చెట్ల పొదల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ పసి పాపని పడేసి వెళ్లిపోయారు. స్థానికుల సమాచారం మేరకు ఓయూ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శిశువును యూసుఫ్‌గూడ శిశువిహార్‌కి తరలించారు. పాప వయసు సుమారుగా 20 రోజులు ఉంటుందని పోలీసుల, శిశు విహార్ వైద్యులు అంచనావేస్తున్నారు. పాపను ఎవరు వదిలి వెళ్లారనే విషయమై సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. యూసఫ్‌గూడ స్టేట్ హెూంలో శిశువిహార్‌లో పాపను శనివారం అప్పగించారు. వారు పాపకు రాఘవి అని పేరు పెట్టారు. పాప ఆరోగ్యంగానే ఉందని సీడబ్ల్యుసి చైర్ పర్సన్ శైలజ ఆదేశాల మేరకు వైద్య పరీక్షల నిమిత్తం పాపని నీలోఫర్ ఆస్పత్రికి సిఫార్సు చేశారని తెలిపారు.

మణిపూర్‌లో లైంగికదాడికి పాల్పడిన

నిందితులను కఠినంగా శిక్షించాలి



- తక్షణమే మణిపూర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలి
- సీపీఐ(ఎం) నగర నాయకులు ఎం.మహేందర్

నవతెలంగాణ-అంబర్‌పేట

మణిపూర్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండు జాతుల మధ్య తగాదాలు సృష్టించి కుకీ ఆదివాసీ తెగ చెందిన మైనారిటీ వర్గంపై హింసలు, లైంగికదాడులు చేస్తున్నారని, ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అంబర్‌పేట నియోజకవర్గం కోరంటి చౌరస్తాలో సీపీఐ(ఎం) నగర నాయకులు ఎం.మహేందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో మహిళలపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారని, ఆ మహిళలను నగ్నంగా ఊరేగింపు చేశారన్నారు.ఈ దుర్మార్గమైన ఘటన చూస్తే దేశంలో పరిస్థితి ఎంత దిగజారిందో ప్రజలకు అర్థమవుతుంద న్నారు.మణిపూర్‌లో ఎంతోమంది మహిళలు లైంగికదాడులకు, వేధింపులకు గురవుతూనే వున్నారని ఇండ్లు, ఆస్తుల్ని కోల్పోయారని దారుణమైన హింసను అనుభవిస్తున్నారన్నారు. కాంగ్‌పోక్పీలో మహిళలపై అమానుష కాండకు కారకు లైన నేరస్తులందరినీ తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఈ సంఘటనపైన ఎందుకు మాట్లాడట్లేదని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ రాములు ,మోహన్, షబానా, వరలక్ష్మీ సోమయ్య, నాగేందర్ ,జనార్ధన్, సాంబ, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మంటల వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర

- దక్షిణభారత సమితి కన్వీనర్ ప్రొ.గాలివినోద్‌కుమార్ ఆరోపణ

నవతెలంగాణ-ఓయూ

ఆది హిందువులైన శైవసాంప్రదాయానికి చెందిన నాగకుకి ఆదివాసి తెగల మరణ హెూమానికి ఆర్య హిందుత్వ శ్రీవైష్ణవులైన మీటీలు మాత్రమే కారణం కాదని దాని వెనకాల ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉన్నదని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ.గాలివినోద్ కుమార్ ఆరోపించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పటి ఆది హిందువులైన ముఖ్యంగా శైవ సాంప్రదాయానికి చెందిన నాగాకుకి జాతులు క్రైస్తవ మతంలో మారడానికి ఆర్య హిందుత్వ మీటీలు కారణమని వారి వెనుక ఆర్ఎస్ఎస్ ఉందని ప్రపంచ మంతా ఈ మరణ హెూమాన్ని ఖండించాలని ప్రొ. గాలి వినోద్ కుమార్ మానవతా వాదులందరికీ పిలుపు ఇచ్చారు.

మహిళలుపైన జరిగిన దాడికి నిరసనగా ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ



మణిపూర్‌లో జరిగే హింసాకాండపై ఆదివాసీ స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రొఫెసర్ ఆదివాసీ మహిళలు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, సంయుక్త ఆధ్వర్యంలో ఓయూలో శాంతియుత రాలీ నిర్వహించారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలపడం వలన ప్రస్తుత మణిపూర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లలోదేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నిం జరుగుతుందని అని పేర్కొన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ స్త్రీలపై జరిగే అరాచకాలను వెంటనే అదుపు చేసి శాంతి భద్రతలను నెలకొల్పాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుకీ మహిళలు పైన దాడి చేసిన వారందరి పైన ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, కులాలను, తెగ లుగా గుర్తించే ఓటు బ్యాంకు రాజకీయాలు వెంటనే ఆపాలి (ప్రతి రాష్ట్రం) అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కిషోర్ కుమార్ ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బట్ట వెంకటేశ్వర్లు, ఆదివాసీ స్టూడెంట్స్ ఫోరం ఓయూ అధ్యక్షుడు మడవి అజయ్ కుమార్, సెక్రెటరీ పునెం వివేక్, గౌరివేని ప్రవీణ్, సువర్ణపక ఆంజనేయులు, నిరస కార్యక్రమంలో సంఘీభావం తెలిపారు.

మణిపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- తెలంగాణ డాడీ లంబాడి హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రూడావత్ రఘు నాయక్ డిమాండ్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గత కొన్ని నెలల నుండి మణిపూర్‌లో జరుగుతున్న గిరిజనులు గిరిజనేతరుల మధ్య దాడులు, లైంగికదాడులు జరుగుతున్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం వెంటనే నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని తెలంగాణ డాడీ లంబాడి హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రోడావత్ రఘు నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ..కొన్ని రోజులుగా మెజారిటీ గిరిజన వర్గం కూకిలకు మైనారిటీ గిరిజనేతులైన మైతాయులకు మధ్య ఎన్నికల్లో సాధ్య పడని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ వారి హామీలను నెరవేర్చలేని పరిస్థితుల్లో ఇరు వర్గాల మధ్య దాడులను, హింసలను ప్రోత్సహిస్తూ చోద్యం చూస్తుందన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మరణ హెూమాన్ని ఆపాలని, నాగ, కుకిజాతి తెగలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్ర ప్రభు త్వాన్ని రద్దు చేయాలన్నారు. మహిళల పై దాడులకు పాల్పడినవారిని దోషులకు కఠిన శిక్షలు వేయాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు.

నరేంద్రమోడీ వెంటనే రాజీనామా చేయాలి : బీఎస్ఎఫ్



మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించడానికి నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రధాని పదవికి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఓయూలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో బోరెల్లి సురేష్ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రమైన మణిపూర్‌లో ఆదివాసి బిడ్డ నగ్న ప్రదర్శన చేయడం దేశం మొత్తం తలదించుకోవాల్సిన పరిస్థితి అని "బేటి పడావో- బేటి బచావో" అనే నినాదం మాటలకే పరిమితం అయ్యిందని, ఆ నినాదం బీజేఊబీపీ పాలిత రాష్ట్రాలలో ఎందుకు అమలు కావడం లేదని నరేంద్ర మోడీని ప్రశ్నించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. బిఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్‌లో నగ్న ప్రదర్శన చేయించిన బాధ్యులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చెవుల కిషన్,ఆలేటి ఓయూ నాయకులు గోవిక్, రామకృష్ణ, మద్దిలేటి ,మహేష్, శివుడు ,రవి ,మోహన్, పాల్గొన్నారు.

మహిళలపై,లైంగికదాడి,హత్యలకు మోడీ ప్రభుత్వానిదే బాధ్యత

- ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరుశురాం

నవతెలంగాణ-అడిక్‌మెట్

మణిపూర్ లో ఆదివాసి మహిళలు మతోన్మాదులు నగ్నంగా ప్రదర్శన చేయటం,అత్యాచారం చేసి హత్యచేయటాన్ని ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరుశురాం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గత నాలుగు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో హిందుత్వ మతోన్మాదశక్తులు కుకీ-నాగాలకు చెందిన ఆదివాసి తెగలపై అనాగరిక దాడులు చేస్తున్నారని, 120మందిని ఇప్పటికే హత్య చేశారని వందలాది చర్చిలను తగులపెట్టారని లక్షకుపైగా ప్రజలు నిర్వాసితులయ్యారని అయినప్పటికీ డబుల్ ఇంజన్ ప్రభుత్వంగా చెప్పుకుంటున్న బీజేపీ ఆదివాసులకు రక్షణకల్పించ కపోగా మెయితి తెగలకు చెందినహిందుత్వ శక్తులకు అండగా నిలబడ్డారని ఆరోపించారు. మణిపూర్‌లో ఆదివాసి మహిళలపై లైంగికదాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలిపారు.

రెండవ విడత దళిత బంధుపై సమీక్ష

నవతెలంగాణ- జూబ్లీహిల్

రెండవ విడత దళిత బంధుపై జూబ్లీహిల్స్ ఎమ్మె ల్యే కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ పద్మా తో జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొ రేట ర్లు రాజకుమార్ పటేల్, దేదీ ప్య రావు, తది తరులు పాల్గొన్నారు. దళిత బంధు లబ్ధి దారుల ఎంపికలో ఎలాంటి పొర పాట్లు జరగకుండా నిజ మైన లబ్దిదా రులను గుర్తించి రెండవ విడత దళి త బంధు అందజేశాయని అధికారులను ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లను క్రమబద్ధీకరించాలి

- ప్రొఫెసర్ హరగోపాల్

నవ తెలంగాణ-ముషీరాబాద్



ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లందరిని క్రమబద్ధీకరించాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం , తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు స్వీ పర్ల కష్టాలు కన్నీళ్లు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, విమలక్క, మాజీ ఎంపీ మల్లు రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో రూ.1623 నుండి రూ. 4000 రూపాయల వరకు వేతనం పొందుతున్న స్వీపర్లకు నెలకు 27 వేల కనీస వేతనంగా చెల్లించి స్వీపర్లు అందరిని రెగ్యు లరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వీపర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూపాయలు రూ.15 లక్షలు పెన్షన్, 10,500 ఇవ్వాలన్నారు. చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పర్మనెంట్ స్వీపర్లను వాచ్‌మేన్‌లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ , తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి ఖలీల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, అధ్యక్షులు గట్టన్న ,ప్రధాన కార్యదర్శి బాలగౌడ్, ముఖ్య సలహాదారులు కొండపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్రం బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రెండు లక్షల కోట్లకు పెంచాలి



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ.ఆర్.కృష్ణయ్య
- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాంకు వినతి

నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ.రెండు లక్షల కోట్లుకు పెంచాలని బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంస రాజ్ గంగారాంను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మాదిరిగా హాస్టల్ గురుకుల పాఠశాలలకు ఫీజు నెంబర్స్ స్కాలర్షి పథకం దేశమంతటా అమలు చేయాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి బీసీ సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవా లని రాజ్యాంగ బద్దమైన సంస్థగా జాతీయ బీసీ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవని వీటిని పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మన్ హంసరాజ్ గంగారాం హామీ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలు అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు దేశమంతా అమలు చేయడానికి చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ,నందగోపాల్,కర్రీ వేణుమాధవ్, రాజ్ కుమార్, జోషి రాఘవ, భాషయ్య పాల్గొన్నారు.

'దేశ ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగిస్తున్న బీజేపీ పాలనా'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ

నవతెలంగాణ-హిమాయత్ నగర్



భారతదేశ బహుళ సాంస్కృతిక, సహనశీల సమాజాన్ని విషపూరితం చేస్తూ పాలనా కొనసా గిస్తున్న బీజేపీ దేశ ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగిస్తుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ ఆరోపించారు.శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్.సత్య నారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న మత హింస భారతదేశం లౌకికవాదానికి ముప్పు తెచ్చిపెడుతుందని, ప్రజలు భద్రత లేదని భావించే వాతావరణాన్ని దేశంలో మోడీ ప్రభుత్వం సృష్టించిందన్నారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసాత్మక మూకుమ్మడి దాడులకు బీజేపీ ప్రేరేపిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి ఉన్నప్పటికీ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని క్రూరంగా నాశనం చేయబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు, ఆర్‌బీఐ, ఎన్నికల సంఘం, సీబీఐ, సీఐసీ వంటి సంస్థలను మోడీ ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం పని చేయాలని ఒత్తిడి చేయడం దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమ న్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు బీజేపీ ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీలను నెరవేర్చలేదని, సంక్షేమ ఫలాలను అందించలేదన్నారు. మణిపూర్ రాష్ట్రం మూడు నెలలుగా మండుతుందని, గిరిజనులపై భయంకరమైన దురాగతాలు, తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘన జరుగుతున్న స్థానిక బీజేపీ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకుండా మౌనం వహించడం దారుణమన్నారు. బీజేపీ చేస్తున్న దురాగతాలను దేశ ప్రజలు గుర్తిస్తున్నారని, 26లౌకిక పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడి రాబోయే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కృషి చేస్తాయని వెల్లడించారు.ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఎండి.సలీమ్, కంపల్లి శ్రీనివాస్, ఎన్.శ్రీకాంత్, ఒమర్ ఖాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.

'ఓట్ల రాజకీయం కోసమే రెండు తెగల మధ్య ఘర్షణ'



- హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన
- ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

మణిపూర్ రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీ రెండు తెగల మధ్య ఘర్షణ నెలకొల్పి ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆరోపించింది. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ సంఘటనను వ్యతిరేకిస్తూ శనివారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ మాట్లాడుతూ..మణిపూర్ రాష్ట్రంలో రెండు తెగల మధ్య ఘర్షణను నిలువరించడంలో కేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళలను బహిరంగ ప్రదేశాలలో నగ్నంగా ఊరేగించి వారిని సామూహిక అత్యాచారం చేశారని, వారిపై ఇప్పటికీ ఏ చర్యలు తీసుకోలేదని అత్యాచారం చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అక్కడి ఘర్షణ వాతావరణం నిలువరించి, శాంతిని నెలకొల్పాలని కోరారు. ఈ దుర్మార్గపు చర్యలపై దేశంలో ఉన్న ప్రతి పౌరుడు స్పందించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని వారు కోరారు.మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరన్ సింగ్, ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే రాజీనామా చేసి కుకీ జాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అత్యాచారానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కాంపల్లి కళ్యాణ్, నాయకులు శివ, అనిల్, గ్యార పవన్ పాల్గొన్నారు.

నీటి పారుదల శాఖ అధికారులపై కార్పొరేటర్ ఆగ్రహం

నాలా వెంబడి ఉన్న మట్టికుప్పలు ఇంకా తీయరా : కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవ తెలంగాణ-అడిక్‌మెట్



గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్ బస్తీ , ఇతర నాలా పరీవాహక ప్రాంతాలలో శనివారం కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ పర్యటించారు. అనం తరం నీటిపారుదల అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలా వెంబడి ఉన్న మట్టికుప్పలు ఇంకా తీయకపోవడం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని అన్నారు. కార్పొరేటర్‌గా తాను చేసిన విజ్ఞప్తిని కూడా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. ఇదేవిధంగా అధికారుల తీరు ఉంటే నాలా పరీవాహక ప్రాంతాలలో జరుగుతున్న పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ డివిజన్‌లో పర్యటన తమకు సమాచారం లేదని అన్నారు. స్థానిక అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతా ధికారులు పర్యటనల సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ ను పాటించడం లేదని. ఈ అంశాన్ని సంబంధిత అధికా రులకు ఫిర్యాదు చేస్తానని వివరించారు. కార్యక్రమంలో ఏఈ శ్యామ్ సుందర్,బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నా సాయి చంద్, ఉమేష్ , శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాష్ యాదవ్, సాయి , ఆకుల సురేందర్, సత్యం, సంధ్య, పాల్గొన్నారు.

ప్రజల కన్నీటిని తుడిచేదే పాట

రాయిని సైతం కరిగించే గాత్రం సాయి చందు సొంతం

నవతెలంగాణ-ముషీరాబాద్



పేద ప్రజల కన్నీటిని తుడి చేదే పాట అని, రాయిని సైతం కరిగించే గాత్రం సాయి చందు సొంతమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయి చంద్ మిత్ర మండలి ఆధ్వర్యంలో సాయి చందు సాంస్కృతిక సమ్మేళనం ప్రముఖ కవి యశ్పాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మానకొండూరు శాసనసభ్యులు రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు గోరేటి వెం కన్న, దేశపతి శ్రీనివాస్, ప్రజా గాయకులు విమలక్క ప్రకృతి కవి జయరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశపతి మాట్లాడుతూ తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ దివంగత సాయిచంద్ తనగాత్రంతో తెలంగాణ ఇంటింటి బిడ్డ అయిండని కొనియాడారు. ప్రముఖ కవి జయరాజు మాట్లాడుతూ సాయిచందు స్ఫూర్తితో దళిత ప్రజాప్రతినిధులు చట్టసభల్లో హక్కుల కోసం మాట్లాడినప్పుడే సాయి చెందుకూ ఘనమైన నివాళి అని తెలి పారు. ఈ కార్యక్రమంలో సాయి చందు తండ్రి వెంకట్ రాములు, బహుజన కవి రేంజర్ల రాజేష్, విజ్ఞానదర్శిని వ్యవస్థాపకులు టి రమేష్, రాచకొండ రమేష్, ప్రముఖ గాయకులు గంగ, స్వర్ణక్క పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షాలు

- రంగంలోకి మాన్సూన్ ఎమర్జెన్సీ, డీఆర్ఎఫ్
- నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షాల నేపథ్యంలో నగర వాసులకు ఎలాంటి ఇబ్బ ందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు అన్ని చర్య లుతీసుకున్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిం చేందుకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 428 మాన్సూన్ ఎమర్జెన్సీ బందాలతో పాటు డీ.ఆర్.ఎఫ్ 27 బందాలను రంగంలోకి దించారు. ఈ బృందాలు 24 గంటలపాటు పనిచేస్తున్నా యి. నగ రంలో గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు మొత్తం 946 నీటి నిల్వలపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. 107 చెట్లు చోట్ల చెట్లుపడిపోయినట్టు ఫిర్యాదు రావడంతో వాటిని తొలగించారు. లింగోజిగూడ, హిమాయత్ నగర్, ఆదర్శ్ నగర్ (స్ట్రీట్ నెం .14), ఎన్.టి.ఆర్ నగర్, అల్తాఫ్‌నగర్ కాలనీ లలో నీరు రావడంతో శిథిలావస్థలో ఉన్న 5 గోడ లు పడిపోయిన ఫిర్యాదులు రావడంతో వెంటనే స్పందిం చిన మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలతోపాటు డీ.ఆర్.ఎఫ్ బృందాలు ఎలాంటి ప్రమాదం జరగకుండా వాటిని తొలిగించారు.

నేలకూల్చిన 87ఇండ్లు

నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్తుకు చేరిన ఇంట్లు కూలడంతోపాటు మరికొన్ని ప్రమాదకరంగా మారాయి. ఇప్పటి వరకు 483 గహాలను గుర్తించగా అందులో 87 గహాలు కూల్చారు. గహ యజమానుల విజ్ఞప్తి మేరకు 92 గృహాలను మరమ్మత్తులకు అనుమతి. 135 గహాలు వీకెండ్ చేశారు. 19 గహాలు సీజ్ చేశారు. ఇంకా 150 గహాలు ప్రాసెస్‌లో కలవు. నగర పరిధిలో ఎస్.ఎన్.డీ.పీ ద్వారా చేపట్టిన 780 కోట్ల వ్యయంతో 36 పనులు చేపట్టగా అందులో 30 పనులు పూర్తయ్యాయి. మిగతా 6 పనులను త్వరలో పూర్తి చేయనున్నారు.

సెమిస్టర్స్ వాయిదా

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 16 నుంచి నిర్వహించాలని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ నేతృత్వంలో జరిగిన ప్రిన్సిపల్స్, సంబంధిత అధికారుల సమావేశం నిర్ణయించారు. ఈ నెల 26, 27వ తేదీల్లో ఇంటర్నల్స్, తదుపరి ప్రాక్టికల్స్ పూర్తి చేయాలని, పరీక్షల తేదీలకు అనుగుణంగా సిలబస్ పూర్తి చేసుకో వా లని సూచించారు. విద్యార్థుల అభ్యర్థనల మేరకు ఈ నిర్ణ యం తీసుకున్నట్లు చెప్పారు. అకడమిక్ సమస్యలు, విద్యా ర్థులు లేవనెత్తుతున్న అంశాలపై సమావేశం సుదీర్ఘంగా చర్చించి కొన్ని సబ్జెక్టులకు సంబంధించి సిలబస్ పూర్తి కాలేదన్న విషయమై రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొ.బి.రెడ్యానాయక్, కారణాలపై ప్రిన్సిపల్స్‌ను ఆరా తీశారు. క్యాలెండర్ ప్రకారమే సిలబస్ పూర్తి చేయాలని, దానికి అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని ఈ సందర్భ ంగా వీసీ స్పష్టం చేశారు. సాంకేతిక కారణాలతో ఎంసీజే ప్రవేశపరీక్షను తిరిగి నిర్వహించాలని ఇందుకు సంబంధించిన తేదీని వీలైనంత త్వరగా వెల్లడించాలని సమావేశంలో నిర్ణయించారు. కొత్తగా ప్రవేశపెట్టిన బీఎస్సీ డాటా సైన్స్, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్స్, బీబీఏ రిటైల్ మేనేజ్ మెంట్, ఎంబీఏ టూరిస్ట్ అండ్ ట్రాన్స్ పోర్ట్ మేనేజ్ మెంట్, పీజీ మైక్రోబయాలజీ ఫ్రెగ్మెంటేషన్ లాంటి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు అనూహ్య స్పందన వచ్చిందని సంబంధిత ప్రిన్సి పల్స్ తెలిపారు. ఈ సమావేశాల్లో ఓయూ క్యాంపస్, అను బంధ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థి వ్యవహారాలు, యూజీసీ వ్యవహారాల డీన్లు, జిల్లా పీజీ కళాశాలల విభాగం, అకడమిక్ ఆడిట్ సెల్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, బిల్డింగ్ డివిజన్ డైరెక్టర్లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ముఖ్య వైద్యాధికారి పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్ వినియోగంపై ప్రజలకు అవగాహన

- డిప్యూటీ కమిషనర్ డి.బాలయ్య

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



వచ్చే సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) వీవీప్యాట్ లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అబిడ్స్ సర్కిల్ కార్యాలయంలో ఈవీఎం మిషన్ ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ -14 డిప్యూటీ కమిషనర్ డి.బాలయ్య తెలిపారు. శనివారం అబిడ్స్‌లోని జిహెచ్ఎంసి సర్కిల్ -14 కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్‌లపై ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీ లకు అవగాహన కల్పిం చేందుకు సర్కిల్ కార్యాలయంలో మిషన్‌ను ఏర్పాటు చేశా మన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకో వడం మన హక్కు అని చెప్పారు. ఈ వీఎం యంత్రాలు, వీవీ ప్యాట్ ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే దానిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలకు అపోహలు. సందేహాలు నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం దోహదం దుతుందన్నారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాలు కురుస్తున్న కారణంగా గోషామల్ సర్కిల్ పరిధి లోని ప్రజల కు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే వారికి సహాయం అందించేందుకు 24 గంటల పాటు మన్‌సున్ ఎమర్జెన్సీ టీం. డీఆర్ఎఫ్ బృందాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ ఆర్తులకు చేయూత

నవతెలంగాణ-ఓయూ



అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీ లత శోభన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనసుతో రాష్ట్ర ప్రజలకు నేనున్నానని భరోసా కల్పి స్తూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తార్నాకలోని తమ క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ ఎఫ్ చెక్కును చార్మినార్ పరిధికు చెందిన లబ్దిదా రుడు ఠాకూర్ మహేందర్ సింగ్‌కు బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్య క్షుడు మోతెశోభన్‌రెడ్డితో కలిసి అందజేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పవన్ కళ్యాణ్, కిరణ్ కుమార్ మల్లడ్డి, ఠాకూర్ ప్రశాంత్‌సింగ్ పాల్గొన్నారు.



మరకలు పోగొడదాం

ఎడతెరిపి లేని వానలతో రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. ఎంత జాగ్రత్త తీసుకున్నా... ఏదో విధంగా బట్టలు, వస్తువుల మీద మరకలు పడుతూనే ఉంటాయి. పిల్లలు చేసే మరకల గురించి చెప్పక్కర్లేదు. ఇవేకాక కొన్ని సందర్భాలలో ఇంట్లో బట్టల మీద నూనె మరకలు పడుతూ ఉంటాయి. వాటి నుండి దుర్వాసన కూడా వస్తుంటుంది. మరి ఆ మరకలను పోగొట్టి, మన బట్టలను, వస్తువులను ఎలా కాపాడుకోవాలో చూద్దాం...

- మరకల వద్ద లిక్విడ్ డిటర్జెంట్‌తో రుద్ది ఆ తర్వాతే సబ్బుతో ఉతికి చూడండి. మరీ మొండి మరకలైతే మాత్రం వెనిగర్‌తో కేవలం ఆ ప్రాంతాన్ని మాత్రమే రుద్ది ఆ తర్వాత మామూలుగా సబ్బుతో కడిగేయవచ్చు.
- వెనిగర్ లేకుంటే గోరువెచ్చని నీటిలో నాలుగు యాస్పరిన్ బిళ్ళలు వేసి ఆ నీటిలో దుస్తులు నానబెట్టి ఉతికేయవచ్చు.
- తెల్లని దుస్తులైతే మాత్రం కాస్త హైడ్రోజెన్ పెరాక్సైడ్‌ను మరకలపై రాసి అయిదు నిముషాల తర్వాత ఉతకండి.
- పెన్ను, లిప్‌స్టిక్ మరకలు బట్టలపై పడితే మరకపైకి వచ్చేలా ఉంచి, ఓ చిన్న పాత గుడ్డను ఆల్కాహాలులో ముంచి దాన్ని మరకపై తట్టినట్టుగా పదేపదే చేయండి. ఆ తర్వాత ఉతకండి. మరకలు మరీ జిడ్డుగా అంటుకున్నట్లుగా అనిపిస్తే కిరోసిన్ తీసుకుని మరకపై పూసి అయిదు నిముషాల తర్వాత శెనగపిండితో గట్టిగా రుద్ది కడిగేయండి.
- కార్పెట్‌పై క్యాండిల్ చుక్కలు పడితే ఓ స్టీలు గిన్నెలో ఐసుముక్కలు వేసి దాన్ని ఈ క్యాండిల్ చుక్కలపై కాసేపు ఉంచండి. చల్లదనానికి ఈ క్యాండిల్ వ్యాక్స్ మరింతగా గట్టిగా మారుతుంది. అప్పుడు ఏదైనా స్పూన్ మొనతో దానిని చెక్కేసి బ్రష్‌తో శుభ్రంగా తొలగిస్తే సరిపోతుంది.
- నిత్యం వాడే బకెట్లు మగ్‌లపై ఉండే జిడ్డు మరకలు పోవాలంటే ముందుగా వాటిని కిరోసిన్‌లో తడిపిన గుడ్డతో గట్టిగ తుడిచి ఆ తర్వాత సబ్బుతో కడగాలి.
- ప్లాస్కులో దుర్వాసన పోవాలంటే నాలుగైదు కోడిగుడ్డు పెంకులను చిన్న చిన్న ముక్కలు చేసుకుని వాటిని ప్లాస్కులో వెయ్యాలి. దానిపై వేడినీటిని పోసి మూతపెట్టాలి. మధ్య మధ్యలో బాగా కదిలిస్తూ ఓ గంటన్నర పాటు ఉంచండి. ఆ తర్వాత సబ్బుతో కడిగేయండి. తడారిన తర్వాత ఓ చెంచాడు పంచదార అందులో వేసి మూతపెట్టి ఉంచండి. దుర్వాసన రాకుండా తాజాగా ఉంటుంది.

ఆసియా ఛాంపియన్‌షిప్‌లో మహిళా ప్రభంజనం

క్రీడాకారిణులు మళ్ళీ మళ్ళీ తమ సత్తా చాటుతూనే ఉన్నారు. దేశానికి పతకాల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. ప్రపంచ నలుమూలల మన జాతీయ జెండాను రెపరెపలాడిస్తున్నారు. ఇటీవలె థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2023లో పాల్గొన్నారు. భారతదేశ అథ్లెట్‌లు మొత్తం 13 పతకాలను గెలుచుకోగా అందులో మహిళల పాత్ర కూడా కీలకంగా ఉంది. వారిలో మన తెలుగు తేజం జ్యోతి యర్రాజి ఒకరు. అలాగే లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన అథ్లెట్‌ల పోరాటంలో భాగస్వామి అయిన సంగీతా ఫోగట్ బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో కాంస్యం సాధించింది. ఆ వివరాలు నేటి మానవిలో...

పరుగు వైపు ఆకర్షితురాలై...



ప్రియాంక గోస్వామి... ఈమె 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో పోటీపడే భారతీయ క్రీడాకారిణి. టోక్యో ఒలింపిక్స్‌లో కూడా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి 17వ స్థానంలో నిలిచింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో 10000 మీటర్ల నడకలో రజత పతకాన్ని సాధించిన తొలి భారతీయ మహిళ. ప్రియాంక అథ్లెటిక్స్‌కు రాకముందు పాఠశాలలో జిమ్నాస్టిక్స్ సాధన చేసేది. గెలిచిన పోటీదారులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను చూసి ఉత్సా హపడి పరుగు వైపు ఆకర్షితురాలైంది. ఫిబ్రవరి 2021లో 20 కి.మీ రేసులో ఇండియన్ రేస్‌వాకింగ్ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకుంది. 2020 సమ్మర్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 2017 లో కూడా ఇండియన్ రేస్‌వాకింగ్ ఛాంపి యన్‌షిప్‌ను గెలుచుకుంది. ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2023లో మహిళల రేస్ వాక్ ఈవెంట్‌లో 1:34:24 సమయంతో రజత పత కాన్ని సాధించి మరో రికార్డు తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఆమె భారతీయ రైల్వేలో ఓఎస్‌గా పనిచేస్తుంది.



జ్యోతి యర్రాజి...

వైజాగ్‌కు చెందిన ఈమె 28 ఆగస్టు, 1999 పుట్టింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో నైపుణ్యం కలిగిన భారతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్. 10 మే 2022న 13.23 సెకనులు పరిగెత్తి అనురాధ బిస్వాల్ దీర్ఘకాల రికార్డును బద్దలు కొట్టింది. తర్వాత 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత జాతీయ రికార్డును సృష్టించింది. అప్పటి నుండి తన రికార్డును తానే చాలాసార్లు బద్దలు కొట్టింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. ఫైనల్స్‌లో 5వ స్థానంలో నిలిచిన భారత మహిళల 4x100 మీటర్ల రిలే జట్టులో భాగమైంది.

2022 భారత జాతీయ క్రీడల ఎడిషన్‌లో 100 మీటర్లు, 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణాన్ని గెలుచుకుంది. 17 అక్టోబరు 2022న 13 సెకన్ల కంటే తక్కువ సమయం గమ్యాన్ని చేరిన మొదటి భారతీయ మహిళా హర్డిలర్‌గా అవతరించింది. ఇదే ఏడాది 100 మీటర్ల మహిళల హర్డిల్స్‌లో రెండవ అత్యుత్తమ ఆసియన్‌గా, 11వ అత్యుత్తమ ఆసియా క్రీడాకారిణిగా నిలిచింది. 2022 ఇండియన్ ఓపెన్ నేషనల్స్‌లో మహిళల్లో అత్యుత్తమ అథ్లెట్‌గా ఎంపికైంది.

2023 ప్రారంభంలో ఆస్తానాలో జరిగిన 2023 ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలుచుకుంది. అంతేకాదు ఇండోర్ 60 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డును ఐదుసార్లు బద్దలుకొట్టింది. ఇప్పటి ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2023లో మహిళల 200 మీటర్ల ఫైనల్స్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ పతకం సాధించడంతో తన క్రీడను మరింత మెరుగు పరుచుకోవాలని భావిస్తుంది.

ప్రపంచ అగ్రగామిగా...

మన్‌ప్రీత్ కౌర్... పాటియాలాలోని సహౌలీ గ్రామానికి చెందిన ఈమె అంబాలాలో పుట్టింది. ఈమె ప్రొఫెషనల్ ఒలింపిక్ షాట్ పుటర్. 2017లో చైనాలోని జిన్హువాలో జరిగిన ఆసియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 18.86 మీటర్ల గోల్డ్ మెడల్ గెలుచుకుని ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానానికి చేరుకుంది. మహిళల షాట్‌పుట్‌లో 17.96 మీటర్ల భారత జాతీయ రికార్డును కూడా కలిగి ఉంది. షాట్‌పుట్‌లో రియో 2016లో జరిగిన సమ్మర్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ముగ్గురు తోబుట్టువులలో కౌర్ పెద్దది. ఆమె 13 ఏండ్ల వయస్సులో తండ్రి మరణించాడు. తల్లి 2006లో పక్షవాతానికి గురైంది. తండ్రి ప్రోత్సాహం, బంధుమిత్రుల సహకారంతో అథ్లెటిక్స్‌పై ఆసక్తిని పెంచుకుంది. ఆమె కజిన్‌లలో ఒకరు యూనివర్సిటీ స్థాయి 100మీ స్ప్రింటర్, మరొకరు డిస్కస్ త్రోయర్, ఆమె కోడలు కూడా షాట్ పుటర్. ఆమె మొదట్లో 100మీ లో ఏడాది పాటు శిక్షణ పొందింది. 2007లో ఓస్ట్రోవాలో జరిగిన 5వ IAAF వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో 9వ స్థానంలో నిలిచింది. 2010లో 3 ఏండ్ల విరామం తీసుకుని మహిళల షాట్‌పుట్‌లో 18 ఏండ్ల జాతీయ రికార్డును బద్దలు కొట్టేందుకు తిరిగి వచ్చింది. 2015లో కోల్‌కతాలో జరిగిన 55వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 17.96 మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని గెలుచుకుంది. రియో 2016 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఏకైక భారతీయ మహిళ కౌర్.



ఆసియా గ్రాండ్ ప్రిక్స్ అథ్లెటిక్స్ మీట్ మొదటి లెగ్‌లో జాతీయ రికార్డు, ప్రపంచ సీజన్-ప్రధాన ప్రయత్నంతో స్వర్ణం సాధించింది. తన అత్యుత్తమ త్రో 18.86 మీటర్లతో జాతీయ రికార్డును నెలకొల్పింది. బ్యాంకాక్‌లో జరి గిన ఆసియా అథ్లెట్స్‌లో మహిళల షాట్‌పుట్ తరపున రజత పతకాన్ని గెలుచుకుని జాతీయ రికార్డును సృష్టించింది. ఈ ప్రదర్శనతో ఆమె ఈ ఏడాది ఆగస్టులో లండన్‌లో జరగనున్న IAAF ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు కూడా అర్హత సాధించింది. ప్రస్తుతం భారతీయ రైల్వేలో పని చేస్తున్న ఆమె తన ట్రైనర్‌గా ఉన్న యూనివర్సిటీ స్థాయి షాట్‌పుటర్ కరమ్‌జీత్ సింగ్‌ను వివాహం చేసుకుంది. వీరికి ఓ అమ్మాయి ఉంది.

గతం కంటే బలంగా...



అభా ఖతువా... 28 ఏండ్ల ఆమె గత మూడు పోటీల్లో మాత్రం కేవలం 15.98, 16.57, 16.39 మాత్రమే చేయగలిగింది. ఈ ఏడాది మాత్రం మహిళల షాట్‌పుటర్లు భారతదేశానికి రజత పతకం తెచ్చిపెట్టింది. 18.06 మీటర్లతో సమం చేసిన అభా ఖతువా అత్యంత ఆశ్చర్యకరమైన ప్రదర్శన చేసింది.

తొలి భారతీయ రన్నర్

పరుల్ చౌదరి... మీరట్‌కు చెందిన ఈమె 15 ఏప్రిల్ 1995 పుట్టారు. 5000 మీటర్లు, 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో నైపుణ్యం కలిగిన భారతీయ అథ్లెట్. మహిళల 3000మీటర్ల పరుగుపందెంలో 9 నిమిషాల్లో గెలిచిన తొలి భారతీయ రన్నర్. చిన్నతనం నుండి అథ్లెట్ అంటే ఎంతో ఆసక్తి చూపించేది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో 6 నుండి 9 జూలై 2017లో జూలై 6 నుండి 9 వరకు జరిగిన ఆసియా అథ్లెటిక్స్‌లో ఛాంపియన్‌షిప్స్ దక్కించుకుంది. 2023లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో స్వర్ణం గెలుచుకుంది.

డాపెస్ట్‌లో సంగీతా ఫోగట్




రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ విజేత అయిన సంగీతా ఫోగాట్ బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్ 2023లో 59 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్‌ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై నిరసన తెలిపిన రెజ్లర్లలో సంగీత కూడా ఉంది. ఇప్పుడు తాను సాధించిన ఈ విజయాన్ని లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు అంకితం చేస్తున్నట్టు ప్రకటించింది సంగీత.



త్రివిధ దళాల్లో డిఫెన్స్ ఆఫీసర్ల కొరత

న్యూఢిల్లీ : భారత్‌లో త్రివిధ దళాలైన ఆర్మీ వైమానిక దళం, నేవీలో రక్షణాధికారుల కొరత ఏర్పడింది. కోవిడ్ మహమ్మారి సమయంలో అధికారులను తక్కువగా తీసుకోవడం కారణంగా 11,266 మంది మేజర్లు, కెప్టెన్ల కొరత ఈ రెండు విభాగాల్లో ఏర్పడింది. లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన సమాచారంలో ఈ విషయం వెల్లడైంది. సైన్యంలో 2,094 మంది ప్రధాన స్థాయి అధికారుల కొరత ఉండగా.. కెప్టెన్ స్థాయిలో 4,734గా ఉన్నది. భారత వైమానిక దళంలో 881 స్క్వాడ్రన్ లీడర్‌లు, 940 ఫ్లైట్ లెఫ్టినెంట్ల కొరత ఉన్నది. నేవీలో 2,617 మంది లెఫ్టినెంట్ కమాండర్ మరియు అంతకంటే తక్కువ స్థాయి అధికారుల కొరత ఉన్నది. భారత్‌లో కోవిడ్ -19 మహమ్మారి విజృంభించిన సమయంలో అధికారుల నియామకాలు తక్కువగా జరపటం కొరతకు ప్రధాన కారణమని కేంద్రం పేర్కొన్నది. ఇక ఎన్డీయేలో మహిళా క్యాడెట్‌ల సంఖ్యలో హర్యానా ముందంజలో ఉంది. ఇక ఎన్డీయే, పూణేలో గతేడాది కాలంలో మొత్తం 57 మహిళా క్యాడెట్‌ల ఖాళీలు పూర్తిగా సభ్యత్వం పొందాయి. అత్యధిక క్యాడెట్లు (19) హర్యానా నుంచి, 12 మంది యూపీ నుంచి ఉన్నారు. పంజాబ్, ఢిల్లీ, జమ్మూకాశ్మీర్‌ల నుంచి ఒక్కొక్కరు ముగ్గురు క్యాడెట్‌లు, హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఇద్దరు ఉన్నారని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలిపింది.



మంత్రితో చర్చలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి నేతృత్వంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్, జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎం యజ్ఞనారాయణ్, కన్వీనర్లు బీ వెంకటరాజం, పీ అరుణ్‌కుమార్, పీ శివబాబు, డీ దాసు తదితరులు మంత్రి వద్దకు చర్చలకు వెళ్లారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు సమర్పించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ...పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ విదేశీ పర్యటనలో ఉన్నారనీ, ఆయన తిరిగి వచ్చాక చర్చించి, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి డిమాండ్ల పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. కార్మికులు సమ్మె విరమించి, విధుల్లో చేరాలని కోరారు. మంత్రి సమాధానంపై జేఏసీ నేతలు హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో భేటీ అయ్యి చర్చించారు. పాలకవర్గాలు గతంలోనూ ఇలాంటి సందర్భాల్లో హామీలు ఇచ్చి, సమ్మెలు, ఆందోళనలు విరమింపచేసి, ఆ తర్వాత సమస్యలు పరిష్కరించకుండా మిన్నకుండిన సందర్భాలను నాయకులు ప్రస్తావించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయడం, వేతనాల పెంపు, కార్మికులకు బీమా, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్ల పదోన్నతులపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు సమ్మెను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు. ఆందోళనలు ఉధృతం చేయడంలో భాగంగా ఈనెల 27న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తే ప్రతిఘటించాలనీ, పోటీ కార్మికులను పెడితే అడ్డుకోవాలనీ జేఏసీ సమావేశం నిర్ణయించింది. మంత్రితో చర్చల అనంతరం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మీడియాతో మాట్లాడారు. కష్టించి పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయమంటున్నామనీ, దానికీ సిద్ధంగా లేకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో జేఏసీ కోశాధికారి సీహెచ్ సదానందం (టీజీకేబీయూ) కన్వీనర్ సీహెచ్ వెంకటయ్య (సీఐటీయూ), కో కన్వీనర్లు పాలడుగు సుధాకర్ (సీఐటీయూ), జయచంద్ర (ఏఐటీయూసీ), జటంకి వెంకన్న (ఐఎఫ్‌టీయూ), టీ నర్సింహారెడ్డి (ఏఐటీయూసీ), సాదుల శ్రీకాంత్ (టీజీకేబీయూ) తదితరులు పాల్గొన్నారు.

దేశానికే సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. గోల్కొండ క్రాస్‌రోడ్స్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మారణహోమం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించి.. మీరు చర్యలు తీసుకుంటారా, లేక మమ్మల్ని తీసుకోమ్మంటారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించినా ఇంత వరకు మోడీ స్పందించడం లేదని విమర్శించారు. మూడు నెలలుగా మణిపూర్ అట్టుడుకుతుంటే బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు తెగల మధ్య విభేదాలను మోడీ పెంచిపోషిస్తున్నారని తెలిపారు. అక్కడి ముఖ్యమంత్రి.. ఇది ఒక్క సంఘటనే కాదు, వందల సంఘటనలు జరిగాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ బీజేపీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తక్షణమే గద్దెదిగాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి మాట్లాడుతూ.. మణిపూర్‌లో వందలాది మంది ప్రాణం కోల్పోయినా ప్రధాని మోడీ మౌనం వహించడం సరికాదన్నారు. విదేశీ పర్యటనలు, ఎన్నికల ప్రచారాలకు వెళ్తున్న మోడీ మణిపూర్ వెళ్లలేరా అని ప్రశ్నించా రు.సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్‌సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించిన దుర్ఘటన యావత్ భారతదేశానికే సిగ్గుచేటన్నారు. ఇంత జరుగుతున్నా అక్కడి ప్రభుత్వం, పోలీసులు, ఆర్మీ ఏం చేయలేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే ఆ రాష్ట్రంలో వందలాది మంది మైనార్టీలను వెంటాడి చంపారని, మరో 50వేల మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణహోమం మోడీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మణిపూర్ ఘటనలపై ఇతర దేశాలు స్పందిస్తున్నా దేశ ప్రధాని మోడీ ఇప్పటి వరకు ఒక్కమాట కూడా మాట్లాడలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ఒక రాష్ట్రాన్ని కాపాడలేని వాళ్ల దేశాన్నేమి ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్కడ శాంతిని నెలకొల్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మణిపూర్ అల్లర్ల ద్వారా రాజకీయంగా లబ్ది పొందడానికే అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సీపీఐ(ఎం) సిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.దశరథ, ఎం.శ్రీనివాసరావు, కెఎన్.రాజన్న, ఎమ్.మహేందర్, ఎం.వెంకటేష్, నాయకులు ఎన్.మారన్న, ఆర్.వెంకటేష్, కుమారస్వామి, సి.మల్లేష్, జి.నరేష్, అజయ్‌బాబు, ఆర్.అశోక్, ఆర్.వాణి, జి.కిరణ్ పాల్గొన్నారు.

హస్తం మంత్ర

(మొదటిపేజీ తరువాయి)

కైవసం చేసుకోవాలనే తపనతో నజర్ పెట్టింది. ఎవరికి ఇష్టం ఉన్నా..లేకపోయినా అధిష్టానం సూచనలు తూ.చ తప్పకుండా పాటించాలనేది ఆదేశం. ఇప్పటివరకు టికెట్ల విషయంలో నాయకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా కొనసాగింది.కానీ ఈసారి ప్రజలతో సంబంధాలు లేకపోతే టికెట్ వచ్చే పరిస్థితి లేదనే సంకేతాలిస్తోంది. పెద్ద నాయకులం అని చెప్పుకునేవారు కూడా హైదరాబాద్‌కే పరిమితమై...ఢిల్లీలో పైరవీలు చేసుకుని టికెట్లు దక్కించుకున్న నేతలు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారిని అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయం షాక్‌కు గురి చేస్తున్నది. ఈసారి టికెట్ అంత ఈజీ కాదని వారికి ఇప్పుడిప్పుడే బోధపడుతున్నదట!. శుక్రవారం టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీని ఏఐసీసీ ప్రకటించడంతో టికెట్ల విషయం మరింత చర్చనీయాంశమవుతున్నది. ప్రతి నియోజకవర్గానికి చెందిన ముగ్గురు బలమైన అభ్యర్థుల పేర్లను ఈ కమిటీ ఖరారు చేయనుంది. ఆ జాబితాపై ఏఐసీసీ తమ వేగులతో సర్వేలు చేయించనుంది. ఆ సర్వేల ఆధారంగా బలమైన అభ్యర్థిని గుర్తించి ప్రకటించనున్నట్టు తెలిపింది. వారిని రంగంలోకి దించిన తర్వాత అన్ని రకాల సహాయ సహకారాలు అందించనుంది. గతంలో టికెట్లు ఇచ్చి 'నీ చావు నీవు చావు' అన్న రీతిలో ఉండేది. అభ్యర్థిపై సరైన అంచనాలు లేకుండా టికెట్లు ఇచ్చిన సంఘటనలెన్నో ఉన్నాయి. 2018 సాధారణ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్, మిర్యాలగూడకు ఆర్.కృష్ణయ్యతోపాటు మరో 15 మంది అభ్యర్థులకు రాత్రికి రాత్రి బీ ఫారాలు ప్రకటించి తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. ఆయా నియోజకవర్గాల్లో కొంత మంది నేతలు దశాబ్దాలుగా పోటీ చేస్తూ గెలుస్తూ...ఓడుతూ వస్తున్నారు. వారితోపాటు పక్క నియోజకవర్గాల్లో తమ రక్తసంబంధీకులకు, అనుచరులకు కూడా టికెట్లు ఇప్పించుకునే వారు. ఈసారి అటువంటి పరిస్థితులకు ఫుల్‌స్టాఫ్ పెట్టనున్నట్టు తెలుస్తోంది. 60 ఏండ్లు దాటిన వారు కూడా పోటీకి సై అంటున్నారు. కానీ ఏఐసీసీ మాత్రం మీరు చేస్తారా? మీ వారసులు చేస్తారో తేల్చుకోవాలని సూచిస్తున్నది. అది కూడా ప్రజల్లో బలం ఉంటేనే ప్రయత్నించాలని కోరుతున్నది. మరి కొంత మంది నియోజకవర్గాలను తమ సంస్థానాలుగా భావిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులను ఎదగనీయకుండా అణచివేస్తున్నారనే ఆవేదనలు వినిపిస్తున్నాయి. ఎవరైనా సరే నిబంధనలమేరకు టికెట్లు ఉంటాయని అధిష్టానం స్పష్టం చేయడం గమనార్హం. అందుకే పార్టీలో చేరుతున్న వారికి కూడా షరతులు పెట్టొదనీ, స్వచ్ఛందంగా చేరాలంటూ అధిష్టానం విజ్ఞప్తి చేస్తున్నది. బీఆర్ఎస్ లాంటి కొండను కొట్టేందుకు సైనికుల్లా కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకరావాలని సర్దిచెబుతున్నారు. కుటుంబానికి రెండు టికెట్లు ఇవ్వాలనే నేతల ప్రతిపాదనను ఏఐసీసీ తిరస్కరించినట్టు తెలిసింది. దీంతోపాటు పార్టీలోనే ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్న వారికి మీదారి మీరు చూసుకోవాలని కూడా చెబుతున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇన్నాళ్లు నాయకుల మధ్యే టికెట్ల పంపిణీ అనే సాంప్రదాయానికి ఏఐసీసీ ఫుల్‌స్టాప్ పెట్టనుందా? ఒత్తిళ్లకు లోనై పాత పద్ధతినే కొనసాగించి బొక్కబోర్లా పడుతుందా? అనేది ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే...

ఎరువు బరువు..?

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా దేశీయంగా ఎరువుల ధరలను మాత్రం సవరించకపోవడం గమనార్హం. గ్లోబల్ మార్కెట్‌లో తక్కువ ధరకు ఎరువులు లభిస్తున్నా.. అన్నదాతకు ఆ ప్రయోజనం దక్కకుండా మోడీ సర్కారు మోకాలడ్డుతోంది.

గ్లోబల్ మార్కెట్ ధరలు ఇండియన్ మార్కెట్‌కు వర్తించవా..?

అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు పెరిగితే ఆ పేరుతో దేశీయంగా ధరలు పెంచే కేంద్ర ప్రభుత్వం తగ్గినప్పుడు మాత్రం ఆ మేరకు సవరించట్లేదని స్పష్టమవుతోంది. అమ్మోనియా, ఫాస్ఫరిక్ యాసిడ్‌తోపాటు ఎంవోపీ, డీఏపీ, 10:26:26, 28:28:0, కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ ధరలు గ్లోబల్ మార్కెట్లో జనవరి-ఫిబ్రవరి నుంచి క్రమేణా క్షీణిస్తున్నాయి. ఫిబ్రవరిలో 12 శాతం ఉన్న తగ్గుదల ఏప్రిల్ నాటికి 40శాతానికి చేరింది. ఈ ధరలను ఆధారం చేసుకుని సబ్సిడీ మొత్తాన్ని కేంద్రం తగ్గించింది. కానీ ఎరువుల ధరలను మాత్రం సవరించలేదు. దీనివల్ల ఇటు రైతులు, కంపెనీలకు ప్రయోజనం దక్కకపోవడంతో దేశీయంగా ఎరువుల ధరల్లో వ్యత్యాసం లేదని ఎరువుల హోల్‌సేల్ అండ్ రిటైల్ వర్తకుల అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పుల్లఖండం నాగేందర్‌రావు తెలిపారు.

ముడిసరుకు ధర క్షీణత

అంతర్జాతీయంగా ఎరువుల ముడిసరుకు ధరలు క్షీణిస్తున్నాయి. అమ్మోనియా జనవరిలో మెట్రిక్ టన్ను ధర డాలర్లలో 830 ఉంటే ఏప్రిల్ నాటికి 250కి పడిపోయింది. ఫాస్ఫరిక్ యాసిడ్ రేటు 1150 డాలర్ల నుంచి వెయ్యికి తగ్గింది. యూరియా 580 నుంచి 290 డాలర్లకు పడిపోయింది. తదనుగుణంగా ఎరువుల ధరలు తగ్గాలి కానీ పెంచిన రేట్లు అలానే ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్లోబల్ మార్కెట్లో ఎరువుల ముడిసరుకు రేట్లు తగ్గినా ధరల్లో ఎలాంటి మార్పుల్లేవు. పొటాష్ ముడిసరుకు రేటు తగ్గినా.. సబ్సిడీ పెంచలేదు. మెట్రిక్ టన్ను యూరియాపై సబ్సిడీ రూ.45వేల నుంచి 19వేలకు తగ్గించింది. కానీ ధరల్లో మాత్రం వ్యత్యాసం లేదు. గతేడాది నానో యూరియాను వెలుగులోకి తెచ్చిన కేంద్రం ఈ సంవత్సరం నానో డీఏపీని ప్రవేశపెట్టి సబ్సిడీ భారం నుంచి ఉపశమనం పొందుతోంది. ఈ నానో డీఏపీ లీటర్ బాటిల్ ధర రూ.600గా నిర్దేశించింది. కేంద్రానికి సబ్సిడీ సొమ్ము భారీగా మిగులుతోంది. నానో యూరియా, డీఏపీలను పురుగుమందుల తరహాలో ఆకులపై పిచికారీ చేస్తే సరిపోతుంది. 'పీఎం ప్రణామ్' పథకాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీని ఏటికేడు క్రమంగా ఎత్తివేస్తోంది.

నానో ఎరువైనా ధరల్లో వ్యత్యాసం స్వల్పమే..!

ద్రవరూపంలో ఉండే నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులోకి వచ్చినా ధరల్లో పెద్దగా వ్యత్యాసం లేదు. 50 కేజీల బస్తాను అర లీటర్ నానో ఎరువుగా తయారు చేశారు. యూరియా బస్తా రూ.268 ఉండగా నానో యూరియా బాటిల్ రూ.240కి లభిస్తుంది. దీనివల్ల యూరియా సబ్సిడీని కేంద్రం తప్పించుకుంది. నానో ఎరువులతో అధిక ప్రయోజనాలున్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. రైతులు మాత్రం వీటిపై ఆసక్తి చూపడం లేదు.

నిండుకుండల్లా జంట జలాశయాలు

(మొదటిపేజీ తరువాయి)

చేరితే గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దిగువనున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. రాజేంద్రనగర్ వైపు వెళ్లే ఔటర్ సర్వీసింగ్ రోడ్డును పూర్తిగా మూసేశారు.

పెట్టుబడుల పేరుతో రూ.712కోట్లు స్వాహా

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 15వేల మంది బాధితులను మోసం చేసి రూ.712కోట్లు కొల్లగొట్టింది. ఈ డబ్బంతా పలు మార్గాల్లో క్రిప్టో కరెన్సీ ద్వారా దుబాయ్ నుంచి చైనాకు పంపిస్తున్నారు. తీవ్రవాదులు ఉపయోగించే క్రిప్టో వెబ్‌సైట్‌కు ఈ డబ్బు వెళ్లినట్టు విచారణలో తేలింది. చైనా, దుబాయ్‌లో ఉన్న ప్రధాన నిందితులకు ఇండియాలో సహకరి స్తున్న 9మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాపై 745 ఫిర్యాదులు వచ్చాయి. జాతీయ స్థాయిలో సమన్వయం చేసుకుని దర్యాప్తు చేయల్సి వుందని సీపీ తెలిపారు. సైబర్ మోసాలపై ప్రజలను ఎప్పటికప్పుడూ చైతన్యపరుస్తున్నా, కొంత మంది మోసపోతూనే ఉన్నారన్నారు.

వికలాంగుల పింఛన్ రూ.4,016కు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

పింఛన్‌ను తీసుకుంటున్న సంగతి తెలిసిందే. తాజా పెంపుతో వారు ఇక ప్రతి నెలా రూ.4,016 పింఛన్‌ను అందుకోబోతున్నారు. ఇటీవల మంచిర్యాల వేదికగా వికలాంగుల పింఛన్‌ను పెంచుతున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ప్రకారంగా పెంపునకు సంబంధించిన ఫైల్‌ను ఆమోదించారు. ఈ క్రమంలో అత్యధిక పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మరో నాలుగు రోజులు వానలు

(మొదటిపేజీ తరువాయి)

ఒడిశా, ఉత్తర ఆంధ్రా సమీపంలోని వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 24న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో నాలుగు రోజుల పాటు వర్షాలు పడనున్నాయని తెలిపింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వాన కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదివారం నుంచి సోమవారం వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని చెప్పింది. సోమవారం నుంచి మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ సమాచారం.

మంగళవారం నుంచి బుధవారం వరకు ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్‌లో అతిభారీ వర్షాలు పడే పరిస్థితి ఉందని పేర్కొంది. కొత్తగూడెం, భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయనీ, అదే సమయంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో వానలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు 'ఎల్లో' అలెర్టును జారీ చేసింది.

చరిత్ర ఘనం...వర్తమానం దుర్భరం

సమస్యల సుడిగుండంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు

- రిజిస్ట్రేషన్ ప్రక్రియే ప్రధాన అడ్డంకి
- ఫలితంగా ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం



న్యూఢిల్లీ : దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) పరిస్థితి గత మంతా ఘనం... వర్తమానం దుర్భరం అన్న చందంగా ఉంది. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో 45%, ఎగుమతులలో 40% వాటా కలిగిన ఈ పరిశ్రమలు ప్రస్తుతం సమస్యల సుడిగుండంలో చిక్కుకొని విలవిలలాడుతున్నాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ రుద్దిన బలవంతపు నియంత్రణలు, కోవిడ్ కేసులు తక్కువగా ఉన్నప్పటికీ దేశంలో అనవసరంగా విధించిన లాక్‌డౌన్... వీటన్నింటి కారణంగా ఎంఎస్ఎంఈల ఆర్థిక పరిస్థితి కుదేలైంది. ముఖ్యంగా రిజిస్టర్ చేసుకోని పారిశ్రామిక సంస్థలు ప్రభుత్వం నుండి ఎలాంటి సాయం పొందలేకపోతున్నాయి. పోనీ ప్రభుత్వ సంస్థల వద్ద రిజిస్టర్ చేసుకుందామంటే సవాలక్ష ఆంక్షలు....గజిబిజి నిబంధనలు.

అత్యవసర రుణ గ్యారంటీ పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, సూక్ష్మ-చిన్న తరహా పరిశ్రమల కోసం రుణ హామీ నిధి ట్రస్ట్, సూక్ష్మ-చిన్న తరహా పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం, సాంప్రదాయిక పరిశ్రమల పునరుత్పత్తికి సంబంధించిన నిధి పథకం... ఈ పథకాలు, సబ్సిడీలు, నూతన విధాన చర్యలు అన్నీ రిజిస్టర్డ్ ఎంఎస్ఎంఈలకే వర్తిస్తున్నాయి. రిజిస్టర్ కాని సంస్థలకు ఇవేవీ లభించడం లేదు.

గణాంకాలే లేవు

దేశంలో ఎన్ని ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయి? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అందుబాటులో లేదు. 2006-07లో సేకరించిన గణాంకాల ప్రకారం 1.55 మిలియన్ల ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయి. మొత్తం 26.1 మిలియన్ల ఎంఎస్ఎంఈలలో కేవలం 5.9% మాత్రమే క్రియాశీలకంగా పని చేస్తున్నాయి. 2006-07 తర్వాత దేశంలో ఎలాంటి గణన చేపట్టలేదు. 2019లో ప్రభుత్వం 7వ ఆర్థిక గణన నిర్వహించినప్పటికీ ఆ వివరాలను బహిర్గతం చేయలేదు. 2015-16లో నిర్వహించిన 73వ రౌండ్ జాతీయ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) ప్రకారం దేశంలో 63 మిలియన్ల ఎంఎస్ఎంఈలు రిజిస్టర్ అయ్యాయని అంచనా వేశారు. వీటిలో 30% అసంఘటిత రంగంలో ఉన్నాయి. అయితే ఈ సర్వే లోపభూయిష్టంగా ఉంది.

ప్రక్రియ మొత్తం గందరగోళం

యాజమాన్యాలు వివిధ చట్టాల కింద ఎంఎస్ఎంఈలను కేవలం లాంఛనప్రాయంగానే నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. వివిధ చట్టాల కింద కేవలం 30% అసంఘటిత రంగ సంస్థలు మాత్రమే రిజిస్టర్ అవుతున్నాయి. ఫ్యాక్టరీల చట్టం కింద పరిశ్రమలను రిజిస్టర్ చేస్తే వాటికి సామాజిక భద్రతా ప్రయోజనాలు, ఇతర లాభాలు చేకూరుతాయి. ఇతర చట్టాల కింద నమోదయ్యే పరిశ్రమలకు ఎలాంటి ప్రయోజనాలు లభించవు. పోనీ ప్రభుత్వ ఏజెన్సీల వద్ద పరిశ్రమలను రిజిస్టర్ చేయిద్దామని అనుకుంటే ఆ ప్రక్రియ యావత్తూ గజిబిజిగా ఉంటోంది. ప్రస్తుతం ఎంఎస్ఎంఈలు జీఎస్టీ, సహకార వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఉద్యం వంటి వివిధ పథకాల కింద రిజిస్టర్ కావాల్సి వస్తోంది. దీంతో వాటిపై పరిపాలనా సంబంధమైన భారం పడుతోంది. గందరగోళం ఏర్పడుతోంది. 2020లో కేంద్రం ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించింది. పరిశ్రమలు ఇందులో రిజిస్టర్ చేసుకొని, వివిధ సర్టిఫికెట్లు పొందవచ్చు. అయితే ఇప్పటి వరకూ కేవలం 14.3 మిలియన్ల పరిశ్రమలు మాత్రమే దీనిలో రిజిస్టర్ అయ్యాయి. 2015-16 నాటికే దేశంలో 63 మిలియన్ల కంపెనీలు ఉన్నాయని అంచనా. అయితే ఈ సమాచారం కూడా చాలా పాతది. వ్యవసాయం తర్వాత దేశంలోనే రెండో అతి పెద్ద రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో లేకపోవడం విచారకరం.

ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించడం లేదు?

దేశంలోని చాలా పరిశ్రమల వివరాలు ప్రభుత్వ సంస్థల పుస్తకాలలో లేవు. అవి అసంఘటిత రంగంలో కొనసాగుతున్నాయి. నియంత్రణ, పర్యవేక్షణ, పన్నుల నుంచి తప్పించుకునేందుకు అవి తమ వివరాలు నమోదు చేసుకోవడం లేదు. రిజిస్టర్ అయిన తర్వాత ఆ పరిశ్రమలు చట్టపరమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఖాతా పుస్తకాలను నిర్వహించడం, రిటర్న్‌లు ఫైల్ చేయడం, చట్టాలు-నిబంధనలకు కట్టుబడి ఉండడం వంటి బాధ్యతలు నిర్వర్తించాలి. అయితే చిన్న చిన్న వ్యాపారాలు చేసే వారికి ఇది తలకు మించిన భారం అవుతోంది. ఎందుకంటే ఆర్థిక వనరుల కొరత కారణంగా యాజమాన్యాలు నిపుణులైన ఉద్యోగులను నియమించుకోలేవు. దేశంలోని ఎంఎస్ఎంఈలు సబ్సిడీలు, పన్ను ప్రయోజనాలు, రుణ గ్యారంటీల వంటి ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హులు. అయితే చాలా మంది చిన్న వ్యాపారులు వీటిని పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు. అదీకాక రిజిస్ట్రేషన్, దాని ప్రయోజనాల గురించి ఎంఎస్ఎంఈల యజమానులకు అవగాహన లేదు. పైగా పరిశ్రమలు అనేక రకాల రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి వస్తోంది. వ్యయం కంటే రిజిస్ట్రేషన్ కారణంగా ఒనగూరే ప్రయోజనమే ఎక్కువ ఉండేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సులభంగా రుణం లభించడం, మౌలిక సదుపాయాల కల్పనలో సాయం, పన్నుల వ్యవస్థ సరళతరంగా ఉండడం వంటి చర్యలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు జీవం పోస్తాయి.

తగ్గుతున్న ఉద్యోగ కల్పన

న్యూఢిల్లీ : దేశంలో మే నెలలో ఉద్యోగ కల్పన తగ్గింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పరిస్థితి కొంత మెరుగుపడినప్పటికీ ఆ తర్వాత మందగించిందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తెలిపింది. ఏప్రిల్‌లో ఈపీఎఫ్ కింద నమోదైన నెలవారీ నూతన చందాదారుల సంఖ్య 8,91,974 ఉండగా మే నాటికి ఒక శాతం... అంటే 8,83,176కు తగ్గిపోయింది. అయితే 18-28 సంవత్సరాల మధ్య వయసున్న యువ ఉద్యోగుల సంఖ్య మాత్రం ఇదే కాలంలో 5,75,799 (64.6%) నుండి 5,89,777 (66.8%)కి పెరిగింది. కానీ మహిళల వాటా మాత్రం 2,36,510 (26.5%) నుండి 2,21,079 (25.03%)కి తగ్గింది. దేశంలోని కొన్ని ప్రాంతాలలో మేలో రుతుపవనాలు ప్రవేశిస్తూ ఉంటాయని, దీంతో గ్రామీణ ప్రాంతాలకు వ్యవసాయ పనుల కోసం వలసలు మొదలవుతాయని, చాలా మంది నగరాలలో చిన్న చిన్న ఉద్యోగాలను విడిచి ఉపాధి కోసం పల్లెలకు పయనమవుతారని ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ (ఐఎస్ఎఫ్) అధ్యక్షుడు లోహిత్ భాటియా చెప్పారు. అదీకాక రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని చాలా కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను తీసుకోవడంపై అంతగా ఆసక్తి చూపవని తెలిపారు.

ఉద్యోగాలు వదులుతున్న వారి సంఖ్య ఏప్రిల్‌తో పోలిస్తే మేలో పెరిగింది. ఏప్రిల్‌లో 1.53 మిలియన్ల మంది ఉద్యోగాలు వదిలేయగా మేలో ఆ సంఖ్య 6% అంటే 1.63 మిలియన్లకు పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలించే కేంద్రం (సీఎంఐఈ) విడుదల చేసిన నివేదిక ప్రకారం ఏప్రిల్‌తో పోలిస్తే మేలో నిరుద్యోగ రేటు తగ్గింది.

ఫ్చ్..చేజేతులా..!



- భారత్-బంగ్లాదేశ్ మహిళల మూడో వన్డే టై
- వన్డే సిరీస్ 1-1తో సమం

ఢాకా: బంగ్లాదేశ్ మహిళలతో జరిగిన మూడో, చివరి వన్డే టై అయ్యింది. బంగ్లాదేశ్ మహిళలజట్టు నిర్దేశించిన 226పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారతజట్టు 225పరుగులకు కుప్పకూలింది. ఛేదనలో భాగంగా భారత్ 6వికెట్ల నష్టానికి 212పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. మరో 14పరుగులు చేస్తే సిరీస్ మనదే అనుకున్న దశలో 5పరుగుల వ్యత్యాసంలో మూడు వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో చివరి వికెట్‌కు రోడ్రిగ్స్-మేఘ్న సింగ్ కలిసి లక్ష్యానికి చేరువ చేశారు. మ్యాచ్ ఆధ్యంతం ఉత్కంఠగా సాగుతుండగా.. 48.5వ బంతిని మేఘ్న ఫోర్ కొట్టి గెలుపుపై ఆశలు కల్పించింది. చివరి 3బంతుల్లో మరో పరుగు చేస్తే గెలుపు మనదే అనుకున్నకుంటుండగా.. బంగ్లా బౌలర్ మరుఫా అక్తర్ వేసిన బౌలింగ్‌లో వికెట్ కీపర్ నిగర్ సుల్తానాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యింది. దీంతో మ్యాచ్ టై కాగా.. బంగ్లా అమ్మాయిలు సంబరాల్లో మునిగారు. ఈ మ్యాచ్‌లో పసికూన బంగ్లాదేశ్ అమ్మాయిల పోరాట పటిమ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు జరిగిన తొలి రెండు వన్డేల్లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్ గెలుపొందడంతో సిరీస్ 1-1తో సమమైంది. ఢాకాలో చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మహిళలజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 225 పరుగులు చేసింది. ఫర్గానా హక్, షమీమా బ్యాటింగ్‌లో రాణించారు. బంగ్లాదేశ్ ఓపెనర్ ఫర్గానా హక్(160 బంతుల్లో 7 ఫోర్లు 107) సెంచరీతో చెలరేగగా.. మరో ఓపెనర్ షమీమా సుల్తానా(78 బంతుల్లో 5 ఫోర్లతో 52) అర్ధ సెంచరీతో రాణించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా రెండు వికెట్లు తీయగా.. దేవికా వైద్యకు ఒక వికెట్ దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 49.3 ఓవర్లలో 225 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధానా(85 బంతుల్లో 5 ఫోర్లతో 59), హర్లీన్ డియోల్(108 బంతుల్లో 9 ఫోర్లతో 77) అర్ధ సెంచరీలతో రాణించగా.. జెమీమా రోడ్రిగ్స్(45బంతుల్లో 33నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడింది. చివర్లో టెయిలెండర్లు సాయంతో గెలుపు తీరాలకు చేర్చినా ప్రయోజనం లేకపోయింది. బంగ్లా బౌలర్లో నహిదా అక్తర్(3/37) మూడు వికెట్లు తీయగా.. మరుఫా అక్తర్ రెండు వికెట్లు పడగొట్టారు. సుల్తానా ఖాటున్, రాబెయ ఖాన్, ఫహిమా ఖాటున్ తలో వికెట్ తీసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్లీన్ డియోల్‌కు, సిరీస్ ఫర్గానా హక్‌కు లభించాయి.

టైటిల్‌కు మెట్టు దూరంలో చిరాగ్-సాత్విక్ జోడి

- తొలిసారి కొరియా ఓపెన్ ఫైనల్లో ప్రవేశం



సియెల్: భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్‌కు చేరువైంది. ప్రతిష్టాత్మక కొరియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో చైనాకు చెందిన రెండో సీడ్. లియాంగ్ వీ కెంగ్-వాంగ్ చాంగ్‌పై వరుససెట్లలో గెలుపొందింది. 40 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన సాత్విక్-చిరాగ్ 21-15 24-22తో విజయం సాధించారు. తొలిసెట్‌లో ఆరు గేమ్ పాయింట్లు సాధించిన భారత ద్వయం రెండో సెట్‌లోనూ జోరు కొనసాగించింది. దాంతో, చైనా జోడీపై హ్యాట్రిక్ ఓటమి నుంచి తప్పించుకుంది.

ఇటీవల జరిగిన ఇండోనేషియా ఓపెన్ టైటిల్ నెగ్గిన భారత తొలి డబుల్స్ ద్వయంగా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. మరో సెమీస్‌లో ఇండోనేషియాకు చెందిన టాప్‌సీడ్ ఫజర్ అల్ఫేన్, మహ్మద్ రియాన్ జోడీ 17-21, 21-16, 21-18తో కొరియా జోడీని ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి 2వ సీడ్ అన్-సే-యంగ్(కొరియా), టైజు-యింగ్(చైనీస్ తైపీ), పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి 4వ సీడ్ లో- కియాన్-వుయ్ (సింగపూర్), అంటోన్సెన్ (డెన్మార్క్) ప్రవేశించారు.



మరో టైటిల్‌పై కన్నేసిన కుర్రాళ్లు

- నేడు పాకిస్తాన్-ఎ ఫైనల్
- ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్

మధ్యాహ్నం 2.00గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

కొలంబో: ఎసిసి ఎమర్జింగ్ ఆసియాకప్ ఫైనల్లో మరో ఉత్కంఠ సమరం జరగనుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్-ఎ జట్టు పాకిస్తాన్-ఎతో తలపడనుంది. లీగ్ దశలో సునాయాసంగా పాకిస్తాన్-ఎను ఓడించిన భారత్.. సెమీస్‌లో బంగ్లాదేశ్-ఎపై గెలిచేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. సెమీస్‌లో ఎదురైన సవాళ్లను ఎలా అధిగమించిందో అదే ప్రతిభనూ ఫైనల్లోనూ కనబర్చాల్సిన అవసరమెంతైనా ఉంది. బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీస్‌లో భారత్ 211పరుగులే చేసినా బంగ్లాదేశ్‌ను 160పరుగులకు కట్టడి చేసిన తీరు అమోఘం.

మరోవైపు పాకిస్తాన్ జట్టు శ్రీలంకపై భారీస్కోర్ చేసి దుర్భేధ్యఫామ్‌లో ఉంది. ఆ జట్టు శ్రీలంక-ఎపై 322పరుగులు చేసింది. ఆ జట్టుపై 60పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. ఈ క్రమంలో పాక్ జట్టును ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఇక భారత్-ఎ జట్టు టైటిల్‌ను సాధిస్తే రికార్డుస్థాయిలో 8వ సారి చేజిక్కించుకున్నట్లవుతుంది.

నవచిత్రం



సంజయ్ రావు, ప్రణవి మానుకొండ

ఆద్యంతం వినోదభరితం

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్టైన్మెంట్ లాంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయబోతోంది. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించారు. బ్రహ్మాజీ, సప్తగిరి కీలక పాత్రల్లో నటించిన ఈ నెల 29న రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'ట్రైలర్ రిలీజ్ తర్వాత సినిమా మీద అంచనాలు బాగా పెరిగాయి. మ్యారేజ్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఓ కొత్త పాయింట్‌ను చూపెట్టడం ఆసక్తిని కలిగించింది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కావడంతో సకుటుం బంగా ప్రేక్షకులు ఈ సినిమా మీద ఇంట్రెస్ట్‌తో ఉన్నారు. సినిమా సక్సెస్ మీద చాలా కాన్ఫిడెన్స్‌తో ఉన్నాం' అని నిర్మాతలు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి చెప్పారు.

కథ విన్నప్పుడే ఈ విజయాన్ని ఊహించా..

మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్‌కేఎన్ నిర్మించిన చిత్రం 'బేబీ'. ఈ చిత్రానికి సాయి రాజేష్ దర్శకత్వం వహించారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం విశేష ప్రేక్షకాదరణతో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సినిమా సక్సెస్ సాధించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ మీడియాతో ముచ్చటించారు.

'కమెడియన్ సినిమాలకు మ్యూజిక్ చేశావంటూ నా మీద ముద్ర వేశారు. ఆఫర్లు సరిగ్గా రాలేదు. ఇండిపెండెంట్ మ్యూజిక్ చేయాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. అలా ఇండిపెండెంట్ మ్యూజిక్ చేస్తూ కాకినాడలో ఉన్న నాకు దర్శకుడు సాయి రాజేష్ ఆన్‌లైన్‌లో కథ వినిపించారు. ఈ కథ విన్నప్పుడే ఇది కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందని అనుకున్నా. 'ప్రేమిస్తున్నా' పాటను రెండు మూడు రోజుల్లోనే పూర్తి చేశాను. మెలోడీ పాటను చేయగలిగితే.. ఏ పాటనైనా కంపోజ్ చేయగలమని నా నమ్మకం. మాస్ పాటలోనైనా మెలోడీ ఉంటేనే ఎక్కువ రోజులు గుర్తుంటుందని నా అభిప్రాయం. సాంగ్స్ కంపోజ్‌కు ఎక్కువ రోజులు పట్టలేదు. 'ఓ రెండు మేఘాలిలా' అనే పాటను కూడా చాలా ఫాస్ట్‌గానే కంప్లీట్ చేశాం. ప్రతీ పాటలో మెలోడీ ఉంటుంది. అందుకే బ్యాక్ గ్రౌండ్‌లో కూడా ఆ పాటల ట్యూన్‌నే వాడాం. సాంగ్స్ రిలీజ్ అయినప్పుడే కొన్ని ఆఫర్లు వచ్చాయి. కానీ సినిమా రిలీజ్ అయ్యాక చూద్దామని అన్నాను. ఇప్పుడు పెద్ద ప్రొడక్షన్ కంపెనీల నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయి. నా మ్యూజిక్‌కు అల్లు అరవింద్, అల్లు అర్జున్ ఇచ్చిన కాంప్లిమెంట్స్ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. విజయ్ దేవరకొండ చెప్పిన మాటలు, నాని మెసెజ్ నాకు స్పెషల్. నాకు నాని, పవన్ కళ్యాణ్‌తో కలిసి పని చేయాలని ఉంది' అని తెలిపారు.



విజయ్ బుల్గానిన్


మా నమ్మకం నిజమైంది



రాజేష్ దండా

శ్రీవిష్ణు హీరోగా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'సామజవరగమన'.. అనిల్ సుంకర సమర్పణలో హాస్య మూవీస్ బ్యానర్‌పై ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి ఫన్ టాస్టిక్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని తాజాగా రూ.50కోట్ల మార్క్‌ని దాటి, శ్రీ విష్ణు కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో నిర్మాత రాజేష్ దండా మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమా ఇంత పెద్ద విజయం సాధించి రూ.50కోట్ల క్లబ్‌లోకి వెళ్ళడం ఆశ్చర్యపరిచింది. వినోదం, ఫ్యామిలీ ఆడియన్స్‌ని దృష్టిలో పెట్టుకొని చేసిన సినిమా ఇది. 'నువ్వు నాకు నచ్చావ్, గీత గోవిందం' లాంటి స్క్రిప్ట్ అని నమ్మకం పెట్టుకున్నాం. మా నమ్మకం నిజమైంది. ఇది నాలుగో వారం. నాలుగో వారంలో కూడా థియేటర్‌లో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఒక చిన్న సినిమా ముప్ఫై రోజులు థియేటర్స్‌లో ఆడటం చాలా పెద్ద విజయం. అలాగే యుఎస్ లో ఈ సినిమా 1 మిలియన్ సాధించింది. ఈ సినిమాకి ప్రీమియర్స్ చాలా హెల్ప్ అయ్యాయి.ఈ సినిమాని అన్ని భాషల నుంచి రీమేక్ కోసం అడుగుతున్నారు. తమిళంలో మేమే ప్రొడక్షన్ చేయాలని అనుకుంటున్నాం' అని అన్నారు.

గీ సారి దసరా జోర్దారుంటది




బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'భగవంత్ కేసరి'. ఈ సినిమా దసరా సెలవుల్లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉంది. ఈ చిత్రం అక్టోబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ శనివారం అధికారికంగా ప్రకటించారు.

'ఆయుధ పూజతో గీ సారి దసరా జోర్దారుంటది' అంటూ.. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు.

ఈ పోస్టర్‌లో బాలకృష్ణ నడిచే వాల్కనో లా ఉన్నారు. రెండు చేతుల్లో రెండు గన్స్‌తో ఫెరోషియస్‌గా నడుచుకుంటూ వస్తున్నట్లు కనిపించారు. యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమాలో హై యాక్షన్ ఉంటుంది. అనిల్ రావిపూడి మార్క్ మంచి వినోదం, కుటుంబ భావోద్వేగాలు కూడా ఉంటాయి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, శ్రీలీల, అర్జున్ రాంపాల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

'బాలకృష్ణ, అనిల్‌రావిపూడి కాంబినేషన్‌లో సినిమా కావడంతో ఈ సినిమాపై సహజంగానే అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలను రెట్టింపు చేస్తూ రిలీజ్ డేట్ పోస్టర్ ఉండటం ఆనందంగా ఉంది. ఈ సినిమా అటు ప్రేక్షకులు, ఇటు బాలయ్య అభిమానులను కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుంది. అనిల్‌రావిపూడి తన దైన మార్క్ వినోదం, యాక్షన్‌తో బాలయ్యను సరికొత్తగా సిల్వర్‌స్క్రీన్‌పై ప్రజెంట్ చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఉన్న చిత్రమిది' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, నిర్మాతలు: సాహు గారపాటి, హరీష్ పెద్ది, సంగీతం: ఎస్ తమన్, డీవోపీ: సి.రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మి రాజు, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, ఫైట్స్: వి.వెంకట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.కృష్ణ.



పవన్‌కళ్యాణ్ · సాయి ధరమ్ తేజ్

ట్రైలర్ శాంపిల్ మాత్రమే..

పవన్ కళ్యాణ్-సాయి ధరమ్ తేజ్ ద్వయం మొదటిసారి కలిసి నటిస్తున్న చిత్రం 'బ్రో'. ఈ సినిమా కోసం జీ స్టూడియోస్‌తో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ చేతులు కలిపింది. సముద్రఖని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించిన ఈ సినిమా ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ట్రైలర్‌ను ఒకేసారి రెండు చోట్ల రిలీజ్ చేశారు. వైజాగ్‌లోని జగదాంబ థియేటర్‌లో, హైదరాబాద్‌లోని దేవి థియేటర్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానుల సమక్షంలో ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుకల్లో సాయి ధరమ్ తేజ్, కేతిక శర్మ, సముద్రఖని, తమన్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ జగదాంబ థియేటర్‌లో జరిగిన వేడుకలో సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ, 'మీ ప్రేమ పొందటం కోసమే ఇంత దూరం వచ్చాను. మీ అందరికీ ట్రైలర్ నచ్చడం సంతోషంగా ఉంది' అన్నారు. ట్రైలర్ మిమ్మల్ని ఎంతగా అలరించిందో, దానికి వంద రెట్లు సినిమా అలరిస్తుందని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ చెప్పారు. హైదరాబాద్ దేవి థియేటర్‌లో జరిగిన వేడుకలో సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ, 'చాలా మంచి సినిమా ఇది. సినిమా ఫలితం పట్ల చాలా నమ్మకంగా ఉన్నాం. మీరు దేవుడిగా భావించే పవన్ కళ్యాణ్ దేవుడిగా నటించిన సినిమా ఇది. ఖచ్చితంగా ఘన విజయం సాధిస్తుంది' అని అన్నారు.

ఈ సినిమా కోసం అందరిలాగే ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, కుటుంబంతో కలిసి థియేటర్‌కి వెళ్లి ఆనందించదగ్గ చిత్రమిదని కథానాయిక కేతిక శర్మ చెప్పారు. ట్రైలర్ కేవలం శాంపిల్ మాత్రమే అని, సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉంటాయని, పవన్ కళ్యాణ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారని సంగీత దర్శకుడు తమన్ అన్నారు.

ఈనెల 28న ప్రేక్షకుల కోసం వినోదభరితమైన విందు ఎదురుచూస్తుందనడంలో సందేహం లేదు. ఈ సినిమాలో టైటిల్ పాత్రధారి(బ్రో)గా పవన్ కళ్యాణ్ కనిపిస్తుండగా, మార్క్ అకా మార్కండేయులుగా సాయి ధరమ్ కనిపిస్తారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు

అశ్విన్ బాబు హీరోగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో శ్రీ విఘ్నేష్ కార్తీక్ సినిమాస్ బ్యానర్ పై గంగపట్నం శ్రీధర్ నిర్మించిన చిత్రం 'హిడింబ'. నందితా శ్వేత కథానాయికగా నటించింది. ఎకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో శుక్రవారం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలై, బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది.



ఈ నేపథ్యంలో చిత్ర బృందం 'థ్యాంక్యూ మీట్'ని నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, "హిడింబ'ని పెద్ద విజయం వైపు తీసుకువెళుతున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమా విషయంలో మేము అనుకున్నవన్నీ జరిగాయి. బిజినెస్ అయ్యింది. డిస్ట్రిబ్యూటర్స్ చాలా హ్యాపీగా ఉన్నారు. ఈ వర్షంలో కూడా అందరూ థియేటర్స్‌కి వచ్చి సినిమా చూసి సూపర్ హిట్ అని చెప్పడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. 'ఈ సినిమా అందరికీ గొప్పగా రీచ్ అయ్యింది. సినిమా చూసిన ప్రేక్షకులు చాలా మంచి రెస్పాన్స్ ఇస్తున్నారు' అని నాయిక నందిత శ్వేతా అన్నారు.

దర్శకుడు అనిల్ కన్నెగంటి మాట్లాడుతూ, 'గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయినప్పటికీ ఈ వర్షాలని తట్టుకుని, మొన్న సెకెండ్ షో నుంచి మెల్లగా గ్రోత్ మొదలైంది. రెండు రోజులకి మూడు కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. దాదాపు 70 శాతం బ్రేక్ ఈవెన్‌లో ఉన్నారు. వర్షాలు లేకపోతే ఈ రోజు, రేపు బ్రేక్ ఈవెన్ స్టేజ్‌కి వచ్చి అందరూ లాభపడాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు' అని నిర్మాత గంగపట్నం శ్రీధర్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నవతెలంగాణ

ప్రాణాలు కాపాడుతున్న ఆరోగ్య మహిళ

- ప్రారంభంలోనే క్యాన్సర్ నిర్ధారణ
- దాదాపు ఐదు శాతం మందిలో రకరకాల క్యాన్సర్ల గుర్తింపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రోగాలను ప్రారంభంలోనే గుర్తిస్తే చికిత్స కూడా సులువుగా చేయొచ్చు. దీంతో వైద్యఖర్చులు తప్పడమే కాకుండా సంక్లిష్ట పరిస్థితులు, ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడొచ్చు. ముఖ్యంగా మహిళలను వేధిస్తున్న పలు రకాల జబ్బుల విషయంలో ముందుగానే నిర్ధారించి వారిని అప్రమత్తం చేసి, చికిత్స అందించేందుకు వైద్యారోగ్యశాఖ ప్రతి మంగళవారం చేపడుతున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నది. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా లాంఛనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం దాదాపు 20 వారాలుగా (ప్రతి మంగళవారం) మహిళలకు పలు రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తున్నది. ముందుగా 24 జిల్లాల్లో 100 పరీక్షా కేంద్రాలను ప్రారంభించారు. జూన్ 14న మిగిలిన తొమ్మిది జిల్లాల్లో 172 కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 272 మహిళా ఆరోగ్య క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చారు.

ఆయా క్లినిక్కుల ద్వారా ఇప్పటి వరకు 1,85,492 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించారు. సగటున ప్రతి వారం ఓపీకి 65 మంది వస్తుండగా, అందులో 25 మందికి టెస్టులు చేస్తున్నారు. ఈ లెక్కన 46,813 మందికి పరీక్షలు చేసి అందులో 11,064 మంది మహిళలను పెద్దాస్పత్రులకు చికిత్స కోసం రెఫర్ చేశారు. నోటి క్యాన్సర్‌కు సంబంధించి 1,42,868 మందిలో ఐదుగురు (0.6 శాతం), రొమ్ము క్యాన్సర్ 1,41,226 మందిలో 26 మంది (రెండు శాతం), గర్భాశయ కేన్సర్ 33,579 మందిని పరీక్షించగా వారిలో 26 మంది (1.9 శాతం) మందికి వ్యాధి నిర్ధారణ అయింది. క్యాన్సర్ పాజిటివ్ నిర్ధారణ అయిన మహిళలకు మరింత అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు.

ఆరోగ్య మహిళ క్లినిక్కుల్లో అందుతున్న సేవలివే...

1, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు

2, ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్..

3, థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం. అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డి పరీక్షలు చేసి చికిత్స, మందులు అందజేస్తారు.

4, మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు చేస్తారు.

5, మెనోపాజ్ దశకు సంబంధించి పరీక్షల అనంతరం అవసరమైన వారికి హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ చేయడంతోపాటు కౌన్సిలింగ్‌తో అవగాహన కలిగిస్తారు.

6, నెలసరి సమస్యలపై పరీక్షలు చేసి వైద్యం అందిస్తారు. సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి అవగాహన కలిగించడం, అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు.

7, సెక్స్ సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు చేసి అవగాహన కలిగిస్తారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తారు.

8, బరువు నియంత్రణ, యోగా, వ్యాయామం వంటివాటిపై అవగాహన కలిగిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలని
మంత్రి హరీశ్ రావు పిలుపు

మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఆరోగ్య మహిళ క్లినిక్కులను సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. వ్యాధుల నిర్ధారణతో పాటు, అవసరమైన వైద్యం అందిస్తున్న ఈ కార్యక్రమం మహిళల సమగ్ర ఆరోగ్య సంరక్షణ దిశగా సాగుతున్నదని తెలిపారు.

ఏడాదిలో పది లక్షల ఉద్యోగాలు భర్తీ

- జాతీయస్థాయిలో 4 శాతం, తెలంగాణలో 7.5 శాతం నిరుద్యోగం :కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖూబా
- హైదరాబాద్ రోజ్‌గార్ మేళాలో 135 మందికి ఉద్యోగ నియామక పత్రాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవినీతికి తావులేకుండా ఏడాదిలో పది లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తున్నదని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖూబా అన్నారు. అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న విధానాల వల్ల జాతీయ స్థాయిలో నిరుద్యోగం గణనీయంగా నాలుగు శాతానికి తగ్గిందని చెప్పారు. అయితే తెలంగాణలో మాత్రం 7.5 శాతం నిరుద్యోగం ఉందన్నారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో 135 మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఎయిమ్స్, పవర్ గ్రిడ్, ఎల్ఐసీ, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు, బ్యాంక్ ఆఫ్ బరోడా లాంటి ప్రభుత్వ సంస్థల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన యువత ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్‌లోనే నిరుద్యోగం తక్కువగా ఉందని చెప్పారు. ఇక్కడ నిరుద్యోగం 3.3 శాతమేనని వివరించారు. తొమ్మిదేండ్లలో చేపట్టిన పారదర్శక విధానాల ద్వారా జీడీపీ 7.5 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్యోల్బణం 4.2 శాతానికి తగ్గిందని అన్నారు. తొమ్మిదేండ్లలో పేదల జీవితాలు మెరుగుపడ్డాయని చెప్పారు. 15 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖపైకి వచ్చారని వివరించారు. ముద్రా యోజన ద్వారా 40 కోట్ల మందికి రుణాలు వచ్చాయనీ, అందులో మహిళలే ఎక్కువగా ఉన్నారని అన్నారు. నాలుగు కోట్ల మంది పేదలకు ఇండ్లు, 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించామని చెప్పారు. పేదల జన్‌ధన్ ఖాతాల్లో రూ.1.90 కోట్లు జమ అయ్యాయని వివరించారు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా పేదలకు ఇస్తున్న ప్రతి రూపాయీ వారికే అందుతోందని అన్నారు. ఏ దేశంలో లేని విధంగా భారత్‌లో 92 కోట్ల మంది 18 నుంచి 59 ఏండ్ల మధ్య ప్రజలున్నారని చెప్పారు. మానవ వనరులను గరిష్టంగా ఉపయోగించుకుంటూ 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, కమిషనర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్లు

- ఉన్నత విద్యలో 5శాతం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ట్రై క్రీడా పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండు శాతం, ఉన్నత విద్యనభ్యసించడానికి 5శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేలా చర్యలు చేపడుతున్నట్టు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) సహకారంతో ఈ నెల 24న మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, తెలంగాణ స్కేటింగ్ అసోసియేషన్, తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో 'ట్రై క్రీడా వేడుక-2023'ను నిర్వహిచనున్నా ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మెన్ అంజనేయగౌడ్‌తో కలిసి మంత్రి శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 17వేల గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 50 శాతం మైదానాల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఒకే రోజు మూడు క్రీడలను సైక్లింగ్, స్కేటింగ్, రెజ్లింగ్‌లను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. క్రీడల అభివృద్ధికి విశేషంగా కషి చేస్తున్న కోచ్‌ల ఉద్యోగ సర్వీసు క్రమబద్ధీకరణకు కషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగదీష్‌యాదవ్, కార్యదర్శి ప్రేమ్‌రాజ్, వెటరన్ క్రీడాకారులు మర్రిలక్ష్మారెడ్డి, గడ్డం శ్రీనివాస్ యాదవ్, నికత్ జరీన్ తండ్రి జమిల్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ విమానాశ్రయంలో రూ.10 కోట్ల విదేశీ కరెన్సీ పట్టివేత



ఢిల్లీ: ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు భారీగా విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ చరిత్రలోనే తొలిసారిగా రూ.10 కోట్ల విలువైన విదేశీ నోట్లను పట్టుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు తజికిస్థాన్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. లగేజీలో ఉంచిన బూట్లలో విదేశీ కరెన్సీని దాచి ఉంచినట్లు సమాచారం. నిందితులు ఇస్తాంబుల్‌కు విమానం ఎక్కేందుకు వెళ్తుండగా అధికారులు అడ్డుకున్నారు. వారి బ్యాగేజీని చెక్ చేయగా.. కట్టల కొద్దీ నోట్లు బయటపడ్డాయి. వాటిని లెక్కించగా.. రూ.10.6 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కస్టమ్స్ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నామని, విచారణ జరుగుతోందని చెప్పింది. భారతదేశంలోని ఓ విమానాశ్రయంలో తొలిసారిగా ఇంత పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. అధికారులు అదుపులోకి తీసుకున్న ముగ్గురిలో ఓ మైనర్ కూడా ఉన్నాడని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

మణిపూర్‌లో మారణహోమం ఆపాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్
- నేడు, రేపు జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిరసనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మణిపూర్‌లో ఆదివాసీలు, మహిళలపై జరుగుతున్న హత్యలు, లైంగికదాడులను తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ సరిహద్దుల్లో అత్యంత కీలకమైన మణిపూర్‌లో గత 80 రోజులుగా జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణలను తక్షణమే నివారించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలపై లైంగికదాడులు, హత్యలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. కుకీ ఆదివాసీలు, మైదాన ప్రాంత మైతీలకు మధ్య జరుగుతున్న ఘర్షణలకు ఆజ్యం పోసి చోద్యం చూస్తున్న కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా ఆది, సోమవారాల్లో జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సామాజిక స్పృహ కలిగిన ఉపాధ్యాయులంతా ఈ ప్రదర్శనల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

శాంతి భద్రతలను కాపాడాలి : టీపీటీఎఫ్

మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగిక దాడి చెయ్యడాన్ని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) తీవ్రంగా ఖండించింది. మణిపూర్ ప్రజల మధ్య జాతుల చిచ్చు రగిలించిన కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలపై హింస, లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలోనూ, మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడటంలోనూ కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. కాంగ్‌పోక్సీలో మహిళలపై అమానుషకాండకు కారకులైన, సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డ నేరస్తులందరినీ తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రేక్షక పాత్ర వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడి మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడాలని కోరారు.

మానవ మృగాలను శిక్షించాలి : టీఎస్‌పీటీఏ

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడికి పాల్పడిన మానవ మృగాలను తీవ్రంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌పీటీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సౌకత్‌అలీ, పి రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మారణహోమంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను శిక్షించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి రాజారామ్‌సింగ్‌పై పీడీ కేసు నమోదు

- 339 బాటిళ్ల హర్యానా మద్యాన్ని
- స్వాధీనం చేసుకున్న అబ్కారీశాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హర్యానా రాష్ట్రానికి చెందిన 339 అక్రమ మద్యం బాటిళ్లతో పట్టుబడిన రాజారామ్‌సింగ్(జార్ఖండ్‌కు చెందిన) పై పీడీ కేసు నమోదు చేసినట్టు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో హర్యానాకు చెందిన 339 బాటిళ్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బదీసి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారిపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టి అక్రమ మద్యం నివారించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అక్రమంగా మద్యాన్ని సరఫరా చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై పీడీ యాక్టు కేసులను నమోదు చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని నివారణంచేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దులను కట్టుదిట్టం చేశామని తెలిపారు. ఎయిర్ పోర్టు, రైల్వే, బస్సు, ఇతర ప్రజా రవాణ, పార్సల్ సర్వీసులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ హాళ్లు, మ్యారేజ్ హాళ్లల్లో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం సరఫరా కాకుండా సంబంధిత యజమానులు కట్టుదిట్టంగా వ్యవహరించాలని కోరారు. ఈవెంట్ కంపెనీల నిర్వాహకులు సైతం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యానికి అడ్డుకట్టవేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలను ఉల్లంగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తుల వివరాలను అందించాలని కోరారు. సమర్థవంతంగా పనిచేయడంతోపాటు అక్రమ మద్యాన్ని అరికట్టే వారికి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు అందజేస్తామని మంత్రి వెల్లడించారు.. ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్‌ను ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ మహమ్మద్ ముషారఫ్ ఫరూఖీ, అదనపు కమిషనర్ అజయ్‌రావు జాయింట్ కమిషనర్ శాస్త్రి, సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) పవన్‌కుమార్, ఏఈఎస్ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తెగల నిర్మూలనకు బీజేపీ కుట్ర

- అడవిని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకే ఆదివాసీలపై ఆర్ఎస్ఎస్ దాడి : టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్
- మణిపూర్ కి సంఘీభావంగా ఆదివాసీల నిరసన ప్రదర్శన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్‌లో ఆదివాసీలపై కొనసాగుతున్న అనైతిక, లైంగిక దాడులను నివారించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు.

శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలో 'మణిపూర్' ఘటనలను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదనీ, హింసను ఆపే ప్రయత్నం కూడా చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన కులాలను ఉద్దేశ పూర్వకంగానే మణిపూర్ స్థానిక ఆదివాసీలపై బీజేపీ సర్కారు ఉసిగొల్పిందన్నారు. ప్రధాని మోడీ, బీజేపీ నాయకత్వం మౌనం వహించడం వల్లే పరోక్షంగా అల్లరి మూకలకు బలం చేకూరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలపై దాడులు చేసి, వారిని అడవులనుంచి ఖాళీ చేయించి, ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పె కుట్రలో భాగంగానే అక్కడి గిరిజనులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర బీజేపీ ప్రభుత్వం జోక్యం చేసుకుని దాడులు నిలువరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తోడసం భీం రావు, బండారు రవి కుమార్, మెస్రం రాజు, ఆత్రం తనుష్, పొలం రాజేందర్, బైరి సోమేశ్, కోట శ్రీనివాస్, ఎర్మా పున్నం రాష్ట్ర కమిటీ సభ్యులు గొంది రాజేష్, భాగాల రాజన్న, ఉయిక విష్ణు కోరేంగా మాలశ్రీ, ఆత్రం కిష్టన్న మాడవి నాగోరావ్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం.. 17 మంది మతి



ధాకా: బంగ్లాదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. భండారియా ఉపజిల్లా నుంచి ఫిరోజ్‌పూర్‌కు వెళ్తున్న బస్సు స్థానిక యూనియన్ పరిషత్ కార్యాలయం సమీపంలో ఉదయం ఆటో రిక్షాకు సైడ్ ఇస్తుండగా.. డ్రైవర్ చక్రాల నియంత్రణ కోల్పోవడంతో చెరువులో పడిపోయిందని ఝలకతి సదర్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి నసీర్ ఉద్దీన్ తెలిపారు. ఈ ప్రమాదంలో కనీసం 35 మంది ప్రయాణికులు గాయపడగా, వారిని ఝలకతి జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక అగ్నిమాపక సిబ్బంది బస్సును జలదిగ్బంధం నుంచి వెలికి తీశారు. బస్సులో 60 నుంచి 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ జహీరుల్ ఇస్లాం ప్రకారం.. రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలం నుంచి 13 మతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిలో ఐదుగురిని బరిషల్‌లోని షేర్-ఎ-బంగ్లా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఆరుగురు మతి

అన్నమయ్య: ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు- లారీ ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు మతి చెందారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలంలో చోటు చేసుకుంది. ప్రమాదంలో ఎనిమిది మంది గాయడగా.. వారిని రాజంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి కడప వెళ్తున్నది. ఈ తరుణంలో పుల్లంపేట మండలంలో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మతులకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సంఘటనా స్థలం క్షతగాత్రుల హాహాకారాలతో దద్దరిల్లింది.

సచిన్‌ను మించిన బ్యాటర్‌గా కోహ్లి రికార్డు..!



ముంబయి : సచిన్‌ను అధిగమించిన ఏకైక బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ రికార్డు సాధించారు. విండీస్‌తో తొలి టెస్టులో సెంచరీ మిస్ చేసుకున్న భారత మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ... రెండో టెస్టులో అదరహో అనిపించారు..! సచిన్ తన సుదీర్ఘ కెరీర్‌లో 664 మ్యాచులు ఆడారు. ఇందులో వంద శతకాలు, 201 వికెట్లు ఉన్నాయి. అయితే విరాట్ తన 500వ మ్యాచ్‌లో సెంచరీ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డు సఅష్టించారు. విరాట్ కంటే ముందు మరో తొమ్మిది మంది ఆటగాళ్ల మాత్రమే 500 మ్యాచ్‌ల క్లబ్‌లో ఉన్నారు. భారత ఆటగాళ్ల ముగ్గురు ఉన్నారు. కానీ వారెవరూ తమ మైలురాయి మ్యాచ్‌లో సెంచరీ సాధించలేదు. ఆ ఘనత విరాట్ కే దక్కింది. సచిన్ 35 పరుగులు, ధోనీ 32బి (టీ20), రాహుల్ ద్రవిడ్ కేవలం రెండు పరుగులు మాత్రమే చేయడం గమనార్హం.

రెగెట్టా సెయిలింగ్ చాంపియన్ ఏకలవ్య బాతం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రతిష్టాత్మకమైన మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్ షిప్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఏకలవ్య బాతం అండర్-15 ఆప్టిమిస్టిక్ బాలుర విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. గోవాకు చెందిన శరణ్య జాదవ్, గజ్జి అజయ్ రజతం, కాంస్యం కోసం పోటీపడుతున్నారు. ఈ టోర్నీలో ఏకలవ్య బాతం శనివారం జరిగిన రెండు రేసుల్లోనూ అగ్రస్థానం సాధించాడు. దాంతో 11 రేసుల తర్వాత 15 పాయింట్లతో నిలిచి, మరో రేసు మిగిలుండగానే మాన్‌సూన్ రెగట్టా ట్రోఫీతో పాటు ఎస్‌హెచ్ బాబు మెమోరియల్ ట్రోఫీని కూడా గెలుచుకున్నారు. తెలంగాణ సెయిలర్ దీక్షిత కొమరవెల్లి 52 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. రెండు పాయింట్ల అంతరాన్ని తగ్గించిన మధ్యప్రదేశ్‌కు చెందిన షాగున్ ఝా (55) స్వర్ణ పతక బరిలోకి వచ్చింది. అండర్ 19 మిక్స్ డ్ ఇంటర్నేషనల్ క్లాస్ విభాగంలో తెలంగాణ జంట ధరణి లావేటి, వడ్ల మహేష్ (16 పాయింట్లు) 10, 11వ రేసుల్లో నిరాశ పరిచారు. మధ్యప్రదేశ్‌కు చెందిన నాన్సీ, అనిరాజ్ సెంధవ్ జంట (18 పాయింట్లు) రెండు పాయింట్ల అంతరాన్ని తగ్గించి రెండో స్థానంలో ఉన్నారు. నాన్సీ చేసిన ఫిర్యాదుతో అంతర్జాతీయ జ్యూరీ 10వ రేసులో ధరణి, మహేష్ జంటను అనర్హులుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అండర్ 19 మిక్స్‌డ్ క్లాస్, అండర్ 15 బాలికల క్లాస్‌లో తెలంగాణ, ఎన్ఎస్ఎస్ మధ్యప్రదేశ్ సెయిలర్ల మధ్య ఆఖరి 12వ రేసు ఆదివారం రసవత్తరంగా జరగనుంది. ఈ రేసును సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి సారిన్ జెండా ఊపి ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానోత్సవానికి ఏవీఎస్ఎం, వీఎస్ఎం అడ్మిరల్, చీఫ్ ఆఫ్ పర్సనల్ ఇండియన్ నేవీ కృష్ణ స్వామినాథన్ అధ్యక్షత వహిస్తారు.

జాత్యాహంకార హింస పట్ల ఐలూ ఖండన

మణిపూర్ ఘటన పట్ల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న హింసాకాండను తక్షణమే నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అక్కడ జరుగుతున్న జాత్యాహంకార హింసను ఖండించింది. ఈ మేరకు శనివారం ఐలూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సత్యనారాయణ, కె.పార్థసారథి, గౌరవ అధ్యక్షులు జి.విద్యాసాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మణిపూర్‌లోని పరిస్థితిని పరిశీలించి అక్కడి ఆస్తి నష్టంతో పాటు ప్రార్థనా స్థలాలను సందర్శించి సంఘీభావం తెలిపేందుకు వీలుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్కడి రాష్ట్ర పోలీసులు, ఇతరులు చేసిన లైంగిక దాడులకు సంబంధించిన అన్ని కేసులను విచారించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణ ఉపశమనం కలిగేలా, బాధితులు వారి ఇండ్లకు, గ్రామాలకు క్షేమంగా చేరేలా భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు

కిసాన్ సర్కార్‌తోనే.. ప్రజల జీవితాల్లో సంపూర్ణ క్రాంతి: సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కిసాన్ సర్కార్ తోనే దేశ ప్రజల జీవితాల్లో సంపూర్ణ క్రాంతి వస్తుందని బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ తెలిపారు. మహారాష్ట్రలోని వేర్వేరు ప్రాంతాల రాజకీయ నేతలు, పలు మార్కెట్ కమిటీలు, సహకార బ్యాంకుల మాజీ ఛైర్మెన్లు, మాజీ వైస్ ఛైర్మెన్లు సీఎం కేసీఆర్ సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో పార్టీలో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ప్రాంతాలకు, రాష్ట్రాలకు అనుగుణంగా దేశ పాలకులు నిర్ణయాలు తీసుకోనంత వరకూ అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించడానికి వీలుగా తెలంగాణలో ఎంతో కష్టపడి విధానాలను రూపొందించామని వివరించారు. వీటిని మహారాష్ట్ర సహా దేశవ్యాప్తంగా అమలు చేస్తామని, రైతు సంక్షేమం కోసమే బీఆర్ఎస్ కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు.

ఎంపీ రంజిత్ రెడ్డి కషితో వికారాబాద్ రైల్వే బ్రిడ్జి మంజూరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ప్రత్యేక కషి కారణంగా వికారాబాద్ కొత్త రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.96 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం మంజూరు చేసింది. ఆ నిధుల మంజూరుకు సంబంధించిన జీవో కాపీలను ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి స్వయంగా సీఎం కేసీఆర్, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు అందజేశారు. తమ ప్రాంత ప్రజలకు సంబంధించిన నాలుగు దశాబ్దాల కల నెరవేర్చినందుకు కేసీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున సహకారం లభిస్తోందని ఎంపీ రంజిత్‌రెడ్డి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

ఇద్దరు మహిళలను కొట్టి అర్ధనగ్నంగా ఊరేగింపు

కొల్‌కతా : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై దేశవ్యాప్తంగా పెల్లుబికిన ఆగ్రహావేశాలు చల్లారకముందే పశ్చిమ బెంగాల్‌లోనూ అలాంటి ఘటనే జరిగింది. ఇద్దరు మహిళలను చావబాది అర్ధనగ్నంగా ఊరేగించారు. మల్దాలోని పకౌహట్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. మూడు నాలుగు రోజుల క్రితం ఈ ఘటన జరిగింది. దొంగతనానికి పాల్పడ్డారన్న అనుమానంతో ఇద్దరు మహిళలను పట్టుకున్న స్థానికులు వారిని ఈడ్చిపడేసి దాడిచేశారు. వారిలో ఎక్కువమంది మహిళలే కావడం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. వీడియో వెలుగులోకి వచ్చిన తర్వాతే విషయం గురించి తెలిసిందన్నారు. బాధిత మహిళలు ఇద్దరూ దొంగతనం చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. దొరికిన మహిళలపై స్థానిక మహిళా వ్యాపారులు దాడిచేసినట్టు తెలిపారు. ఆ తర్వాత బాధిత మహిళలు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయినట్టు పేర్కొన్నారు. దొంగతనంపై వ్యాపారులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. దర్యాప్తు అనంతరం నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చార్లీ చాప్లిన్ కుమార్తె కన్నుమూత..

కాలిఫోర్నియా: ప్రపంచ దిగ్గజ హాస్యనటుడు, నవ్వుల రేడు చార్లీచాప్లిన్ కుమార్తె, నటి జోసెఫిన్ చాప్లిన్ కన్నుమూశారు. ఆమె వయసు 74 సంవత్సరాలు. ఆమె కుటుంబ సభ్యులు చెబుతున్న దాని ప్రకారం ఈ నెల 13న పారిస్‌లో ఆమె మతి చెందారు. 28 మార్చి 1949న కాలిఫోర్నియాలోని శాంటా మోనికాలో జోసెఫిన్ జన్మించారు. చార్లీ చాప్లిన్-ఊనా ఓ నీల్ దంపతుల 8 మంది సంతానంలో ఆమె మూడో వారు. 1952లో తన తండ్రి సినిమా 'లైమ్‌లైట్'తో చిన్న వయసులోనే తెరంగేట్రం చేశారు. 1972లో అవార్డు విన్నింగ్ సినిమా 'పీర్ పావలో పాసోలిని'తోపాటు మరెన్నో సినిమాల్లో దిగ్గజ నటులతో కలిసి నటించారు.

బిజినెస్

మెఘా - బివైడి డీల్‌కు కేంద్రం షాక్

- పెట్టుబడుల అనుమతికి నిరాకరణ
- రూ.8వేల కోట్ల ఒప్పందానికి నీళ్లు..!



హైదరాబాద్ : నగర కేంద్రంగా పని చేస్తోన్న మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్), చైనీస్ ఆటోమేకర్ బివైడి మోటార్స్‌తో కలిసి ఏర్పాటు చేయాలనకున్న తయారీ ప్లాంట్‌కు కేంద్రం ఎర్ర జెండా చూపింది. బివైడి సంస్థ ఒక్క బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8వేల కోట్ల పైనా) పెట్టుబడులతో హైదరాబాద్‌లో విద్యుత్ కార్లు, బ్యాటరీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని భావించింది. ఇందుకోసం ఎంఇఐఎల్‌తో కలిసి డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి)కి ప్రతిపాదిత దరఖాస్తును సమర్పించాయి. దీని అనుమతులకు కేంద్రం నిరాకరించిందని ఇటి ఓ కథనంలో వెల్లడించింది. భారత్‌లో చైనా పెట్టుబడుల గురించి భద్రతా పరమైన ఆందోళన కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌లో మూడు విద్యుత్ ఎస్‌యువి, ఇ6 విద్యుత్ వాహనాల విక్రయాలను బివైడి కలిగి ఉంది. ఈ ఏడాదిలోనే తన మొదటి ఎలక్ట్రిక్ వాహనాన్ని కూడా విడుదల చేసింది. భారత్‌తో సరిహద్దు పంచుకుంటున్న దేశాల నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి చేస్తూ 2020లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తీసుకొచ్చింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద తయారీ ప్లాంట్‌ను భారత్‌లో ఏర్పాటు చేయనున్నామని బివైడి ఇంతక్రితం ప్రకటించింది. ఈ ప్రతిపాదనతో దిగ్గజ టెస్లాతో పోటీ పడాలని భావించింది. భారత్‌తో ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ఏడాదికి 10,000 -15వేల యూనిట్ల అమ్మకాలు చేపట్టాలని భావించింది. కానీ.. తాజా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం బివైడి, ఎంఇఐఎల్ సంస్థలను తీవ్ర నిరాశకు గురి చేసిందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.9,648 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 39.7 శాతం వృద్ధితో రూ.9,648 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 38 శాతం పెరిగి రూ.18,227 కోట్లుగా నమోదయ్యింది. మొండి బాకీల కోసం రూ.1,292 కోట్ల కేటాయింపులు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఇందుకోసం రూ.1,144 కోట్ల కేటాయింపులు జరిగాయి. 2023 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.76 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం త్రైమాసికంలో జిఎన్‌పిఎ 2.81 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తులు 0.70 శాతం నుంచి 0.48 శాతానికి తగ్గాయి. గడిచిన త్రైమాసికంలో రూ.1,169 కోట్ల జిఎన్‌పిఎలను రద్దు చేసింది. గడిచిన త్రైమాసికంలో ఐసిఐసిఐ బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 17.9 శాతం పెరిగి రూ.12,38,737 కోట్లకు చేరగా.. దేశీయ రుణాల జారీ పోర్టుపోలియో 20.6 శాతం వృద్ధితో రూ.10,25,310 కోట్లకు చేరాయి.

పిఎస్‌బిలకు రికార్డ్ లాభాలు

- ప్రధాని మోడీ వెల్లడి

ముంబయి : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు (పిఎస్‌బి) ఒకప్పుడు భారీ నష్టాలు, ఎన్‌పిఎల్లో ఉండగా.. ప్రస్తుతం రికార్డ్ లాభాలను నమోదు చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. యుపిఎ హయంలో స్కామ్‌లతో బ్యాంకింగ్ రంగాన్ని నాశనం చేశారన్నారు. ప్రస్తుతం బ్యాంక్‌లు ఆరోగ్యకరంగా మారాయన్నారు. వర్చువల్‌గా 70,000 మందికి పైగా నియామకాల లేఖలను అందించిన తర్వాత రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి మోడీ మాట్లాడారు. తమ హయంలో పెద్ద సంఖ్యలో బ్యాంకింగ్ రంగంలో ఉపాధి పొందారన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ వెన్ను విరిచేలా గత ప్రభుత్వ హయాంలో బ్యాంకింగ్ కుంభకోణాలు జరిగాయన్నారు. కొంతమంది శక్తివంతమైన నాయకులు, కుటుంబాలకు ఇష్టమైన వారికి వేల కోట్ల రూపాయల రుణాలు ఇచ్చారన్నారు. ఆ రుణాలు ఎప్పటికీ తిరిగి చెల్లించబడవని అన్నారు. తమ ప్రభుత్వం, బ్యాంకుల నిర్వహణను బలోపేతం చేయడం, చిన్న బ్యాంకులను విలీనం చేయడం తదితర చర్యలు చేపట్టిందన్నారు. ముద్ర పథకం కింద పేదలు, అసంఘటిత రంగాలకు రుణాల ద్వారా సహాయం చేయడానికి, మహిళా స్వయం సహాయక బృందాలకు మద్దతు ఇవ్వడానికి బ్యాంకింగ్ రంగ ఉద్యోగులు కష్టపడి, ప్రజలకు సేవ చేయడంలో నిబద్ధతతో పని చేస్తున్నారని అన్నారు.

యెస్ బ్యాంక్ ఎన్‌ఐఐలో 8% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని యెస్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) పెరిగడంతో ఆ బ్యాంక్ లాభాల్లోనూ వృద్ధి చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10.3 శాతం వృద్ధితో రూ.343 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.311 కోట్ల లాభాలు ప్రకటించింది. క్రితం క్యూ1లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.7,584 కోట్లకు చేరింది. గతేడాది ఇదే క్యూ1లో రూ.5,876 కోట్ల ఆదాయం చోటు చేసుకుంది. ఇదే సమయంలో బ్యాంక్ వడ్డీపై ఆదాయం రూ,5,135 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ1లో 6,443 కోట్లుగా చోటు చేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 1 శాతానికి తగ్గాయి. 2022 ఇదే జూన్ త్రైమాసికంలో నికర ఎన్‌పిఎలు 4.2 శాతంగా ఉన్నాయి.

తెలంగాణలో ఉనికి బలోపేతంపై దృష్టి

- కామధేను ఉత్పత్తి సామర్థ్యం పెంపు..!

హైదరాబాద్ : తెలంగాణలో తమ మార్కెట్ వాటాను పెంచుకోవడంపై కామధేను దృష్టి సారించింది. ఇందుకోసం ఆ కంపెనీ తయారు చేసి విక్రయించే టిఎంటి బార్స్ ఉత్పత్తిని పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. కంపెనీ తన ప్రీమియం బ్రాండ్ 'కామధేను ఎస్‌ఎక్స్‌టి' ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని యోచిస్తోన్నట్లు పేర్కొంది. తదుపరి తరం హైఎండ్ ఇంటర్‌లాక్ స్టీల్ టిఎంటి బార్ 3.0 లక్షల మెట్రిక్ టన్నుల ప్రీమియం బార్‌లను 3.6 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుకోనున్నట్లు పేర్కొంది. అమ్మకాలను బలోపేతం చేసుకోవడానికి ఏడాదిలో మరో 100 మంది డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లను జోడించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కామధేను లిమిటెడ్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 350 మంది డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు.

నెల్లూరులో విషాదం.. ప్రభుత్వాస్పత్రిలో ఆరుగురు మృతి

నెల్లూరు : నెల్లూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ప్రభుత్వాసుపత్రిలోనివార్డులో ఒకేరోజు ఆరుగురు మృతి చెందారు. మృతికిగల కారణాలు తెలియరాలేదు.. ఆక్సిజన్ అందక చనిపోయారని మతుల బంధువులు ఆరోపిస్తూండగా..వైద్యులు మాత్రం ఆక్సిజన్ సరఫరాలో ఇబ్బంది లేదని అనారోగ్యంతోనే మతి చెందారని తెలుపుతున్నారు. వారి మతిపై విచారణ జరిపిస్తామన్నారు.

ఆక్సిజన్ కొరతపై ప్రచారాన్ని ఖండించిన వైద్యులు

ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ కొరతపై దుష్ప్రచారాన్ని సూపరిండెంట్ సిద్ధా నాయక్ ఖండించారు. ఆస్పత్రిలో ఎలాంటి ఆక్సిజన్ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించేవరకు వెనక్కి తగ్గం

గ్రామ పంచాయతీ కార్మికులు కొనసాగుతున్న సమ్మె

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని గ్రామ పంచాయతీ కార్మికులు స్పష్టం చేశారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా శనివారం కూడా కొనసాగింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీకార్మికులు చేపట్టిన సమ్మెకు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. గ్రామపంచాయతీ రాష్ట్ర స్థాయి జేఏసీ నాయకులతో కలిసి గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో జాయింట్ చర్చలు జరిపామన్నారు. త్వరలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి జీపీ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. గరిడేపల్లి మండలంలో జీపీ కార్మికులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. భువనగిరి మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో సమ్మెకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చర్చలకు పిలిచినట్టే పిలిచి సీఎస్ అమెరికాకు వెళ్లారని, ఆమె వచ్చాక చర్చలు జరుపుతామని, సమ్మె మాత్రం విరమించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమతో చర్చలు జరిగే వరకూ సమ్మె కొనసాగుతుందని తెలిపారు.ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ముదిగొండలో నిరసన వ్యక్త చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో జీపీ కార్మికులు బిక్షాటన చేసిన నిరసన తెలిపారు. అశ్వారావుపేటలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.5000 అందజేశారు. ఇల్లందులో ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సంఘీభావం తెలిపారు.



నాలాల ఆక్రమణలపై కఠిన చర్యలు

- వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు
- హుస్సేన్‌సాగర్‌ను పరిశీలించిన మంత్రి తలసాని
- జీహెచ్‌ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ, డీఆర్‌ఎఫ్ బృందాలకు అభినందన



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాలు తగ్గాక నాలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామనిపశుసంవర్థక, మత్స్య, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు హైదరాబాద్‌లో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. నిండు కుండలా ఉన్న హుస్సేన్‌సాగర్‌ను శనివారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర వాసులకు వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు 428 ఎమర్జెన్సీ బృందాలు 24 గంటలు పని చేస్తున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, డీఆర్‌ఎఫ్ మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు సమన్వయంతో పని చేయడంతో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదన్నారు. చిన్న చిన్న సమస్యలు ఎదురైనా తక్షణమే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. 24 గంటలపాటు పని చేసే విధంగా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, ఈవీడీఎం బుద్ధభవన్‌లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామన్నారు. వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎప్పటికప్పుడూ సమీక్ష చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో నాలాపై అక్రమ నిర్మాణాలు ఉండటం మూలంగా ముంపు ఏర్పడిందని చెప్పారు. ఆ ప్రాంతంలో కూడా ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా ఎమర్జెన్సీ బృందాలు డీఆర్‌ఎఫ్, పోలీస్ శాఖ అహర్నిశలూ కష్టపడ్డాయన్నారు. వారందరికీ అభినందనలు తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత నాలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రసూల్ పుర, మినిస్టర్ రోడ్, ముషీరాబాద్‌లో నిర్మించిన బ్రిడ్జిల వల్ల అనేక ప్రాంతాలు జలమయం కాలేదన్నారు. ఎస్‌ఎన్‌డిపి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. మరో రెండ్రోజులు వర్షాలు ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం హుస్సేన్‌సాగర్ కాలువ నీటి ఉధృతిని కవాడిగూడ (భాగ్య లక్ష్మి టెంపుల్) వద్ద, అశోక్ నగర్ వద్ద మంత్రి పరిశీలించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఇంజినీర్ ఇన్ చీఫ్ జియా ఉద్దీన్, లేక్ సీఈ సురేష్ కుమార్, ఎస్‌ఈ ఆనంద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి హుసేన్‌సాగర్ ఎఫ్.టి.ఎల్ లెవెల్, విడుదల చేస్తున్న నీటిని హోటల్ మారియెట్ నుంచి మంత్రి తలసాని పరిశీలించారు.

పాముకాటుతో తండ్రీ కొడుకు మృతి

- ఆస్పత్రికి వెళ్లకుండా కట్టు కట్టుకున్న వైనం.

నవతెలంగాణ-రాజంపేట్



పాటుకాటు వేసిన వెంటనే ఆస్పత్రికి వెళ్లకుండా కట్టు కట్టుకుని వదిలేయడంతో తండ్రీకొడుకు మృతిచెందారు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలోని షేర్‌శంకర్ తండాలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ముద్రిచ రవి(40) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శుక్రవారం వ్యవసాయ పనులు చేసి వచ్చి రాత్రి భోజనం చేసి పడుకున్నారు. రాత్రి 11:30 సమయంలో రవికి పాము కాటు వేయడంతో మెలకువ వచ్చింది. పామును చంపేసి.. దేవుడు పేరు మీద కట్టు కట్టుకున్నాడు. ఆ తర్వాత వారి కొడుకు వినోద్(11) చాతిలో నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పాడు. కొద్దిసేపట్లోనే బాలుడు మృతిచెందాడు. తదనంతరం తనకు కండ్లు తిరుగుతున్నాయని రవి చెప్పడంతో వెంటనే అంబులెన్స్ ద్వారా కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి మృతిచెందాడు. పాము కాటు వేసినట్టు తెలియగానే.. ఆస్పత్రికి వెళ్తే ప్రాణాపాయం తప్పేదని స్థానికులు అన్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాజు తెలిపారు.

8 లక్షల మందిని బలిగొన్న క్యాన్సర్

- దేశంలో పెరుగుతున్న కేసులు
- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ : భారత్‌లో క్యాన్సర్ మహమ్మారి గతేడాది 8 లక్షల మందిని బలిగొన్నది. క్యాన్సర్ కేసులు భారత్‌లో రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలిపింది. కేంద్రం పొందుపర్చిన సమాచారం ప్రకారం.. 2020 నుంచి 69,000 కేసులు పెరగడంతో 2022లో 14.61 లక్షల మందికి పైగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. అయితే, పంజాబ్‌లో మాత్రం పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఇక్కడ క్యాన్సర్ మరణాలు పెరుగుతున్నాయి. గతేడాది క్యాన్సర్‌తో బాధపడుతున్నవారి సంఖ్య 40,435గా ఉన్నది. వీరిలో 23,301 మంది రోగులు మరణించటం గమనార్హం. 2021లో పంజాబ్‌లో క్యాన్సర్ మరణాల సంఖ్య 22,786గా ఉన్నది. పొరుగున ఉన్న హర్యానా, రాజస్థాన్‌లలో గతేడాది మరణాల సంఖ్య వరుసగా 16,997 మరియు 41,167గా నమోదయ్యాయి.యూపీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, బీహార్, మధ్యప్రదేశ్‌లు క్యాన్సర్ మహమ్మారి కారణంగా ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఐసీఎంఆర్-నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ రిపోర్ట్ ప్రకారం.. 2022లో భారతదేశంలో క్యాన్సర్ కేసుల సంఖ్య (0-14 వయస్సు గలవారు) 35,017గా ఉన్నది. మౌలిక సదుపాయాలకు సంబంధించి తీసుకున్న చర్యల విషయంలో మంత్రిత్వ శాఖ 19 రాష్ట్ర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, 20 తృతీయ కేర్ కేన్సర్ సెంటర్‌లను ఆమోదించినట్టు తెలిపింది. అయితే, ఇందులో ఇప్పటివరకు 17 ఇన్‌స్టిట్యూట్‌లు మాత్రమే పని చేస్తుండటం గమనార్హం.

ప్రధాని వ్యాఖ్యలపై రాజస్థాన్ సీఎం గరంగరం

జైపూర్ : మణిపూర్‌లో మాత్రమే కాదు.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ శాంతిభద్రతలు ఘోరంగా దెబ్బతింటున్నాయని గురువారం పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రాజస్థాన్ సీఎం అశోక్‌గెహ్లాట్ మోడీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం జైపూర్‌లో అశోక్‌గెహ్లాట్ తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'మొట్టమొదటిసారిగా నేను చెప్పదలచుకున్నది.. ఎన్నికల కోసం కర్ణాటక, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో ప్రధాని మోడీ పర్యటించడం చూశాను. కానీ మణిపూర్‌లో పర్యటించడం చూడలేదు. మణిపూర్‌లో ఉన్నది ఆయన ప్రభుత్వమే. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నట్లయితే ఆయన ఏం మాట్లాడతారో ఒక్కసారి ఊహించుకోండి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌ల సీఎంలు తమ రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిస్థితి చూసుకోవాలని ప్రధాని నరేంద్రమోడీ గురువారం చెప్పిన తీరు రాజస్థాన్ ప్రజల మనోభావాలను దెబ్బతీసింది.' అని ఆయన అన్నారు. ఈసందర్భంగా ప్రధాని మోడీ మణిపూర్‌లో పర్యటించలేకపోతే ఆ రాష్ట్ర పరిస్థితిని సమీక్షించి సమావేశం ఏర్పాటు చేసి ఉండాల్సిందని గెహ్లాట్ సూచించారు.

ప్రభుత్వంపై విమర్శలు.. రాజస్థాన్‌లో మంత్రిపై వేటు

సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేసిన మంత్రికి రాజస్థాన్ సర్కారు షాక్ ఇచ్చింది. పదవి నుంచి తప్పిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మంత్రిగా పలు శాఖల బాధ్యతలు చూస్తున్న రాజేంద్ర గుఢా తన పదవిని కోల్పోయారు.

ఘోర రోడ్డుప్రమాదం..

- బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు,కొడుకు మతి


మెదక్ : మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నార్సింగి మండలం వల్లూరు జాతీయ రహదారిపై టైరు పేలిపోవడంతో అదుపుతప్పిన కారు.. డివైడర్ దాటి అవతలికి వెళ్లింది. దీంతో ఎదురుగా వస్తున్న లారీ దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బీఆర్‌ఎస్ నార్సింగి మండలం మాజీ అధ్యక్షుడు తౌర్య నాయక్, ఆయన కుమారుడు అంకిత్ అక్కడికక్కడే మతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మతదేహాలు కారులో ఇరుక్కుపోవడంతో క్రేన్ సహాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ దవాఖానకు తరలించారు. కాగా, తౌర్యా నాయక్ గతంలో నార్సింగి మండలం బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదేవిధంగా వ్యవసాయ ప్రాథమిక సహకారం సంఘం చైర్మన్‌గా, నర్సంపల్లి ఎంపీటీసీగా కూడా ఎన్నికయ్యారు. టైరు పగలడంతోనే కారు ప్రమాదానికి గురైందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఊరేగింపు సందర్భంగా ఉమ్మి వేశారని..!

ఉజ్జయినిలో ముగ్గురు ముస్లిం యువకుల అరెస్టు...వారి ఇండ్లు కూల్చివేత

ఉజ్జయిని : 'మహాకాల్ కీ సవారీ' ఊరేగింపు వెళుతుండగా ఉమ్మి వేసినట్లు ఆరోపించి ముగ్గురు ముస్లిం యువకులను అరెస్టు చేసిన సంఘటన మధ్య ప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో జరిగింది. అనంతరం ఆ ముగ్గురి ఇళ్లను ధ్వంసం చేసి కూల్చివేశారు. ఇందుకు సంబంధించి జులై 17న ఉజ్జయిని నగరంలోని ఛాత్రి చౌక్ ఏరియాలో తీసిన రెండు వేర్వేరు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ముస్లిం యువకుల అరెస్టుకు దారి తీశాయి. ఊరేగింపులో పాల్గొన్న యువకులే ఈ వీడియోలు తీశారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు కాగా, మూడో వ్యక్తికి 18ఏళ్లు. ఆ వ్యక్తుల ఇళ్ల కూల్చివేత సందర్భంగా డ్రమ్ములు, డిజె మ్యూజిక్‌లతో హోరెత్తించారు. 'బుల్డోజర్ న్యాయం' పేరుతో జరుగుతున్న సంఘటనల జాబితాలో ఇదొక కొత్త చేరిక. ఆ ముగ్గురు గుర్తు తెలియని నిందితులపై ఐపిసిలోని వివిధ విభాగాల కింద ఖరకువా పోలీసు స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. మత భావాలను దెబ్బతీసేందుకు ఉద్దేశ్యపూర్వకంగా చర్యలు చేపట్టడం, ఆరాధనా స్థలంలో నేరాలు, మత పరమైన సమావేశాలను కల్లోలపరచడం వంటి అభియోగాలను మోపారు. ఇండోర్ వాసి మసూమ్ జైస్వాల్ తన ఫోన్‌లో ఈ మొత్తం సంఘటనను రికార్డు చేశాడని ఫిర్యాదీదారుడు సావన్ లాట్ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నాడు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. నిందితుల్లో ఇద్దరి అంకుల్ అయిన అక్బర్ హుస్సేన్‌తో ది వైర్ మాట్లాడింది. కూల్చివేసిన ఆ ఇంట్లోనే వీరి కుటుంబం కూడా నివసిస్తోంది. తమ పిల్లలు ఉమ్మి వేశారని అనడాన్ని ఆయన తోసిపుచ్చారు. ప్రతి ఏటా ఊరేగింపులు జరుగుతాయని, వాటిని తాము ఆనందంగా స్వాగతిస్తామని చెప్పారు. అసలు ఊరేగింపుపై ఉమ్మి వేస్తున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపించడం లేదని చెప్పారు. పిల్లలు చాలా చిన్నవారని, వారికేమీ తెలియదని అన్నారు. ఊరేగింపు సందర్భంగా అన్ని దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారని, తాము లోపల విశ్రాంతి తీసుకుంటుండగా పిల్లలు పక్క భవనంపై టెర్రస్‌మీద ఆడుకుంటున్నారని చెప్పారు. ఊరేగింపులోని కొంతమంది పోలీసు స్టేషన్ వద్ద నిరసన చేయడం చూశామని కానీ అవేమీ పట్టించుకోకుండా ఊరేగింపు అయిన తర్వాత సాధారణంగానే తమ దుకాణాలు తెరిచామని చెప్పారు. తమ ఇంటికి దగ్గర్లోనే పోలీసు స్టేషన్ వుందని, అక్కడి వారంతా తెలుసునని, అక్కడ నినాదాలు, నిరసనలు జరగడం కూడా సాధారణమేనని చెప్పారు. అయితే తమ పిల్లలను పోలీసు అధికారి పిలిచారని చెప్పగానే ఏదో చిన్నగా మందలించి పంపేస్తారనే భావనతో వెనక ఎవరూ లేకుండానే పిల్లలను స్టేషన్‌కు పంపామని హుస్సేన్ చెప్పారు. అయితే పోలీసు స్టేషన్‌లో పరిస్థితి భయంకరంగా వుందన్నారు. తమ పిల్లలను కస్టడీలోకి తీసుకున్నారని తెలియగానే దుకాణాలు మూసివేసి వెళ్లామని చెప్పారు. వారికి బెయిల్ కూడా ఇవ్వలేదన్నారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత 19న హుస్సేన్ ఇంటిని జిల్లా పాలనా యంత్రాంగం కూల్చివేసింది. ఆ ఇల్లు అక్రమ నిర్మాణమని అందుకే కూల్చివేస్తున్నామని 18న నోటీసు ఇచ్చారు. ఆ నోటీసులో 'అక్రమ నిర్మాణం' అని రాసిన చోట 'ప్రమాదకరమైన భవనం' అని మార్చారు. కేవలం అరగంట వ్యవధి ఇచ్చి కూల్చివేశారని, ఇంట్లో సామాను తీసుకోవడానికి ఆ సమయం సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. అయినా తమదిచట్టబద్ధంగానే కట్టిన ఇల్లంటూ అన్ని అవసరమైన పత్రాలు, అనుమతులు చూపించామన్నారు.

మహారాష్ట్రలో వర్షాలు, వరదలకు 72 మంది మృతి..



ముంబయి: మహారాష్ట్రలో కొన్ని రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇప్పటివరకు 72 మంది మరణించారు. భారత వాతావరణ శాఖ జూలై 21న థానే, రాయ్‌గఢ్, పూణే, పాల్ఘర్‌లకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ముంబై, రత్నగిరికి కూడా అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. కొల్హాపూర్ జిల్లాకు కూడా రాబోయే 5 రోజుల పాటు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. థానే, పాల్ఘర్, రాయ్‌ఘడ్, రత్నగిరి, కొల్హాపూర్, సాంగ్లీలలో కుండపోత వర్షాలను ఎదుర్కోవడానికి యన్ డీ ఆర్ ఎఫ్ బందాలు ఇప్పటికే మోహరించాయి.

రాయ్‌గఢ్‌లో ఇంకా దొరకని 86 మంది ఆచూకీ

మహారాష్ట్ర రాజధాని ముంబయిని భారీ వర్షాలు ముంచెత్తాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల రహదారులు నదులను తలపించాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు రాయ్‌గఢ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 22కు చేరింది. ఇంకా 86 మంది ఆచూకీ తెలియరాలేదు. వారి కోసం ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

వ్యవస్థీకృత నేరాల నిరోధంపై దృష్టిని కేంద్రీకరించండి

- అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలకు డీజీపీ ఆదేశాలు
- పోలీసున్నతాధికారులతో అర్థ సంవత్సర క్రైమ్ రివ్యూను నిర్వహించిన అంజనీకుమార్



నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాల నిరోధంపై ప్రధానంగా దృష్టిని సారించాలని అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లను రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈ అర్థ సంవత్సరంలో చోటు చేసుకున్న నేరాలపై ఆయన పోలీసున్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాదితో పోలిస్తే ఈ అర్థ సంవత్సరం రాష్ట్రంలో నేరాల సంఖ్య కొంతమేరకు తగ్గిందని అన్నారు. అయితే, సైబర్ నేరాలతో పాటు ఇతర వ్యవస్థీకృత నేరాల నిరోధం పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాల్సినవసరం ఉన్నదని ఆయన తెలిపారు. ముఖ్యంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నమోదు చేసిన కేసుల దర్యాప్తును సాగించాలని ఆయన సూచించారు. నమోదైన కేసులలో నిందితులకు కోర్టులలో కచ్చితంగా శిక్షలు పడేలా చేసినపుడే దర్యాప్తు సాకారమైనట్టుగా భావించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో గతేడాది 55 కేసులలో నేరస్థులకు యావజ్జీవ శిక్షలు పడేలా చూశామనీ, ఈ ఏడాది ఇప్పటి వరకు 85 మంది నేరస్థులకు యావజ్జీవ శిక్షలు పడేలా దర్యాప్తులు సాగటం మంచి ఫలితాన్ని చేకూర్చినట్టయిందన్నారు. కేసుల దర్యాప్తులలో అవసరమైన సహాయ, సహకారాలందించటానికి ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్ సలహా బృందాన్ని రాష్ట్ర స్థాయిలో నియమించటం జరిగిందనీ, దాని సహకారాన్ని తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ షికా గోయెల్ మాట్లాడుతూ.. ఈ జనవరి నెలలోనే ఆపరేషన్ ముస్కాన్ ద్వారా తప్పిపోయిన 1700 మంది పిల్లలను గుర్తించటం జరిగిందనీ, ఇందులో పిల్లలకు సంబంధించి నేరాలకు పాల్పడ్డవారిపై 310 ఎఫ్‌ఐఆర్‌లను కూడా దాఖలు చేయటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్, సీనియర్ అధికారులు సంజయ్ కుమార్ జైన్, ఐజీ షానావాజ్ ఖాసీం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మణిపూర్ మినిట్స్

అక్కడి మందార పూల రంగులన్నీ
మా అక్కల నెత్తుటితో
అద్దిన మెరుగులే...!

అక్కడి వాకిట్లన్ని
మా చెల్లెల కన్నీళ్ళతో
అలకబడినవే....!

అడుగు నేల కోసం
అంటుకున్న మంటలు కావవి..!
పాలకులే ఉత్ప్రేరకాలై
ఉసిగొల్పబడ్డ అల్లర్లే అవి...!



మణిపూర్ ఇప్పుడు
సర్జరీకి నోచుకోలేక
పోస్టుమార్టంకు దగ్గరవుతున్న
రోగి..!
ఏ కృష్ణుడి సాయాన్ని నోచుకోని

ద్రౌపది...!
రామరాజ్యంలో
ఊరేగే శవాల బండిపై
ఎందరో తల్లుల కన్నీళ్ళ
వడపోత...!

అంతా ఆంతమయ్యాక

మణిపూర్ మినిట్స్ అంటూ
ఆ మంటల సెగలను
దేశమంతా వ్యాపితం చేసే
మతోన్మాద పాలకుల చేతుల్లో
ఓట్ల సాగరమైంది...!

– హాధిరామ్ సభావట్



మనం ఎదిగిపోయాం

మనం ఎదిగిపోయాం
నిజమే మనం చాలా ఎదిగిపోయాం ....
చిన్నప్పుడు
చింత చెట్టుకింద ఆడుకునే మనం
నేడు ఆన్‌లైన్‌లో ఆటలు ఆడుకుంటున్నం
చిన్నప్పుడు ఒక్క క్షణం
అమ్మ కనిపించకపోతే ఎడిచిన మనం
నేడు జీవితాంతం వాళ్ళకు దూరంగా
విదేశాల్లో బ్రతుకుతున్నం
సంతోషాన్ని, దుఃఖాన్ని
బంధువులతో పంచుకున్న మనం
నేడు చరవాణిలో
స్టేటస్‌లు రైలు భోగిలా పెంచుతున్నాం
నిజమే మనం చాలా
ఎదిగిపోయాం........

పండుగలతో కళ కళ లాడే పల్లె సీమ
నేడు పట్టణాలకు పయనమైన
తమ పిల్లల రాకకోసం పరుగులు తీస్తుంది
జ్ఞానం నేర్పిన బడి పంతులు ఎదురుపడితే
నేడు యే రా అనే స్థాయికి ఎదిగిపోయాం
నిజమే మనం చాలా ఎదిగిపోయాం.......

ఆడపిల్ల పుడితే
పసి గొంతుల్ని చిదిమేస్తున్న మనం
అదే ఆడ పిల్ల కడుపులో
పురుడు పోసుకున్నం అనే సంగతే మరిచాం
పేదరికంతో
చిరిగిన దుస్తువులను వేసుకున్న మనం
నేడు చిరిగిన దుస్తులతో
ఫ్యాషన్ అనే మైకంలో మునిగిపోయాం
నిజమే మనం చాలా ఎదిగిపోయాం....

కన్నతల్లిని, కట్టుకున్న ఆలిని వదిలేసి
బ్రతుకంతా ధారపోసిన
భారతమ్మ ముద్దుబిడ్డలని వదిలేసి
నేడు సిల్వర్ స్క్రీన్‌లో కనిపిస్తున్న
రీల్ హీరోలను రియల్ హీరోలుగా భావించి
కూటికి గతిలేని తిప్పలను వదిలేసి
కురిమిలో గొప్పల కోసం
రీల్ హీరోలు ఎదగటానికి కారణమవుతూ
మన బతుకులను దిగజార్చుకుంటున్నం
నిజమే మనం చాలా ఎదిగిపోయాం....

– యమ్.మమత

ప్రపంచ యాత్రికుడు

టెక్నాలజీ రోజురోజుకు అభివృద్ధి చెందుతూ అనేక ఆవిష్కరణలకు వేదికవుతున్నది. స్మార్ట్ ఫోన్ చేతికి వచ్చిన తర్వాత ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇంటర్నెట్ వినియోగంతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. అందరికంటే కాస్త భిన్నంగా ఆలోచించేవారు, క్రియేటివిటీ ఉన్న వారు యూట్యూబ్ చానల్ క్రియేట్ చేసుకుని ఆదాయాన్ని సృష్టించుకుంటున్నారు. యూట్యూబ్‌ను ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. విభిన్నమైన కంటెంట్‌తో వీడియోలు చేస్తూ దానికి క్రియేటివిటీ జోడించి మిలియన్ల కొద్ది వ్యూస్‌ను రాబడుతున్నారు. ఇదే కోవలో ప్రపంచ యాత్రికుడిగా పేరొందిన యూట్యూబర్ అవినాష్ ప్రపంచ దేశాలను చుట్టేస్తూ మంచి మంచి వీడియోలు చేస్తూ నెంబర్ వన్ యూట్యూబర్‌గా హిస్టరీ క్రియేట్ చేస్తున్నాడు. లక్షల్లో ఆదాయం ఆర్జిస్తూ ఔరా.. అనిపిస్తున్నాడు. నా అన్వేషణ పేరుతో యూట్యూబ్ చానల్ క్రియేట్ చేసుకుని ప్రపంచ దేశాలను తిరగేస్తున్నాడు. తాజాగా నెల రోజులకు సంబంధించిన యూట్యూబ్ నుంచి ఏకంగా రూ. 30 లక్షలు పొందినట్టు వీడియోలో అవినాష్ స్పష్టం చేశాడు. దాదాపు 85 దేశాలకు పైగా పర్యటించి, అక్కడి విశేషాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నాడు.






ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా భీమిలికి చెందిన అన్వేష్ చిన్ని అనే యూట్యూబర్. ఆఫ్రికాలోని అత్యంత ఎత్తైన పర్వతం అయిన కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించాడు. ఈ పర్వతం టాంజానియాలోని ఈశాన్య ప్రాంతంలో ఉంది. 5,642 మీటర్ల ఎత్తులో ఉన్న శిఖరానికి చేరుకున్న తర్వాత, అతను భారత జాతీయ జెండాను ఎగురవేసి, 'జై జవాన్ జై కిసాన్', 'వందేమాతరం' వంటి నినాదాలతో పాటు జాతీయ గీతాన్ని ఆలపించారు. అన్వేష్ 'నా అన్వేషణ' అనే యూట్యూబ్ ఛానెల్‌ని నడుపుతున్నాడు. అక్కడ అతను ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో తన ప్రయాణాలు, అన్వేషణలకు సంబంధించిన కంటెంట్‌ను పంచుకుంటాడు.

నా అన్వేషణ ఎలా ఉంది?

ఇటీవల యూరోప్‌లోని సెర్బియా పర్యటనలో, తనను తాను "ప్రపంచ యాత్రికుడు" అని పిలుచుకునే తెలుగు యూట్యూబర్‌కు అసాధారణమైన సమస్య ఎదురైంది. 'నా అన్వేషణ' అనే యూట్యూబ్ ఛానెల్‌కు 2,20,000 మంది ఫాలోవర్లు ఉన్న అన్వేష్ ప్రపంచ పర్యటనలో ఉన్నారు. సెర్బియాలోని ఒక హోటల్‌లో ప్రవేశించినప్పుడు అతను నిరంతరాయంగా కాకి దాడికి గురయ్యాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో పోస్ట్ చేసిన ఆ వీడియో 1,00,000 వీక్షణలతో వైరల్‌గా మారింది. పక్షి తరచుగా తనను వెంబడించి దాడికి ప్రయత్నించిందని, తన భద్రత గురించి భయపడుతున్నానని అతను విలపించాడు. "అది నన్ను చంపడానికి ప్రయత్నిస్తోంది. దాని నిరంతర వేటకి నేను భయపడుతున్నాను" అని పెట్టిన వీడియో వైరల్ అయింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు మరింత విస్తృతంగా మారినందున, అన్వేష్ వంటి కంటెంట్ సృష్టికర్తలు వారి వినోదాత్మక, సమాచార వీడియోలతో గణనీయమైన ఫాలోయింగ్‌ను సంపాదించారు. అయితే, కొంతమంది క్రియేటర్‌లు తమ సంబంధాలతో సహా వారి వ్యక్తిగత జీవితాల గురించిన వివరాలను పంచుకుంటుంటారు. మరికొందరు గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతారు. నేడు ప్రపంచానికి సమాంతరంగా మరో వినూత్నమైన ప్రపంచంగా ఇంటర్నెట్ ఉంది. దీనినే మనం వర్చువల్ వరల్డ్ అంటున్నం. ఈ ఆధునిక యుగంలో ఆంతరంగిక స్వేచ్ఛ అన్నది ఒక అభూత కల్పనగా మారే ప్రమాదం ఉంది. సోషల్ మీడియాలో మరెన్నో నెట్‌వర్కింగ్ సైట్లలో ఎన్నో విధాలుగా చాలామంది తమ సమాచారాన్ని చేజేతులారా తామే జారవిడుస్తూ ఆంతరంగిక స్వేచ్ఛను కోల్పోతున్నారు. ఆ తరువాత గగ్గోలు పెడుతున్నారు. కాబట్టి ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు అవసరమే. ఆ గోప్యతను ఇతను పాటించడం అభినందించదగ్గ విషయమే.

క్యూబా విశేషాలు

అన్ని దుకాణాలను ప్రభుత్వమే నిర్వహిస్తోందని, అక్కడ ప్రజలందరూ సమానమే అని చెప్పిన అన్వేష్.. అది కమ్యూనిస్టు దేశం కాబట్టే సాధ్యమైందని తెలిపాడు. ప్రపంచంలో అత్యధిక అక్షరాక్ష్యత గల దేశంగా క్యూబాను మరోసారి తన యూట్యూబ్ ద్వారా పరిచయం చేశాడు. ప్రతి పది మందిలో ఒకరు డాక్టరని... ప్రజారోగ్యంపై వారికుండే శ్రద్ధ గురించి కూడా తెలిపాడు. తక్కు వ ఖర్చుతో అక్కడి ప్రజల జీవనం గురించి తెలిపాడు. చే, ఫెడేల్ కాస్ట్రో మ్యూజియం విశేషాలు తెలియజేశాడు.



వ్యక్తిగత YouTube ఛానెల్‌ల ఆర్థిక వివరాలు పబ్లిక్‌గా అందుబాటులో లేనప్పటికీ, నా అన్వేషణ ఛానెల్ ద్వారా భారీగానే ఆదాయం వస్తున్నట్టు అతడే వెల్లడించాడు. అయితే, YouTube ఛానెల్, కంటెంట్‌ని సృష్టించడం అనేది చాలా సమయం తీసుకునే, శ్రమతో కూడుకున్న ప్రక్రియ అని గమనించడం ముఖ్యం. ఆర్థిక రివార్డులు గణనీయంగా ఉన్నప్పటికీ, అన్వేష్ వంటి కంటెంట్ సృష్టికర్తలు ఆరోగ్యకరమైన పని-జీవిత సమతుల్యతను కొనసాగించడం, ఆన్‌లైన్ కీర్తి ఒత్తిడిని తట్టుకుని నిర్వహించడం వంటి సవాళ్లతో కూడా పోరాడాలి.

శోధించి సాధించు అన్నట్టుగా యూట్యూబర్ అవినాష్ ప్రపంచ దేశాలను చుట్టేస్తూ డిఫరెంట్ కంటెంట్ తో వీడియోలు చేస్తూ లక్షల్లో వ్యూస్ పొందుతున్నాడు. రోజుకో వీడియో చేసి యూట్యూబ్ లో అప్ లోడ్ చేయడానికి ప్రయత్నిస్తుంటాడు. తను అనుకున్నట్లుగానే క్రియేటివ్ కంటెంట్ తో వీడియోలు రూపొందించి యూట్యూబ్ లో అప్ లోడ్ చేస్తాడు. ప్రస్తుతం ఫిజిలో పర్యటిస్తున్నాడు. ఈ రోజుల్లో ఓ యూట్యూబ్ చానల్ కు అంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఆశామాషి వ్యవహారం కాదు. దాని వెనకాల చాలా కృషి ఉంటుంది. యూట్యూబ్ చానల్ ప్రారంభించిన కొత్తలో అంతంతే ఆదాయం వచ్చిందని చెప్పిన ఆయన ఎన్నో ఒడిదుడుకుల తర్వాత లక్షల్లో ఆదాయం సంపాదిస్తు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. యూట్యూబర్లుగా తెలుగులో చాలామందే ఫేమస్ అయ్యారు. కానీ అవినాష్ వారందరికంటే భిన్నమైన మార్గాన్ని ఎంచుకుని సక్సెస్ అయ్యాడు. లక్షల్లో ఆదాయం సంపాదిస్తూ నెంబర్ వన్ తెలుగు యూట్యూబర్ గా హిస్టరీ క్రియేట్ చేస్తున్నాడు.

ఏకంగా దేశ ద్రోహి అనేస్తున్నారు

చైనా టూర్‌లో ఉన్నప్పుడు చేసిన వీడియోస్ ఎంతలా ట్రెండ్ అయ్యాయో తెలిసిందే. ఆ ఫీడ్ బ్యాక్‌తో ఫుల్ ఖుష్ అయిపోయిన అన్వేష్.. పనిలో పనిగా చైనాలోని పాపులర్ ప్లేసెస్‌ని విజిట్ చేసి మరిన్ని క్రేజీ వీడియోస్ చేయాలని ఫిక్స్ అయిపోయాడు. కట్ చేస్తే, చైనా నుండి రిటర్న్ కావాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ తరువాత షేర్ చేసిన వీడియోలో ఇది చైనాలో ఆఖరి వీడియో అని చెప్పాడు. అక్కడి నుండి హాంకాంగ్ వెళ్తున్నానని అన్నాడు. 'బాధపడకండి, మళ్లీ ఎలక్షన్స్ అయిపోయాక వచ్చి, చైనాని దుమ్ము దులిపేద్దాం. ' అంటూ క్లారిటీ ఇవ్వకుండా చెప్పుకొచ్చాడు.

కాగా అన్వేష్ ఇలాంటి సడెన్ డిసిషన్ తీసుకోవడం వెనుక కొన్ని బలమైన రాజకీయ కారణాలున్నాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం చైనాలో చేసిన ఓ వీడియోలో.. అక్కడి యువత జీవన విధానం గురించి చెప్తూ.. మన యువత రాజకీయ నాయకుల వెనుక జెండాలు పట్టుకుని తిరుగుతూ వాళ్లని గొప్పవాళ్లని చేస్తున్నారు తప్ప మీరు ఎదగలేకపోతున్నారు అంటూ పాజిటివ్‌గానే చెప్పాడు. నీతులు చెప్తే తిరిగి బూతులు తిట్టే రోజులు కాబట్టి.. ఈ వీడియో తర్వాత తనకు బెదిరింపులు వస్తున్నాయని, ఏకంగా దేశ ద్రోహి అనేస్తున్నారని స్వయంగా అన్వేష్ చెప్పాడు. కట్ చేస్తే, ఇప్పుడు ఆ బెదిరింపుల కారణంగానే తను టూర్ క్యాన్సిల్ చేసుకున్నాడు!

– మోహన్


ఏడు రంగుల నది



జన్మమర్మం

నడుస్తున్న కాలంమీద కనుబొమ్మలు
బట్టలు ఇప్పుకొని తిర్గుతున్నయి
మాటలను అర్వు దెచ్చుకునెటొళ్ళ సుట్టు
చూపులు శూలాలై పొడుస్తున్నయి
పట్టపగలే సిరి బత్తెలా
మానవత్వం సచ్చిపోయి ఊరేగుతుంది

మనిషన్నంక ఏడ పుడ్తే ఏందిరా
మనిషి జన్మమర్మం తెల్సుక మస్లాలే
ఇమానంగా బత్కెటొళ్ళ మీద
అమానుషంగా గా తల్లులను
అప్పుడే పుట్టిన బిడ్డలను జేసి
ఊరంతా ఊరేగిస్తిరి కదరా
మీరు అమ్మలకే పుట్టింద్రా
గా మనువు గార్చిన జొల్లుకు రాలింద్రా

మట్టిని చెట్టును పూజించే దేశంరా మనది
అమ్మలనే నగ్నంగా నడిబజార్లో
నడిపించే విషసంస్కృతి ఎక్కడిదిరా
కండ్లకు ఎక్కిన కామం నేలకు దిగేదాక
ఒడుపుగా వరిపోట్టులేసి
మీ మగతనాన్ని బూడిద జెయాలే
ఆడతల్లుల జోలికొస్తే
మోడువాడిన చెట్టై బీడు పడాల్సిందేరా..

పేదోళ్ళకు ఆత్మగౌరవమే ఆస్తిపాస్తులు
దానే అంగడి బొమ్మలను జేస్తిరి కదరా
అమానవీయ, అరాచకాలకు చోటిస్తే
మానవత్వం చిరునామా గల్లంతైతది
కండ్లుండి చూపులేని పాలకులారా
హరిజన గిరిజనులను
ఓట్ల సరుకులను చేయకుండిరా
గూటండెబ్బ గుద్దితే
మీ పాలనంతా చిల్లెంపల్లెం ఐతది

– బోల యాదయ్య, 9912206427

కల నిజం చేస్తే కళ

నీవు నిద్దుర లేవలేదని
సూర్యుడు ఉదయించక మానునా
కళ్ళు మూసుకున్నంతన
ప్రపంచం చీకటిమయమవుతుందా!

గడియారపు ముళ్ళు వెనక్కి జరుపుతే
కాలం తిరోగమనం చేస్తుందా
దారిలో అవరోధాలున్నాయని
ప్రయాణం ఆపడం ఆమోదమా!

పడిపోతానేమో అనుకుంటే
పక్షి పైకి ఎగురగలదా
ప్రయత్నం మానుకుండా పనిచేస్తే
ఫలితం చేతికి అందిరాదా!

పై పై చూపులు కాదు
గర్భంలోనే నిధులుంటాయి



చమట చుక్క చిందకుండా
శ్రమ విజయమై నిలుస్తుందా!

నవ్వుతారు జనాలు ఏరుకో
నీ జీవితాన పువ్వులవుతాయి

నిందలు
వేస్తారు కాచుకో
అందలమెక్కడానికి
మెట్లవుతాయి!

నేలమీద పడ్డానని విత్తనం
నిచ్చేతనమైతే మట్టిలో కలుస్తది
చైతన్యంతో మొలకెత్తితే
చెట్టు అయి నిలుస్తుంది!

పూయడం సృష్టి ధర్మం
కాయ అవుతుందో కాదో కాల నిర్ణయం
నిద్దురలో కనేది కల
నిజం చేస్తే అది కళ !

– జగ్గయ్య.జి, 9849525802



కదలవేంది!!


కరగలేదా హృదయం
కలత చెందలేదా నీ మనసు
నీ కాళ్ళకి కట్టిన
సంకెళ్ళని ఇకనైనా తెంచు
ఇంకెన్ని దేహాలు నలగాలి
నీలో చలనం రావాలంటే
ఇంకెన్ని పీకలు కోయబడాలి
నీ గొంతు పెకలాలంటే

ఇంకెంతా మంది వివస్త్రలు కావాలి
నువ్వొక అస్త్రంగా మారాలంటే
భరించడమేనా!!
బెదిరించడం రాదా?
కన్నీళ్లు కార్చడమేనా!!
కదం తొక్కడం రాదా?
ఏడవడమేనా!!
ఎదిరించడం రాదా?
విలపించడమేనా!!
రాళ్లు విసరడం రాదా?
నిన్ను కదలకుండా ఆపింది ఏమిటి?
పరువా!! హు !!
దేహం కూడా పూర్తిగా
తయారు కాకముందే
ఎందరి దాహానికో
బలైన భారతికే లేని పరువు
నీకెందుకు అమ్మ!
కొమ్ములొచ్చినవాడు
నచ్చిన భాగాన్ని పీక్కు తింటుంటే
జీవచ్ఛవంలా పడి ఉన్న

మన మాతృదేశానికే లేని పరువు
నీకెందుకు అమ్మ!!
లే! నువ్వు లే! నువ్వే లే !
వేలెత్తి చూపు
గొంతెత్తి అరువు
రాగమెత్తిపాడు
కొడతారా!
నీ పురిటి నొప్పుల కన్నా
ఏ కొరడా దెబ్బలు నిన్ను భయపెట్టేది?
నీ పొత్తి కడుపు నొప్పి కన్నా
ఏ కత్తిపోటు నిన్ను బాధ పెట్టేది
సంపుతారా!!
చావు పుట్టుకలను నిర్ణయించేదే నువ్వు
నీకు చావంటే భయం ఏందీ?
ఇప్పటికైనా కదులు
ఇంకో చెల్లి చావుని కథలుగా చెప్పక ముందే
కదులు, కదులు.
కదల వేంది!!

– కీర్తి ఇనుగుర్తి

కన్నీటిని రాల్చకు



నాకోసం కన్నీటిని రాల్చకండి
వీలైతే
కొన్ని అక్షరాల ఆమ్లాన్ని జల్లండి
దీనంగా చూస్తున్న
ఈ నాలుగు దిక్కులు అంతమవ్వని..

నా మీద జాలి చూపకండి
కొన్ని
పల్లేరు కాయల్ని నాటండి
రెపొద్దున ఆ దారి గుండా నడిచే
మత రాజకీయాల కాళ్ళను చీల్చని..

నాపై అమాయక స్త్రీ అని
ముద్ర వేయకండి
ఈ నీచ సంస్కృతి, సంప్రదాయాలను
బోధించిన
మత గ్రంథాల, కుల గొంతుకలకు
నిప్పేట్టండి
కాలి బూడిదవ్వని..

నన్ను ఇలానే నడిపించండి
కశ్మీర్ నుండి కన్యాకుమారి దాక
21 వ శతాబ్దపు దేశ నగ్న చరిత్రను
పుటలుపుటలుగా చదివి
కాంద్రించి ఉమ్మనివ్వని..

నా తరపున
న్యాయ దేవతతో మాట్లాడండి
క్రూరత్వం, అనాగరికం, వివక్ష వైపు
గుడ్డిగా వుండొద్దని
కళ్లకున్న గంతలు విప్పండని
ఈ నగ్న దేహం మీది గాట్లను చూడండని..

నాకోసం మరో చిప్కో ఉద్యమానికి
ఊపిరి పోయండి
పచ్చని చెట్లలాంటి మమ్ము హత్తుకోండి
ఏ కాషాయ వస్త్రం కప్పకండని
ఏ కాషాయ సారం గుప్పించొద్దని...

– మహేష్ వేల్పుల

అలోక్ అరాదే మాతృ హైకోర్టు ఏది?



డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002

1. ప్రస్తుతం భారతదేశంలో 150 సం॥లు పూర్తి చేసుకున్న హైకోర్టుల్లో క్రింది వాటిలో గుర్తించండి.
ఎ. అలహాబాదు హైకోర్టు బి. పాట్నా హైకోర్టు
సి. మద్రాసు హైకోర్టు డి. కర్నాటక హైకోర్టు
1. బి,డి 2. ఎ,బి,సి
3. ఎ,సి 4. ఎ,సి,డి

2. తెలంగాణ హైకోర్టు ఆరవ ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాదే అయితే ఇతని మాతృ హైకోర్టు ఏది?
1) కర్ణాటక హైకోర్టు 2) రాజస్థాన్ హైకోర్టు
3) గుజరాత్ హైకోర్టు 4) మధ్యప్రదేశ్ హైకోర్టు

3. భారతదేశంలో తొలిసారిగా కలకత్తా నగరంలోని పోర్టుబ్లేయర్ ప్రాంతంలో తొలి హైకోర్టు ఏర్పాటు కాగా తొలి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
1. పి.బి. చక్రవర్తి 2. సుంబానాద్ పండిత్
3. బార్నెస్ పీకాక్ 4. ఎవరు కాదు.

4. భారత రాజ్యాంగంలో హైకోర్టు గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
1. 212 2. 124
3. 214 4. ఏదికాదు.

5. ప్రస్తుతం భారతదేశంలో 100 సం॥లు పూర్తి చేసుకున్న హైకోర్టులు కింది వాటిలో గుర్తించండి?
1. కర్నాటక హైకోర్టు 2. పాట్నా హైకోర్టు
3. గౌహతి హైకోర్టు 4. 1,2

6. తొలి హైకోర్టు కలకత్తా హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి అయిన తొలి భారతీయుడు?
1. పి.బి. చక్రవర్తి 2. సుంబానాద్ పండిత్
3. బార్నెస్ పీకాక్ 4. చార్లెస్

7. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తొలి హైకోర్టు ఏది?
1. అలహాబాదు హైకోర్టు 2. కలకత్తా హైకోర్టు
3. పాట్నా హైకోర్టు 4. గౌహతి హైకోర్టు

8. తొలి హైకోర్టు కలకత్తా హైకోర్టు ఏ సం॥లో ఏర్పాటయ్యింది?
1. 1884 2. 1862
3. 1866 4. 1894

9. క్రింది ఏ నిబంధన ప్రకారం ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటుకు కలదు?
1. 214 2. 217
3. 231 4. 141

10. హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య నిర్ణయించే అధికారం ఎవరికి వుంది?
1. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 2. పార్లమెంటు
3. రాష్ట్రపతి 4. ప్రధానమంత్రి

11. దేశంలో అత్యధిక న్యాయమూర్తులు కలిగిన హైకోర్టు ఏది?
1. ఉత్తరాఖండ్ హైకోర్టు 2. కలకత్తా హైకోర్టు
3. కర్నాటక హైకోర్టు 4.అలహాబాదు హైకోర్టు

12. హైకోర్టు ప్రధాన మరియు ఇతర న్యాయమూర్తులు తమ రాజీనామాను ఎవరికి సమర్పిస్తారు?
1. గవర్నర్ 2. రాష్ట్రపతి
3. ముఖ్యమంత్రి 4.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

13.హైకోర్టు న్యాయమూర్తుల పదవి విరమణ వయస్సు ఎంత?
1. 60సం.లు 2. 62 సం.లు
3. 65సం.లు 4. ఏది కాదు.

14. అండమాన్ నికోబార్ ఏ హైకోర్టు పరిధిలోకి వస్తుంది?
1. కలకత్తా 2. మద్రాసు
3. ఢిల్లీ 4. ఒడిశా

15. ఢిల్లీ హైకోర్టు ఏ సం॥లో ఏర్పాటయ్యింది?
1. 1965 2. 1961
3. 1966 4. 1952

16. 2000 సం॥లో ఏర్పడిన హైకోర్టులను కింది వాటిలో గుర్తించండి?
ఎ.మేఘాలయ హైకోర్టు బి. త్రిపుర హైకోర్టు
సి. జార్ఖండ్ హైకోర్టు డి. ఉత్తరాఖండ్ హైకోర్టు
1. ఎ,బి,సి 2. ఎ,బి
3. బి,డి 4. సి,డి

17. ప్రస్తుతం దేశంలో మొత్తము హైకోర్టు లసంఖ్య?
1. 23 2. 28
3. 30 4. 25

18. దేశంలో అత్యల్ప న్యాయమూర్తులను కలిగిన హైకోర్టు ఏది?
1. సిక్కిం హైకోర్టు 2. ఉత్తరాఖండ్ హైకోర్టు



3. మణిపూర్ హైకోర్టు 4. త్రిపుర హైకోర్టు

19. దేశంలో అత్యధిక న్యాయమూర్తులు కలిగిన హైకోర్టుల వరుస క్రమం కింది వాటిలో గుర్తించండి.
1. అలహాబాద్ HC , కలకత్తా HC, బాంబే HC, మద్రాసు HC
2. అలహాబాద్ HC, బాంబే HC, పంజాబ్ హర్యానాHC, మద్రాసు HC
3. మద్రాసు HC , బాంబే HC, పంజాబ్ హర్యానా HC, కలకత్తా HC
4. ఏది కాదు.

20. ఢిల్లీ హైకోర్టు గరిష్ట న్యాయమూర్తుల సంఖ్య?
1. 90 2. 70 3. 60 4. 50

21. 2013 సం.లో ఏర్పడిన హైకోర్టులను కింది వాటిలో గుర్తించండి.
ఎ. త్రిపుర హైకోర్టు బి. మణిపూర్ హైకోర్టు
సి. ఛత్తీస్‌ఘడ్ హైకోర్టు డి. ఉత్తరాఖండ్ హైకోర్టు
1. ఎ,సి 2. బి,డి 3. ఎ,బి 4. ఎ,బి,సి

22. దేశంలో ఫాస్టాక్ కోర్టులను ఏ సం.లో ప్రారంభించారు?
1. 2001 2. 2002
3. 2005 4. 2000

23.దేశంలో ఫాస్టాక్ కోర్టులను కింది ఏ ఆర్థిక సంఘం సిఫార్సుట మేరకు ఏర్పాటు చేశారు?
1. 9వ ఆర్థిక సంఘం 2. 11వ ఆర్థిక సంఘం
3. 10వ ఆర్థిక సంఘం 4. 12 వ ఆర్థిక సంఘం

24. భారతదేశంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తొలి మహిళ ఎవరు?
1. లీలాసేథ్ 2. అన్నాచాందీ
3. ఫాతిమాబీబీ 4. మీనాకుమారి

25. దేశంలో గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు చేయాలని సూచించిన కమిటీ ఏది?
1. జె.యస్. వర్మకమిటి
2. బల్వంతరాయ్ మోహతా కమిటీ
3. ఎల్.ఎం. సింఘ్వి కమిటీ 4. డి.ఏ దేశాయ్ కమిటి

26. గ్రామ న్యాయాలయచట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
1. 2 అక్టోబరు 2008 2. 1 జనవరి 2008
3. 26 నవంబరు 2008 4. 2 అక్టోబరు 2009

27. గోవా ఏ హైకోర్టు పరిధిలోకి వస్తుంది?
1. కలకత్తా 2. ముంబాయి
3. మద్రాసు 4. ఏదికాదు.

28.దేశంలో హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేసిన తొలి మహిళ?
1.లీలాసేథ్ 2. అన్నాచాందీ
3. ఫాతిమాబివి 4. మీనాకుమారి

29. జిల్లా సెషన్స్ కోర్టు జడ్జిలను నియమించేది ఎవరు?
1. హైకోర్టు సిజె 2. గవర్నర్
3. రాష్ట్రపతి 4. ముఖ్యమంత్రి

30. భారత రాజ్యాంగంలో హైకోర్టు యొక్క 'కోర్టు ఆఫ్ రికార్డ్స్' గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
1. 214 2. 215
3. 216 4. 217

31.హైకోర్టు జడ్జీలు పదవి విరమణ తర్వాత పెన్షన్ ను ఈ కింది ఏ నిధి నుండి పొందుతారు?
1. రాష్ట్ర సంఘటిత నిధి 2. రాష్ట్ర ఆగంతుక నిధి
3. కేంద్ర సంఘటిత నిధి 4. కేంద్ర ఆగంతుక నిది

32. క్రింది ఏ నిబంధన ప్రకారం హైకోర్టు రిట్లను జారీ చేయగలదు?
1. 222 2. 226 3. 224 4. 227

33.ఒక హైకోర్టు న్యాయమూర్తిని మరో రాష్ట్ర హైకోర్టుకు బదిలీ చేయు అధికారం ఎవరికి కలదు?
1. రాష్ట్రపతి 2. గవర్నర్
3. పార్లమెంటు 4. రాష్ట్ర అసెంబ్లీ

34.ఒక రాష్ట్రంలో హైకోర్టు బెంచ్‌ను అదే రాష్ట్రంలో వేరే నగరంలో ఏర్పాటు చేసే అధికారం ఎవరికి కలదు?
1. రాష్ట్రపతి 2. గవర్నర్ 3. పార్లమెంటు 4. అసెంబ్లీ

35.హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలు గురించి తెలిపే అధికరణ.
1. 226 2. 215 3. 224 4. 222

సమాధానాలు

1.3	2.4	3.3	4.3	5.4	6. 1
7.4	8.2	9. 3	10.3	11.4	12.2
13.2	14.1	15.3	16.4	17.4	18.1
19.2	20.3	21.3	22.4	23.2	24.1
25.4	26.4	27.2	28.2	29.2	30.2
31.3	32.2	33.1	34.3	35.4	

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి 'గ్లోబల్ ఇన్‌క్రెడిబుల్ ఐ.ఎన్.సి. లీడర్ షిప్ అవార్డ్ : కేంద్ర పర్యాటక శాఖామంత్రి జి.కిషన్ రెడ్డిని ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఇన్‌క్రెడిబుల్ ఐ.ఎన్.సి లీడర్ షిప్ అవార్డ్ వరించింది. భారత్ - అమెరికా మధ్య వాణిజ్యం, వ్యాపారం, పీపుల్ టు పీపుల్ ఎక్స్‌చేంజ్ కార్యక్రమాలు నిర్వహించే యూ.ఎస్. ఇండియా ఎస్.ఎం ఈ కౌన్సిల్ అవార్డును కేంద్ర మంత్రికి అందించింది. భారతదేశపు సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు పర్యాటకాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన కృషికి ఈ అవార్డు అందిస్తున్నట్టు తెలిపింది.



వింబుల్డన్ మహిళ సింగిల్స్ విజేత - మర్కెటా వొండ్రు సోవా : వింబుల్డన్ మహిళల సింగిల్స్ లో చెక్ రిపబ్లిక్ కు చెందిన 24 ఏళ్ల మర్కెటా ఒండ్రసోవా చాంపియన్‌గా 'వీనస్ రోజ్‌వాటర్ డిష్' ను అందుకుంది. ఫైనల్లో వొండ్రసోవా 6-4, 6-4 స్కోరుతో ఆరో సీడ్ అన్స్ జబర్ (ట్యునీషియా) పై విజయం సాధించింది. 2019లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచిన వొండ్రుసోవా కు ఇది మొదట గ్రాండ్ స్లామ్ టైటిల్ ట్రెటిక్ సాదించిన వొండ్రుసోవాకు 23 లక్షల 50 వేల పౌండ్లు (25 కోట్ల 29 లక్షల రూపాయలు), రన్నరప్ జబర్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (12 కోట్ల 64 లక్షల రూపాయలు) ప్రైజ్ మనీ లభించాయి.



అమెరికా నుండి 'ఇమిగ్రెంట్ అచీవ్‌మెంట్ అవార్డు' అందుకున్న తెలుగు తేజం - ప్రొఫెసర్ నీలి బెండపూడి : అమెరికాలో ఉన్నత విద్యకు విశేష కృషి చేసినందుకు ఇమిగ్రెంట్ అచీవ్‌మెంట్ అవార్డును గుంటూరు కు చెందిన తెలుగు మహిళ నీలి బెండపూడి (59) అందుకున్నారు. అమెరికాలో ప్రతిష్టాత్మక పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ అధ్యక్షురాలిగా నియమితులైన తొలి మహిళ నీలి బెండపూడి. భారత దేశంలోని గొప్ప విద్యాలయాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రెండు దేశాలు అవసరమైన సిఫార్సులు చేసే కోచర్‌గా ఆమె నియమితులయ్యారు.



వింబుల్డన్ విజేత - స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ : వింబుల్డన్ ఫైనల్‌లో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) చేతిలో రెండో సీడ్ జోకోవిచ్ (సెర్బియా) ఓడిపోయాడు. 4 గంటల 42 నిమిషాల పాటు సాగిన పోరులో అల్‌కరాజ్ 1-6, 7-6, (8-6), 6-1, 3-6, 6-4 స్కోరుతో జోకోవిచ్‌పై నెగ్గాడు. 2022 లో యు.ఎస్. ఓపెన్ సాధించిన అల్‌కరాజ్‌కు ఇది రెండో గ్రాండ్ స్లామ్ టైటిల్ విజేత అల్‌కరాజ్‌కు 23 లక్షల 50 వేల పౌండ్లు (25 కోట్ల 29 లక్షలు), రన్నరప్ జోకోవిచ్‌కు 11 లక్షల 75 వేల పౌండ్లు (12 కోట్ల 64 లక్షల రూపాయలు) ప్రైజ్ మనీ లబించాయి.

స్పెయిన్‌లో కార్చిచ్చు : స్పెయిన్‌లో కానరీ దీవుల్లో కార్చిచ్చు చెలరేగింది. సుమారు 11 వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాన్ని మంటలు దహించివేశాయి. మంటలను అదుపు చేసేందుకు ప్రభుత్వం 400 మంది సిబ్బందిని రంగంలోకి దించింది. ఇప్పటి వరకు 4 వేల మందికి పైగా ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించింది. మంటల్లో 12కు పైగా నివాసాలు కాలిపోయాయి. మంటలను అదుపు చేసేందుకు సీ-ప్లేన్ లను కూడా వినియోగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

హిందీ భాషను ప్రోత్సహించడానికి భారత్ ఒక మిలియన్ దాలర్ల విరాళం : హిందీ భాషాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ఐక్యరాజ్య సమితికి భారత్ ఒక మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చింది. గ్లోబల్ కమ్యూనికేషన్స్ అండ్ సెక్రటరీ జనరల్ మెలిస్సా ఫ్లెమింగ్ భారత్ దేశం మరియు వెలుపల హిందీ మాట్లాడే ప్రేక్షకులకు ఐక్యరాజ్య సమితి వార్తలు, కథనాలను అందించే లక్ష్యంతో ఏ ఖచీ అఅ ఎఅఅఎఅ సేవలో ఉదారంగా పెట్టుబడులు పెట్టిన @ India UN Newyork మరియు @ ruchirakamboj కు కృతజ్ఞతలు తెలిపారు. UN లో హిందీని పరిచయం చేయడం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ కారణమని చెప్పవచ్చు. 1977లో విదేశీ వ్యవహారాల మంత్రిగా పని చేసినప్పుడు ఖచీ లో హిందీలో ప్రసంగించిన మొదటి భారతీయ అధికారి వాజ్‌పేయ్.

ప్రొఫెసర్ ప్రదీప్‌కు అంతర్జాతీయ ఈని అవార్డు : ఇండియన్ ఇన్ ఇడియేషన్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ లోని కెమిస్ట్రీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ తలపిల్ ప్రదీప్ ప్రతిష్టాత్మకమైన 'ఎని అవార్డు'తో గుర్తించబడ్డారు. ఎనర్జి ట్రాన్సిషన్, ఎనర్జీ ఫ్రాంటియర్స్ అడ్వాన్స్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ అనే మూడు విభాగాల్లో ఈని అవార్డులను ప్రధానం చేస్తారు. దీనిని 2007లో స్థాపించారు. పర్యావరణ రంగాలలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ అవార్డు ప్రొఫెసర్ ప్రదీప్ నీటి నుంచి విషపూరిత కలుషితాలను తొలగించే స్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడిన నానోస్కెల్ పదార్థాల ఆవిష్కరణ చేయడం జరిగింది. దీని వలన ప్రతిరోజూ భారతదేశంలో 1.3 మిలియన్ ప్రజలు ప్రయోజనం పొందుతారు.

యువతకు లైసెన్స్ గాలం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత లైసెన్స్‌ల జాతర
- తాజాగా సంగారెడ్డి, నారాయణఖేడ్, మెదక్‌లో షురూ
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో కౌంటర్లు
- ఇప్పటికే సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో దరఖాస్తుల స్వీకరణ





- లీడర్ల ప్రచారాలకు రవాణా అధికారుల తోడ్పాటు
- నియోజకవర్గంలో ఐదారువేల దరఖాస్తుల సేకరణ

ఎన్నికల వేళ యువతను ఆకర్షించేందుకు రాజకీయ నాయకులు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల పేరిట గాలమేస్తున్నారు. అధికార, విపక్ష పార్టీలన్నీ ఉచితంగా లైసెన్స్‌లు ఇప్పిస్తామంటూ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. సిద్దిపేట జిల్లాలో మొదలైన ఉచిత లైసెన్స్‌ల వ్యవహారం మెదక్, సంగారెడ్డి జిల్లాకు పాకింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ నాయకులు తమ క్యాంపు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టి దరఖాస్తుల్ని స్వీకరిస్తున్నారు. లీడర్ల రాజకీయ ప్రయోజనం కోసం చేపట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లిచ్చే కార్యక్రమానికి రవాణా శాఖ అధికారులు తలూపడం ఏమిటనే విమర్శ వినిపిస్తోంది.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

నియోజవర్గంలోని యువతను ఆకర్షించేందుకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామంటూ ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఇదో సంక్షేమ పథకం మాదిరిగా ప్రచారం చేశారు. ఇప్పుడు మెదక్, సంగారెడ్డి, నారాయణఖేడ్, పటాన్‌చెరులోనూ జోరందుకుంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్నికల్లో పోటీ చేయాలని బావిస్తున్న నాయకులు ఉచిత లైసెన్స్‌ల కార్యక్రమాన్ని చేపట్టారు.

ఒక్కో నియోజకవర్గంలో ఐదారు వేల దరఖాస్తులు

18 ఏళ్ల వయసు పైబడిన యువతీయువకులకు ఉచితంగా లైసెన్స్‌లు ఇప్పిస్తామంటూ ఆయా నియోజకవర్గాల్లో దరఖాస్తుల్ని సేకరిస్తున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇద్దరూ తమ క్యాంపు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు పెట్టారు. ఇద్దరు కూడా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేయనున్నారు. అందు కోసం యువతీయువకుల్ని ఆకర్షించడం కోసం లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారు. నియోజకవర్గంలోని మిరుదొడ్డి, దౌల్తాబాద్, దుబ్బాక, నార్సింగ్, చేగుంట, తొగుట, రాయపోలు మండలాల్లోని యువత దరఖాస్తులు చేసుకోవాలని ఫ్లెక్సీలు, కరపత్రాలు, సోషల్ మీడియాలో పోస్టుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. క్యాంపు కార్యాలయాల్లో ఐదారుగురు యువకుల్ని పెట్టి దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఇంతకు ముందే సిద్దిపేట నియోజకరవ్గంలో ఇదే కార్యక్రమాన్ని మంత్రి హరీశ్‌రావు తరపున నిర్వహించారు. తాజాగా మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తన క్యాంపు కార్యాయంలో పది మంది యువకులతో కౌంటర్లు పెట్టి దరఖాస్తులు తీసుకుంటున్నారు. హవేలీఘన్‌పూర్, పాపాన్నపేట, మెదక్, చిన్న శంకరంపేట, రామాయంపేట, నిజాంపేట మండలాల నుంచి యువకులు వచ్చి బారులు తీరి దరఖాస్తులిస్తున్నారు. ఆయా మండలాలకు పార్టీ తరపున ఒకరిద్దర్ని బాధ్యుల్ని పెట్టి గ్రామాల వారిగా లైసెన్స్‌లు లేని వారిని గుర్తించి దరఖాస్తులు చేయిస్తున్నారు. ఇప్పటికే పాపన్నపేట మండలం నుంచి 1250, హవేలీఘన్‌పూర్ నుంచి 1400 దరఖాస్తులు వచ్చాయి. ఇలా నియోజకవర్గంలో ఆరువేలకుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశముంది.

సంగారెడ్డి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్ కూడా యువత ఓట్ల కోసం ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఫ్లెక్సీలు, సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు పెట్టి దరఖాస్తులు తీసుకుంటున్నారు. నారాయణఖేడ్ నియోజవర్గంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కూడా తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు పెట్టి దరఖాస్తుల్ని సేకరిస్తున్నారు. పటాన్‌చెరులో ఆటో, ట్రాలీ డ్రైవర్లకు లైసెన్స్‌లు ఇప్పించారు.

లైసెన్స్ పేరిట డేటా సేకరణ

ఉచిత లైసెన్స్‌ల పేరిట యువత నుంచి డేటా సేకరిస్తున్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్, ఈ మేయిల్, ఊరు, మండలం వంటి పూర్తి అడ్రస్ వివరాలు తీసుకుంటున్నారు. దరఖాస్తుదారుడి వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. అట్టి వివరాలను రాబోయే ఎన్నికల వేళ ఉపయోగించుకునే అవకాశముంది. ఆర్టీఓ ఆఫీస్‌లో దరఖాస్తుల్ని అందజేయడం పేరిట పూర్తి వివరాలు తీసుకుంటున్నారు. ఆ వివరాల ప్రకారం రాబోయే ఎన్నికల్లో యువతకు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన మెసేజ్‌లు, అభ్యర్థికి సంబంధించిన వీడియోలు పంపి ప్రచారం చేసుకునే అవకాశముంది. డబ్బుల పంపిణీ, ప్రచారం కోసం ఇదంతా ఉపయోగపెట్టుకోనున్నారు. ఆర్టీఓ అధికారులు ఒకే సారి వేలాది మందికి లైసెన్స్‌లిచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఇలా చేస్తే డ్రైవింగ్ టెస్ట్‌లో చూసిచూడనట్లు ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.



చింత ప్రభాకర్

నియోజకవర్గంలో రూ.2 కోట్ల ఖర్చు

లైసెన్స్‌లు ఇస్తున్నామని చేసుకుంటున్న ప్రచారం ఎక్కువ చేసే సాయం తక్కువ అన్నట్లుగా ఉంది. ఒక్కో వ్యక్తికి లైసెన్స్ తీసుకోవాలంటే ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఫోర్ వీలర్‌కు రూ.500, టూ వీలర్‌కు రూ.300 స్లాట్ బుకింగ్ సందర్భంగా చెల్లించాలి. లెర్నింగ్ ఇచ్చాక నెల రోజుల తర్వాత డ్రైవింగ్ టెస్టింగ్ ఉంటుంది. అప్పుడు ఫోర్ వీలర్ లైసెన్స్‌కు రూ.1430, టూ వీలర్‌కైతే రూ.1100 చాలన్ కట్టాలి. ఇలా ఒక వ్యక్తి టూ వీలర్‌కైతే రూ.1400, ఫోర్ వీలర్‌కైతే రూ.2 వేలు రవాణా శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఏజెంట్ ద్వారా లైసెన్స్ పొందాలంటే సగటు రూ.4 వేలు ఖర్చు అవుతాయి. చాలన్స్ కట్టడం, ఆర్టీఓ అధికారులతో ప్రత్యేకంగా టెస్టింగ్ క్యాంపు పెట్టడం, దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్లు, సిబ్బంది కోసం ఇలా ఒక్కో నియోజకవర్గంలో ఐదు వేల మందికి లైసెన్స్ ఇప్పించడం ద్వారా రూ.కోటీన్నర నుంచి రూ.2 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పది అసెంబ్లీ నియోకజవర్గాల్లోనూ ఉచిత లైసెన్స్‌లు ఇప్పించే కార్యక్రమం పేరిట రూ.20 కోట్ల వరకు లీడర్లు వెచ్చించనున్నారు.

ప్రధానమంత్రి మౌనం వీడాలి



- మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి
- బిజెపి ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలి
- సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం

మణిపూర్ బిజెపి పాలిత రాష్ట్రంలో జరుగుతున్న అరాచకత్వంపై ప్రధానమంత్రి నోరు విప్పి మాట్లాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రం సుందరయ్య భవన్ లో సిపియం జిల్లా కమిటీ సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యతన జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లడుతూ మణిపూర్ ఘటన దేశాన్ని కలిచి వేసినా కనీసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం, మహిళల పట్ల బిజెపి ప్రభుత్వ వైఖరి అర్థమవుతుందని, బిజెపి పాలిత ప్రాంతమైన మణిపూర్‌లో మహిళలకు రక్షణ లేదని నేడు జరిగిన సంఘటనతో అర్థమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగి 75 రోజులు గడుస్తున్నా కనీసం ప్రధానమంత్రి ఈ ఘటనపై మాట్లాడకుండా ప్రతిపక్షాలు ఎంత మొరపెట్టుకున్నా మణిపూర్ అల్లర్లకు సంబంధం లేనట్టుగా దేశ ప్రధాని వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళల పట్ల దాడులు, అత్యాచారాలు, హత్యలు అత్యధికం అవుతున్నా, కనీసం రక్షణ కల్పించలేని కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉండడం దురదృష్టకరమని, రానున్న కాలంలో మహిళల భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉండబోతోందని అర్థమవుతుందని వారు తెలిపారు. వెంటనే మణిపూర్‌ను రక్షించాలని, మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని వెంటనే కఠినంగా శిక్షించి మణిపూర్ అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ముగ్గురు గిరిజన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి సామూహిక అత్యాచారం చేయడాన్ని యావత్ భారతదేశం అసహ్యించుకుంటోందని, ఇందుకు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రధాన కారణమని విమర్శించారు. బిజెపి భేటీ పడావో, బేటి బచావో అనే నినాదం మాటలకే పరిమితంగా ఉన్నదని అన్నారు. మణిపూర్‌లో వెంటనే శాంతి నెలకొల్పాలని కోరారు. మణిపూర్ లోని గిరిజన ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించలేని రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీకి గత మూడు నెలల నుండి మణిపూర్ను సందర్శించడానికి సమయం దొరకడం లేదు కానీ, విదేశీ పర్యటనలు, దేశంలో వివిధ రాష్ట్రాల్లో పర్యటనలు చేయడానికి సమయం దొరుకుతుందని అన్నారు. బిజెపికి ప్రజల ప్రాణాల కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. మణిపూర్లో జరిగిన ఘటనను దేశ ప్రజలందరూ ఖండించాలని కోరారు. మణిపూర్‌లో వందలాదిమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది నిరాశ్రయులు అయ్యారని, మణిపూర్‌లో ఏం జరుగుతుందో, ఏం చర్య తీసుకుంటున్నారో ఇప్పటివరకు దేశ ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేని దుస్థితి నేడు దేశంలో నెలకొని ఉందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మణిపూర్ అల్లర్ల ద్వారా రాజకీయంగా లబ్ది పొందడానికే అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. సుదర్శన్ మాట్లాడుతూ, మణిపూర్ ఘటనపై 25న ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మణిపూర్ ఆదివాసులకు సంఘీభావంగా కార్యక్రమాలను జిల్లాలో చేయాలని, అన్ని జిల్లాలు చేయాలని పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు, వామపక్ష శ్రేయోభిలాషులు ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. 54 శాతానికి పైగా ఉన్న మైథిలి కులస్తులకు కుకీ, నాగా గిరిజన తెగల మధ్య బిజెపి తన రాజకీయ లబ్ది కోసం చిచ్చు పెట్టిందని విమర్శించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతీలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందని తెలిపారు. ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేస్తుందని పేర్కొన్నారు. దీన్ని ప్రతిఘటించిన కుకి, నాగ తెగలపై మతోన్మాద శక్తులు బిజెపి అండతో రెండున్నర నెలలుగా తీవ్రమైన దాడులకు తెగబడుతున్నాయని విమర్శించారు. గృహ దహనాలు చర్చీలతో పాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్రం, మణిపూర్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు బాధ్యత వహించి, దోషులను శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని సుదర్శన్ రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.